www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 4-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 246 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ.8.38, పౌర్ణమి తె.4.43 వరకు; నక్షత్రం: కృత్తిక మ.2.54 తదుపరి రోహిణి; వర్జ్యం: తె.4.48-6.12; దుర్ముహూర్తం: ఉ.10.15-10.59, మ.2.39-3.23; అమృతఘడియలు: మ.12.48-2.12; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

1,232 'ఇండిగో' విమానాలు రద్దు



- కొద్దిరోజులుగా సమస్యల్లో విమానయాన సంస్థ
- 35 శాతం విమాన సర్వీసులనే నడిపిన ఇండిగో
- వేతనాలు ఇవ్వకపోవటంతో సిబ్బంది గైర్హాజరు?
- దేశవ్యాప్తంగా ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం
- క్షమాపణలు చెప్పిన ఇండిగో

2

ఇంటి దొంగలెవరు?

హిల్ట్ పత్రాల లీకేజీపై ఇంటెలిజెన్స్ విచారణ

రంగంలో దిగిన నిఘా బృందాలు

సచివాలయంలోని అధికారులను, సిబ్బందిని ప్రశ్నించే అవకాశం

బీఆర్ఎస్‌తో సంబంధాలపై ఆరా

13



రూపాయె

రూపాయి మహా పతనం

డాలర్‌తో రూ.90.15కు చేరిన విలువ

2

రూపాయి చరిత్రలో ఇదే అత్యంత బలహీన స్థాయి

విదేశీ మదుపరుల అమ్మకాల ఒత్తిడి, అమెరికాతో ఒప్పందంలో జాప్యం వల్లే..

పేద, మధ్యతరగతి వర్గాలపై రూపాయి పతనం ప్రభావం

ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీలదే జోరు!

జనరల్ విభాగం విద్యార్థుల్ని మించిన సంఖ్య

దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు 60.8 శాతం

జనరల్ విద్యార్థులు 39%!

ఐఐఎం ఉదయ్‌పూర్ అధ్యయనంలో వెల్లడి

2

'అగ్రవర్ణాల ఆధిపత్యం' ఆరోపణలు అవాస్తవం!

తెలంగాణ మోడల్ సృష్టిస్తా

మీకు మన్మోహన్ సహకరించినట్లు.. మీరూ నాకు సహకరించండి

వికసిత్ భారత్‌కు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాం

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కండి

ప్రధాని మోదీని కోరిన సీఎం

కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకకూ ఆహ్వానం

ఢిల్లీలో ప్రధాని మోదీతో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, ఎంపీలు కడియం కావ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌యాదవ్



రెండోసారీ నేనే సీఎం

పదేళ్లు నా సారథ్యంలోనే తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్

ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

దుర్మార్గపాలనను అంతం చేసి ప్రజాపాలన తెచ్చుకున్న రోజు డిసెంబరు 3

శ్రీకాంతాచారి అమరుడైన రోజు ఇదే

ఆయన ఆశయసాధనలో 60వేల ఉద్యోగాల భర్తీ

వచ్చే 6 నెలల్లో మరో 40వేల ఉద్యోగాల కల్పన

నెహ్రూ హయాం ప్రాజెక్టులు ఇప్పటికీ సురక్షితం

బీఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం.. కూలేశ్వరం అయింది

పంచాయతీ ఎన్నికల్లో కిరికిరిగాళ్లను ఎన్నుకోవద్దు

మాతో కలిసి పనిచేసేవాళ్లను ఎన్నుకోండి

హుస్నాబాద్‌లో బహిరంగ సభలో సీఎం రేవంత్

న్యూఢిల్లీ, సిద్దిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి రెండు టర్ములపాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో అన్నారు. బుధవారం పార్లమెంట్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడినాయన.. కర్ణాటకలో సీఎం పదవి కోసం జరుగుతున్న పోటీ గురించి ప్రస్తావించినప్పుడు ఇలా స్పందించారు. పదేళ్లపాటు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ సర్కార్ కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం.. ఢిల్లీ నుంచి రాష్ట్రానికి చేరుకున్న సీఎం.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. "పదేళ్ల దుర్మార్గ పాలనను అంతమొందించి ప్రజాపాలనను తెచ్చుకున్న రోజు ఇది. గడీల పాలనకు చరమగీతం పాడిన రోజు ఇది. 2023 డిసెంబరు 3న

మిగతా 13వ పేజీలో...

హిందూ దేవుళ్ల అంశంలో సీఎం వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేపీ

హైదరాబాద్‌లో నిరసనలు, రేవంత్ దిష్టిబొమ్మల దహనం

9

కాంగ్రెస్ నేతలకు ఇతర మతాల దేవుళ్లకు వ్యతిరేకంగా మాట్లాడే దమ్ముందా?: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నా మాటలు వక్రీకరించారు

హిందూ దేవుళ్లను అవమానించాననడం పచ్చి అబద్ధం

9

జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోయిన నిరాశతో బీజేపీ దుష్ప్రచారం: సీఎం

రూ. లక్ష కోట్లు

రాష్ట్రంలో పెట్టుబడులకు 14 కంపెనీలు సిద్ధం

రూ.70 వేల కోట్లతో టీసీఎస్-టీపీజీ డేటా కేంద్రాలు

హ్యుందాయ్ కార్ల ఫ్యాక్టరీ, 25 బయోగ్యాస్ ప్లాంట్లు

వంతారా జూ ఏర్పాటుకు రిలయన్స్ కంపెనీ సిద్ధం

ఫిల్మ్‌సిటీ ఏర్పాటు చేయనున్న నటుడు అజయ్ దేవ్‌గన్

సింగపూర్, తైవాన్ కంపెనీల పారిశ్రామికవాడలు

100 ఎకరాల్లో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు

తెలంగాణ రైజింగ్ సదస్సులో ప్రకటించనున్న సీఎం

సదస్సులో పాల్గొనేందుకు 4,800 మందికి ఆహ్వానాలు

పలువురు పారిశ్రామిక దిగ్గజాలు, నిపుణుల సంసిద్ధత



9

నేడే భారత్‌కు పుతిన్

రాత్రి ఏడు గంటలకు ఢిల్లీకి.. ప్రధాని ఇచ్చే విందుకు హాజరు

రేపు మోదీతో హైదరాబాద్ హౌస్‌లో సమావేశమై చర్చలు

ఎన్ఎస్‌జీ కమాండోలు, స్నైపర్లు, డ్రోన్లు, ఏఐతో ఐదంచెల భద్రత



న్యూఢిల్లీ, డిసెంబరు 3: రెండు రోజుల పర్యటన నిమిత్తం రష్యా అధ్యక్షుడు పుతిన్ గురువారం.. దేశ రాజధాని ఢిల్లీలో అడుగుపెట్టనున్నారు. పుతిన్ చివరిసారిగా 2021లో భారత్‌కు వచ్చారు. ఆ తర్వాత మళ్లీ రావడం ఇదే. షెడ్యూలు ప్రకారం ఆయన గురువారం సాయంత్రం 7 గంటలకు ఢిల్లీకి చేరుకుంటారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చే ప్రైవేట్ డిన్నర్‌కు హాజరవుతారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతి భవన్

2

మిగతా 2వ పేజీలో...

ఆ దౌత్యవేత్తల తీరు అభ్యంతరకరం

ఫ్రాన్స్, జర్మనీ, యూకే రాయబారుల వ్యాసాన్ని తప్పుబట్టిన విదేశాంగశాఖ

రష్యాను విమర్శిస్తూ ఓ భారతీయ పత్రికలో వ్యాసం

పుతిన్‌కు శాంతి నెలకొల్పే ఆలోచనే లేదని ఆరోపణ

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టుల మృతి



మావోయిస్టు మొడియం వెల్ల

ముగ్గురు జవాన్ల మృత్యువాత.. ఇద్దరికి గాయాలు.. బైంగఢ్ అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

నక్సల్ నేత పాపారావు ఉన్నట్లు సందేహాలు.. మావోయిస్టుల మృతదేహాలు, తుపాకుల స్వాధీనం

పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో ఘటన.. జవాన్ల త్యాగాలు వృథా కానివ్వం: ఛత్తీస్‌గఢ్ సీఎం

చింతూరు/చర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భైరంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుట్టల్లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మరణించారు. ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు కూడా మృతి చెందారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఘటనా స్థలం నుంచి ఇన్సాస్, ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 303 తుపాకులు, ఎల్ఎంజీ మెషీన్ గన్లు, ఏకే 47లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. భైరంగఢ్ అడవుల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. బీజాపూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలోనే మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు జవాన్లు మృతి చెందినట్లు చెప్పారు. ఇద్దరు జవాన్లు గాయపడ్డారని, వారి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని, మరికొందరు

మిగతా 3వ పేజీలో...



మృతిచెందిన జవాన్లు

శ్వాస తీసుకోలేడు.. అన్నం తినలేడు

ఏడాది గడిచినా దయనీయ స్థితిలోనే శ్రీతేజ్

ఒంటినిండా ట్యూబులతో చలనం లేకుండా..

పైపుతో ద్రవాహారం.. ప్రతి రోజూ థెరపీలు

ఉద్యోగం మానేసి కుమారుడికి తండ్రి సపర్యలు

నెలకు రూ.1.50 లక్షల దాకా అవుతున్న ఖర్చు

రూ.2 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన అల్లు అర్జున్

చికిత్స ఖర్చులకు ఏమాత్రం సరిపోని వడ్డీ డబ్బులు

శ్రీతేజ్ కోలుకునే దాకా అండగా ఉంటామన్న అల్లు కుటుంబం హామీని గుర్తు చేస్తున్న తండ్రి

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు ఏడాది



ఆస్పత్రిలో శ్రీతేజ్‌తో తండ్రి భాస్కర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా.. నిర్మాతలకు కాసుల పంట పండించి ఉండొచ్చు. అల్లు అర్జున్‌ను పాన్ ఇండియా స్టార్‌గా మరో మెట్టు ఎక్కించి ఉండొచ్చు. కానీ, ఒక కుటుంబానికి మాత్రం జీవిత కాలపు పీడకలను మిగిల్చింది. రెండు తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా కలవర పెట్టిన ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ దుర్ఘటన జరిగి బుధవారంతో ఏడాది అవుతోంది. అమ్మ, నాన్న, చెల్లితో కలిసి తన అభిమాన నటుడి సినిమా చూడడానికి వెళ్లిన పదేళ్ల శ్రీతేజ్.. తొక్కిసలాటలో తల్లిని కోల్పోయాడు. అదే ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీతేజ్.. తన తల్లి ఇక లేదన్న సంగతి కూడా

మిగతా 10వ పేజీలో...

పంచాయతీ ఎన్నికలకు 175 కోట్లు

పంచాయతీరాజ్ శాఖకు విడుదల చేసిన సర్కారు.. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

బిల్లుల చెల్లింపుల్లోనూ మార్పులు.. 75% అడ్వాన్స్ చెల్లించాలని ఆర్థిక శాఖ ఉత్తర్వు

12

ఇంట్లో 'పంచాయతీ'.. ఆత్మహత్య!..

- తల్లి, కూతురు నామినేషన్.. వెనక్కి తగ్గిన కుమార్తె
- ఇంట్లో గొడవ.. మనస్తాపంతో తల్లి బలవన్మరణం
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరులో ఘటన
- వికారాబాద్ జిల్లా గొట్లపల్లిలో నామినేషన్ పత్రాల అపహరణ

బీజేపీకి టాటా ట్రస్టు నుంచి రూ.757 కోట్లు

» 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారీగా అందిన విరాళాలు

» రూ.10 కోట్ల చొప్పున బీఆర్ఎస్, వైసీపీలకు

న్యూఢిల్లీ, డిసెంబరు 3: గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీకి విరాళాల వరద పోటెత్తింది. టాటా గ్రూప్ నేతృత్వంలోని ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్ట్(పీఈటీ) నుంచి 2024 పార్లమెంటు ఎన్నికల సమయంలో బీజేపీకి రూ.757 కోట్లు అందాయి. ఆ ఎన్నికల సమయంలో మొత్తం 10 రాజకీయ పార్టీలకు పీఈటీ రూ.914 కోట్లను విరాళాలుగా అందించగా.. దీనిలో 83% నిధులు ఒక్క బీజేపీకే అందడం విశేషం. పీఈటీ నుంచి కాంగ్రెస్ పార్టీ రూ.77.3 కోట్లు అందుకుంది. బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు పశ్చిమబెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ(టీఎంసీ), ఏపీకి చెందిన వైసీపీ, మహారాష్ట్రకు చెందిన శివసేన, ఒడిశాకు చెందిన బీజేడీ, తెలంగాణకు చెందిన బీఆర్ఎస్, బీహార్‌కు చెందిన ఎల్జేపీ, జేడీయూ, తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీలకు రూ.10 కోట్ల చొప్పున పీఈటీ విరాళాలుగా అందించింది. ఇదిలా ఉండగా, 2024-25 సంవత్సరంలో వివిధ ట్రస్టులు, సంస్థల నుంచి కాంగ్రెస్‌కు మొత్తం రూ.517.37 కోట్లు విరాళాలుగా అందాయి. ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.216.33 కోట్లు, ఏబీ జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.15 కోట్లు, న్యూ డెమొక్రటిక్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా రూ.5 కోట్లు, జన్ కల్యాణ్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి రూ.9.5 లక్షల చొప్పున కాంగ్రెస్‌కు విరాళాలుగా అందాయి.

ఆ 32వేల మంది ఉపాధ్యాయుల నియామకాలు చెల్లుతాయ్

» పశ్చిమ బెంగాల్‌లో 2014లో నిర్వహించిన టెట్‌పై కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక తీర్పు

కోల్‌కతా, డిసెంబరు 3: పశ్చిమబెంగాల్‌లో తీవ్ర వివాదాస్పదమైన 'ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం' వ్యవహారంపై కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 32వేల మంది ప్రైమరీ టీచర్ల నియామకాన్ని రద్దు చేస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ కొట్టేసింది. ఆ టీచర్ల నియామకాలు చెల్లుబాటు అవుతాయని తీర్పునిచ్చింది. 2014లో టెట్ ద్వారా ఉపాధ్యాయులుగా నియమితులైనవారందరూ అక్రమంగా ఉద్యోగాల్లో చేరినట్లు దర్యాప్తులో తేలలేదని ఈ సందర్భంగా గుర్తుచేసింది. "264మంది మాత్రమే డబ్బులిచ్చి ఉద్యోగంలో చేరారని సీబీఐ దర్యాప్తులో తేలింది. మరో 96మంది పాత్ర అనుమానాస్పదంగా ఉంది. ఈ నేపథ్యంలో మొత్తం 32వేల మంది నియామక ప్రక్రియనే రద్దు చేయడం సరికాదు. తొమ్మిదేళ్లుగా వారంతా సర్వీసులో ఉన్నారు. ఇప్పుడు ఆ నియామకాలను రద్దు చేస్తే, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుంది" అని కోర్టు వ్యాఖ్యానించింది. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ తీర్పు మమత ప్రభుత్వానికి కొంత ఉపశమనం కలిగించనుంది. డివిజన్ బెంచ్ తీర్పును బెంగాల్ విద్యాశాఖ మంత్రి బ్రత్య బసు స్వాగతించారు. పశ్చిమ బెంగాల్‌లో 2014లో టెట్ జరిగింది. అయితే, పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

తనకన్నా ఎవ్వరూ అందంగా ఉండొద్దని..

» కుమారుడు సహా నలుగురు చిన్నారులను హత్యచేసిన మహిళ.. హరియాణాలో ఘోరం



పూనమ్

పానిపట్, డిసెంబరు 3: మేళతాళాల మధ్య సందడిగా ఉన్న ఆ పెళ్లి వేడుక క్షణాల్లో విషాదంగా మారింది. ఓ ఆరేళ్ల బాలిక నీటితొట్టిలో విగతజీవిగా కనిపించింది. ఆ చిన్నారి ప్రమాదవశాత్తు చనిపోలేదని, ఆమెను స్వయానా ఆమె మేనత్తే హత్యచేసిందని తెలిసి అంతా నిర్ఘాంతపోయారు. హరియాణాలోని పానిపత్‌లో సోమవారం ఈ దారుణ ఘటన జరిగింది. మరింత దిగ్భ్రాంతికి గురిచేసే అంశమేమిటంటే.. ఆ చిన్నారినే కాదు గతంలో తన కుమారుడు సహా ముగ్గురు చిన్నారులను ఆమె ఇలానే హత్యచేసిందని పోలీసులు తేల్చారు. తన కన్నా అందంగా ఎవ్వరూ ఉండొద్దనే ఉద్దేశంతోనే ఆమె ఇంతటి ఘాతుకానికి పాల్పడిందని విచారణలో తేలింది. నిందితురాలిని పూనమ్‌గా గుర్తించారు. పెళ్లి వేడుకలో ఆమె హత్యచేసిన చిన్నారి పేరు విధి. ఈ ఏడాది ఆగస్టులో పూనమ్, సివాహ్ గ్రామంలో ఓ బాలికను చంపేసింది. 2023లో పూనమ్, మొదటి హత్య చేసింది. తనకన్నా ముద్దుగా కనిపిస్తోందనే ఉద్దేశంతో తన వదిన కుమార్తె ప్రాణాలు తీసింది. ఈ ఘటనకు సంబంధించి తననెవ్వరూ అనుమానించకుండా ఉండేందుకు తన పేగు తెంచుకొని పుట్టిన కుమారుడిని పూనమ్ చంపేసింది. గతంలో జరిగిన ఈ మూడు మరణాలు ప్రమాదవశాత్తు జరిగినవేనని ఇప్పటిదాకా అంతా అనుకున్నారు. తాజాగా బాలిక విధి హత్య మిస్టరీ తేలాకే.. గతంలో ముగ్గురిని పూనమ్ చంపినట్లు తేలింది. నలుగురు చిన్నారులనూ ఆమె ఒకే విధంగా నీటి తొట్టిలో ముంచి చంపేసింది. నిందితురాలిని పోలీసులు అరెస్టు చేశారు.

13 ఏళ్ల బాలుడికి తుపాకీ ఇచ్చి చంపించారు

» అఫ్గానిస్థాన్‌లో 80వేల మంది చూస్తుండగా మరణ శిక్ష

న్యూఢిల్లీ, డిసెంబరు 3: అఫ్గానిస్థాన్‌లో 80వేల మంది జనం చూస్తుండగా ఓ వ్యక్తిని తాలిబన్లు బహిరంగంగా కాల్చి చంపించారు. అంతకుమించి దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే ఆ వ్యక్తిని కాల్చి చంపింది పాలబుగ్గల వయసున్న ఓ 13 ఏళ్ల బాలుడు! శిక్షకు గురైంది ఖోస్ట్ ప్రావిన్సులోని కుజి అబుఖానీ ప్రాంతానికి చెందిన మంగల్ అలియాస్ తలాఖాన్ అనే వ్యక్తి. 10నెలల క్రితం అబ్దుల్ రహమాన్ సహా అతడి కుటుంబంలోని 13 మందిని మంగల్ కాల్చి చంపాడు. మృతుల్లో తొమ్మిది మంది చిన్నారులు, ముగ్గురు మహిళలున్నారు. ఈ కేసులో మంగల్‌ను అఫ్గానిస్థాన్ సుప్రీంకోర్టు దోషిగా నిర్ధారించి మరణ శిక్ష విధించింది. బాధిత కుటుంబంలో 13 ఏళ్ల బాలుడొక్కడే ప్రాణాలతో మిగిలాడు. ఖోస్ట్ ప్రావిన్సులోని ఓ స్టేడియంలో మంగళవారం 80వేల మంది ప్రజలు చూస్తుండగా దోషి మంగల్‌ను పెడరెక్కలు విరిచి కట్టి నిల్చోబెట్టారు. ఆ సమీపంలోనే బాధిత కుటుంబానికి చెందిన బాలుడిని నిల్చోబెట్టారు. ఆ చిన్నారిని ఉద్దేశించి.. "దోషిని క్షమించి ప్రాణాలతో వదిలేస్తావా?" అని తాలిబన్ ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి ఆ బాలుడు తిరస్కరించగా.. అతడి చేతికి తుపాకీ ఇచ్చారు. ఆ వెంటనే బాలుడు, మంగల్‌వైపు తుపాకీని గురిపెట్టి మూడు రౌండ్ల కాల్పులు జరిపాడు. మంగల్ అక్కడికక్కడే మృతిచెందాడు.

బంగ్లాకు పంపేసిన ఆ గర్భిణిని భారత్‌కు తీసుకురండి

న్యూఢిల్లీ, డిసెంబరు 3: భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు ఇటీవల బహిష్కరింపబడిన గర్భిణి, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడిని తిరిగి భారతదేశానికి తీసుకొచ్చేందుకు సుప్రీం కోర్టు బుధవారం అనుమతినిచ్చింది. ఆ గర్భిణి విషయంలో మానవత కోణంలో వ్యవహరించాలని సూచించింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. సదరు గర్భిణి, మైనర్ బాలుడి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బంగ్లాదేశీయులను భారత్ నుంచి తిరిగి పంపేసే క్రమంలో భారత పౌరసత్వానికి సంబంధించిన సరైన పత్రాలు లేని కారణంగా ఢిల్లీకి చెందిన సునాలీ ఖాతూన్ అనే గర్భిణి, ఆమె ఎనిమిదేళ్ల కుమారుడిని 2025 జూన్ 27 బంగ్లాకు పంపేశారు.

ఖర్గే భుజాలకు రాహుల్ మసాజ్



న్యూఢిల్లీ, డిసెంబరు 3: కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే భుజాలకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మసాజ్ చేశారు. ప్రథమ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా బుధవారం పార్లమెంటులో జరిగిన నివాళి కార్యక్రమంలో ఈ ఆసక్తికర దృశ్యం చోటుచేసుకుంది. ఈ దృశ్యం నెట్‌లో వైరల్ అయింది. ఇక ఇదేరోజు పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ప్రియాంకా గాంధీ ఓ దివ్యాంగురాలి పక్కన కూర్చుని ఫొటో దిగారు. ప్రియాంక తనతో ఫొటో దిగడంతో ఆ యువతి మొహంలో కొండంత ఆనందం కనిపించింది. నెట్‌లో ఈ వీడియోను చూసి ప్రియాంకపై నెటిజన్లు ప్రశంసలు కురిపించారు.

రూపాయి మహా పతనం

అమెరికా డాలర్‌తో రూ.90.15కు చేరిన విలువ



» రూపాయి చరిత్రలో ఇదే అత్యంత బలహీన స్థాయి

న్యూఢిల్లీ, డిసెంబరు 3: రూపాయి విలువ మహా పతనం కొనసాగుతోంది. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ బుధవారం ఏకంగా రూ.90 దాటింది. కొంతకాలంగా వేగంగా పడిపోతున్న రూపాయి విలువ.. చరిత్రలోనే అత్యంత కనిష్ఠ స్థాయికి చేరింది. మంగళవారం ఒక డాలర్‌కు రూ.89.9475 ఉండగా.. బుధవారం ట్రేడింగ్ ఒకానొక దశలో రూ.90.30కు పడిపోయింది. చివరకు రూ.90.15 వద్ద స్థిరపడింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఆలస్యం కావటం, రూపాయి విలువను కాపాడేందుకు ఆర్బీఐ ఎలాంటి చర్యలు చేపట్టకపోవటం, విదేశీ సంస్థాగత పెట్టుబడులను(ఎఫ్ఐఐ) మదుపరులు వెనక్కి తీసుకోవటం రూపాయి పతనానికి ప్రధాన కారణాలని నిపుణులు పేర్కొంటున్నారు. రూపాయి పతనం ప్రభావం దేశంలోని పేద, మధ్యతరగతి వర్గాలపై భారీగా ఉంటుందని చెబుతున్నారు. ఒకవైపు జీడీపీ రేటు స్థిరంగా పెరుగుతుందని గణాంకాలు వెలువడుతుండగా, రూపాయి విలువ ఆగకుండా పతనం అవుతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే ఏడాది బలపడుతుంది: నాగేశ్వరన్

రూపాయి విలువ పతనంపై భయపడాల్సిన అవసరం ఏమీ లేదని, వచ్చే ఏడాది బలపడుతుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ఏడాది ఆసియా దేశాల కరెన్సీల్లో భారత రూపాయి పరిస్థితే అత్యంత దారుణంగా ఉందని కొటక్ సెక్యూరిటీస్‌కు చెందిన అనంద్య బెనర్జీ తెలిపారు.

వీరికి లాభం

● విదేశాల్లో సర్వీసులు అందించే ఐటీ, ఇతర వ్యాపార సంస్థలు రూపాయి పతనంతో లాభపడనున్నాయి. విదేశాలకు ఔషధాలు ఎగుమతి చేసే భారతీయ ఫార్మాకంపెనీలు కూడా లాభపడనున్నాయి.

● వస్త్రాలను ఎగుమతి చేసే టెక్స్‌టైల్స్ కంపెనీలు కూడా లాభపడుతాయి. అయితే, అమెరికాకు వెళ్లే భారతీయ ఉత్పత్తులపై ఆ దేశం 50 శాతం టారిఫ్ విధించటంతో భారతీయ కంపెనీలకు లాభాలు పెద్దగా ఉండకపోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

● విదేశాల నుంచి ఆదాయం పొందేవారికి రూపాయి పతనం శుభవార్తే. ఏటా భారత్‌కు విదేశాల నుంచి 138 బిలియన్ డాలర్ల వరకు ఈ రూపంలో వస్తున్నాయి. అంతర్జాతీయంగా రూపాయి విలువ తగ్గడం వల్ల ఇక్కడ మారకంలో ఎక్కువ డబ్బులు వస్తాయి.

పతనానికి కారణాలు మూడు..

డాలర్‌తో రూపాయి మారకం విలువ దారుణంగా పడిపోవటానికి మూడు కారణాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

1. కొంతకాలంగా మనదేశంలోకి విదేశీ వ్యవస్థాగత పెట్టుబడుల రాక తగ్గిందని, అదే సమయంలో ఇప్పటికే ఉన్న ఎఫ్ఐఐలను విదేశీ మదుపరులు వెనక్కి తీసేసుకుంటుండటంతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతిన్నదని చెబుతున్నారు.

2. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్బీఐ జోక్యం చేసుకోకపోవటం రెండో కారణంగా చెబుతున్నారు. రూపాయి విలువ పడిపోతున్నప్పుడు ఆర్బీఐ తన వద్ద ఉన్న డాలర్ల నిధుల్లో కొంతమొత్తాన్ని అమ్మేసి రూపాయి విలువను స్థిరీకరిస్తూ ఉంటుంది.

3. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఇంకా చర్చలు కొలిక్కి రాలేదు. భారత్‌పై ట్రంప్ భారీగా టారిఫ్‌లు విధించారు. ఇవి కూడా రూపాయి పతనానికి కారణాలని చెబుతున్నారు.

రూపాయి పతనం ప్రభావాల్లో కొన్ని..


రూపాయి విలువ పడిపోతే మొదట ప్రభావితం అయ్యేవి దిగుమతులు. మనకు అవసరమైన చమురులో 90 శాతాన్ని, వంటనూనెల్లో 60 శాతాన్ని విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు ఇవి మరింత ప్రియం కానున్నాయి. పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, ఎల్పీజీ ధరలు పెరిగే అవకాశం ఉంది. విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న భారతీయ విద్యార్థుల ఖర్చులు తడిసి మోపెడవుతాయి. డాలర్ల రూపంలో విద్యారుణం తీసుకున్న విద్యార్థులు ఇప్పుడు తిరిగి చెల్లించటం మరింత భారం అవుతుంది.

1,232 'ఇండిగో' విమానాలు రద్దు

» కొద్ది రోజులుగా సంస్థలో తీవ్ర సమస్యలు.. ఇండిగో క్షమాపణలు

న్యూఢిల్లీ, ముంబై/ శంషాబాద్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద పౌరవిమానయాన సంస్థ ఇండిగో సేవల్లో అంతరాయం నెలకొని దేశవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత సమస్యలతో సతమతం అవుతున్న ఇండిగో.. గత కొన్ని రోజుల్లోనే ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ బుధవారం ప్రకటించింది. సంస్థ నిర్వహిస్తున్న మొత్తం సర్వీసుల్లో బుధవారం 35% విమానాలే నడిపినట్లు తెలిపింది. సిబ్బంది కొరతతో 755 సర్వీసులు, ఏటీసీ సమస్యలతో 92 సర్వీసులు నిలిచిపోయినట్లు వెల్లడించింది. సర్వీసుల నిర్వహణలో వైఫల్యంపై డీజీసీఏ ప్రధాన కార్యాలయానికి స్వయంగా వచ్చి వివరణ ఇవ్వాలని ఇండిగో యాజమాన్యాన్ని ఆదేశించింది. హైదరాబాద్, బెంగళూరు, ముంబైలతోపాటు పలు విమానాశ్రయాల్లో మంగళ, బుధవారాల్లో ఇండిగో సర్వీసులు రద్దు కావటంతో ప్రయాణికులు ఆ సంస్థ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన ఫొటోలు, వీడియోలు వైరలయ్యాయి. ఈ నేపథ్యంలో, ప్రయాణికులకు క్షమాపణ చెబుతూ ఇండిగో ఒక ప్రకటన విడుదల చేసింది. 'సాంకేతిక, నిర్వహణాపరమైన సమస్యలు, విమానాశ్రయాల్లో నెలకొన్న రద్దీ కారణంగా గత రెండు రోజులుగా మా సర్వీసుల్లో అంతరాయం తలెత్తింది. దీనిని నివారించటానికి చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన చోట్ల ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. రీఫండ్ ఇస్తున్నాం' అని తెలిపింది. బుధవారం శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన, ఇక్కడికి రావాల్సిన ఇండిగోకు చెందిన 40 సర్వీసులు రద్దయ్యాయి. ఎయిర్‌పోర్టులో గందరగోళం ఏర్పడింది. కేరళలోని శబరిమల ఆలయానికి వెళ్లడానికి ఎయిర్‌పోర్టుకు వచ్చిన అయ్యప్ప స్వాములు విమానం రద్దు కావడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం షెడ్యూల్‌కు సంబంధించి మరో 18 విమాన సర్వీసులను ఇండిగో రద్దుచేసినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లోని చెక్‌ఇన్ వ్యవస్థల్లో బుధవారం ఉదయం అంతరాయం తలెత్తింది. పలు విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. ఈ అంతరాయానికి కారణాలేమిటన్నది అధికారికంగా వెల్లడి కాకపోయినా.. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సమస్యల వల్లేనంటూ వారణాసి విమానాశ్రయంలో ప్రయాణికులకు ఒక మెసేజీని ప్రదర్శించారు. అయితే, మైక్రోసాఫ్ట్ దీన్ని ఖండించింది.

లోకం తీరు



ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంఖ్య పైపైకి!

» జనరల్ విభాగాన్ని మించిపోయిన సంఖ్య

» ఐఐఎం ఉదయ్‌పూర్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 3: దేశవ్యాప్తంగా ఉన్నత విద్యలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన రిజర్వేషన్ కోటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఎంతలా అంటే.. జనరల్ విభాగం విద్యార్థుల సంఖ్యనూ మించిపోయారు! 2010-11లో దేశంలోని ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు 43.1% ఉండగా.. 2022-23 నాటికి అది 60.8 శాతానికి పెరగడం గమనార్హం! ఒక్క 2023లోనే జనరల్ విభాగం విద్యార్థుల కంటే ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ విద్యార్థుల నమోదు 95 లక్షలు ఎక్కువగా ఉండడం విశేషం. అదేసమయంలో 2011లో 57 శాతంగా ఉన్న జనరల్ విద్యార్థుల సంఖ్య 2023 నాటికి (ఆర్థికంగా వెనకబడిన కోటా విద్యార్థులను కలిపినా కూడా..) 39 శాతానికి పడిపోయింది. ఈ విషయాలు ఐఐఎం ఉదయ్‌పూర్‌కు చెందిన పరిశోధకుల అధ్యయనంలో వెల్లడయ్యాయి. కేంద్ర విద్యాశాఖ 15 ఏళ్ల తర్వాత 'ఉన్నత విద్యపై అఖిల భారత సర్వే (ఏఐఎస్‌హెచ్ఈ)' వార్షిక నివేదికలను ప్రచురించడం ప్రారంభించగా.. వాటిని ఐఐఎం ఉదయ్‌పూర్‌కు చెందిన పరిశోధకుల బృందం విశ్లేషించినట్లు విద్యా పరిశోధనా సంస్థ 'క్యాస్ట్‌ఫైల్స్' ఓ ప్రకటనలో తెలిపింది. 'భారతీయ ఉన్నత విద్యారంగంలో విద్యార్థుల సామాజిక సమతుల్యతపై విస్తృతంగా ప్రచారంలో ఉన్న అనేక అపోహలకు ఈ నివేదిక తెరదించుతుంది' అని ప్రొఫెసర్ కృష్ణమూర్తి అన్నారు. దేశంలో విస్తృతంగా ప్రచారంలో ఉన్నదానికి భిన్నంగా ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరిగిపోతోందని.. వారి సంఖ్య జనరల్ కేటగిరీ విద్యార్థులను మించిపోయిందని తెలిపారు. అన్ని రకాల విద్యాసంస్థల్లో ఇదే సరళి ఉందని వెల్లడించారు.

'సర్'పై రచ్చ వద్దు.. అసెంబ్లీ పైనే దృష్టి

» బెంగాల్ బీజేపీ ఎంపీలకు మోదీ దిశానిర్దేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 3: ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) చాలా సాధారణ అంశమని.. అనవసర రచ్చ చేసి వివాదాస్పదంగా మార్చవద్దని పశ్చిమబెంగాల్ బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మొదట్లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో బుధవారం ఆయన పార్లమెంటు ప్రాంగణంలో ఆ రాష్ట్ర బీజేపీ ఎంపీలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శామిక్ భట్టాచార్య, కేంద్ర మంత్రులు శంతను ఠాకూర్, సుకాంత మజుందార్‌లతో సమావేశమయ్యారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. అంతా నియోజకవర్గాల్లో ఉండి పార్టీ వ్యూహాలను పక్కాగా అమలు చేయడంపై దృష్టిపెట్టాలని చెప్పారు.

మోదీపై ఏఐ 'చాయ్‌వాలా' వీడియో

న్యూఢిల్లీ, డిసెంబరు 3: ప్రధాని మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత రాగిణి నాయక్ సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టు కలకలం రేపుతోంది. ఓ గ్లోబల్ కార్యక్రమంలో సూటు వేసుకుని టీ కెటిల్, గ్లాసులు పట్టుకుని చాయ్ చాయ్ అని అరుస్తూ మోదీ వెళ్తున్నట్లు ఏఐతో రూపొందించిన వీడియోను ఆమె మంగళవారం రాత్రి పోస్టుచేశారు. తన చిన్నతనంలో గుజరాత్‌లోని వాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో తన తండ్రి టీ అమ్మేవాడని.. తాను సాయపడేవాడినని మోదీ గతంలో వెల్లడించారు. రాగిణి పోస్టుపై బీజేపీ మండిపడింది. ఓబీసీ ప్రధాని కావడాన్ని సోనియా, రాహుల్ జీర్ణించుకోలేకపోతున్నారని, ఇది 140 కోట్ల మంది భారతీయులకు అవమానమని విమర్శించింది.

అక్రమ చొరబాటుదారులపై యోగి కొరడా

లఖ్‌నవూ, డిసెంబరు 3 : అక్రమ చొరబాటుదారులపై ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బంగ్లాదేశీ, రోహింగ్యా చొరబాటుదారులను గుర్తించి ప్రత్యేక నిర్బంధ కేంద్రాల్లో ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతి డివిజన్‌లోనూ ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్లు ఒక సీనియర్ ఉత్తర్‌ప్రదేశ్ అధికారి బుధవారం చెప్పారు. ఇప్పటికే తమ పరిధిలో ఉన్న అక్రమ చొరబాటుదారుల జాబితాలను తయారుచేయాల్సిందిగా రాష్ట్ర వ్యాప్తంగా 17 మున్సిపాలిటీలకు సీఎం యోగి ఆదేశించారని చెప్పారు.

'సంచార్ సాథీ'పై పీఛేముడ్!

ఫోన్లలో తప్పనిసరిగా ప్రీఇన్‌స్టాల్ చేయాలన్న ఆదేశాలు వెనక్కి తీసుకున్న కేంద్రం



ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ప్రభుత్వానికి నిరసన తెలుపుతూ కాంగ్రెస్ ఎంపీ దీపేందర్‌సింగ్ హుడా, మరికొందరు ప్రతిపక్ష ఎంపీలు గ్యాస్ మాస్కులు ధరించి పార్లమెంటులోకి వచ్చారు. ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఆక్సిజన్ ట్యాంకు తీసుకుని వచ్చారు. ఇక సోనియా, రాహుల్, ప్రియాంక సహా పలువురు ఎంపీలు మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ, డిసెంబరు 3: స్మార్ట్‌ఫోన్లలో 'సంచార్ సాథీ' యాప్‌ను తప్పనిసరిగా ముందస్తు ఇన్‌స్టలేషన్ (ప్రీఇన్‌స్టాల్) చేయాలన్న ఆదేశాలపై కేంద్రం వెనక్కి తగ్గింది. దీనికి సంబంధించి మొబైల్ ఫోన్ తయారీ సంస్థలకు జారీ చేసిన ఆదేశాలను ఉప సంహరించుకుంటున్నట్టు టెలికం శాఖ (డీఓటీ) బుధవారం ప్రకటించింది. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటున్న వారి సంఖ్య వేగంగా పెరుగుతోందని, అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. బుధవారం సాయంత్రం టెలికం శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. "పెద్దగా అవగాహన లేని ప్రజలకు కూడా ఈ యాప్‌ను చేరువ చేయాలన్న ఉద్దేశంతోనే తప్పనిసరిగా ప్రీఇన్‌స్టాల్ చేయాలన్న ఆదేశాలు జారీ చేశాం. మంగళవారం ఒక్కరోజే 6 లక్షల మంది సంచార్ సాథీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇది పదింతలు ఎక్కువ. డౌన్‌లోడ్లు వేగంగా పెరుగుతున్నాయి. ఇప్పటివరకు కోటిన్నర మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రజల్లో మంచి స్పందన వస్తున్న నేపథ్యంలో.. తప్పనిసరిగా ప్రీఇన్‌స్టాల్ చేయాలన్న ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని తెలిపింది. ఇదిలా ఉండగా, పాన్ మసాలా ప్యాకెట్లన్నింటిపై తప్పనిసరిగా రిటైల్ విక్రయ ధర(ఆర్ఎస్పీ) ఉండాల్సిందేనని కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. ప్యాకేజీ పరిమాణం లేదా బరువుతో సంబంధం లేకుండా ఈ నిబంధనను అమలు చేయాలని పేర్కొంది. ఇది ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్టు తెలిపింది. ఇంతకు ముందు 10 గ్రాములు లేదా అంతకన్నా తక్కువ బరువున్న చిన్న ప్యాక్‌లకు కొన్ని ప్రకటనల విషయంలో మినహాయింపులు ఉండేవి. కానీ ఇప్పుడు ఈ చిన్న ప్యాక్‌లు కూడా తమ లేబుల్స్‌పై కచ్చితంగా ముద్రించాలి.

భారత్‌లో 72 వేల విదేశీ విద్యార్థులు

భారత్‌లోని ఉన్నత విద్యా సంస్థల్లో సుమారు 200 దేశాల నుంచి 72,218 మంది విదేశీ విద్యార్థులు వివిధ కోర్సులను అభ్యసిస్తున్నారని కేంద్రం బుధవారం నాడు రాజ్యసభకు తెలియజేసింది. భారతీయ విద్యా సంస్థలను ప్రపంచ స్థాయి పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్' (ఐఓఈ) పథకం కింద 8 ప్రభుత్వ సంస్థలకు రూ.6,198.99 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొంది.

భౌభౌ.. అన్న రేణుక

బీజేపీ సభా హక్కుల తీర్మానానికి స్పందన



న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌కు తన పెంపుడు శునకాన్ని తీసుకురావడమే కాక.. కరిచేవాళ్లు లోపల ఉన్నారంటూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి బుధవారం మీడియా ముందు భౌ భౌ అని అన్నారు. బీజేపీ ఎంపీలు మీపై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెట్టనున్నారని విలేకరులు అడగ్గా.. ఆమె మైకుల ముందుకొచ్చి భౌ భౌ అని అనడం మరింత వివాదాస్పదమైంది. తాను ఏ నిబంధననూ ఉల్లంఘించలేదని, హిందూమతంలో శునకానికి గౌరవప్రదమైన స్థానం ఉందని చెప్పారు. అధికార పార్టీకి హిందూ సంప్రదాయాల తెలియవన్నారు.

లేబర్ కోడ్‌లపై విపక్షాల నిరసన

కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కుదించి, అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను నిరసిస్తూ ఇండి కూటమి నేతలు బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంకతోపాటు డీఎంకే, తృణమూల్, వామపక్షాల ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు కార్పొరేట్ సంస్థలకే ప్రయోజనకరంగా ఉన్నాయని విమర్శించారు.

నేడే భారత్‌కు పుతిన్

(మొదటి పేజీ తరువాయి)



ప్రాంగణంలో త్రివిధ దళాల గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం.. పుతిన్ రాజ్‌ఘాట్‌కు చేరుకుని మహాత్మగాంధీకి నివాళులర్పిస్తారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీ-పుతిన్ నడుమ సమావేశం జరుగుతుంది. భేటీ ముగిశాక ఇద్దరు నేతలూ కలిసి సంయుక్త ప్రకటన విడుదల చేస్తారు. తర్వాత ప్రధాని మోదీ ఇచ్చే వర్కింగ్ లంచ్‌కు పుతిన్ హాజరవుతారు. అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో.. ఫిక్కీ (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) నిర్వహించే ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిర్వహించే విందు కార్యక్రమానికి పుతిన్ హాజరవుతారు. దీంతో పుతిన్ భారత పర్యటన పూర్తవుతుంది. కాగా.. పుతిన్‌తో పాటు ఈ పర్యటనకు వస్తున్న రష్యా రక్షణ మంత్రి అంద్రే బెలౌసోవ్ మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో గురువారం భేటీ కానున్నారు. మరో ఐదు యూనిట్ల ఎస్-400 క్షిపణి వ్యవస్థల కొనుగోలు, ఎస్‌యు-30 ఫైటర్ జెట్ల నవీకరణ, ఇతరత్రా కీలకమైన మిలటరీ హార్డ్‌వేర్ సరఫరా అంశాలు వీరి భేటీలో ప్రధానంగా చర్చకు రానున్నాయి. అలాగే.. పౌర అణు ఇంధన సహకారానికి సంబంధించి కూడా ఇరు దేశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి రష్యా క్యాబినెట్ బుధవారం పచ్చజెండా ఊపింది. రష్యాకు చెందిన రోసాటోమ్ న్యూక్లియర్ కార్పొరేషన్.. తమిళనాడులోని కూడంకుళంలో న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా ప్రభుత్వం తరఫున ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేయడానికి ఆ సంస్థకు రష్యా క్యాబినెట్ అధికారం ఇచ్చింది. పుతిన్ ఇక్కడికి రావడానికి ముందే.. రష్యా 'ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్'కు చెందిన దాదాపు 50 మంది అత్యున్నతస్థాయి పోరాట నైపుణ్యాలు కలిగిన కమాండోలు భారత్‌కు చేరుకున్నారు. ఢిల్లీ పోలీసులు, ఇండియన్ నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్‌తో కలిసి వీరు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక.. ఈ పర్యటన కోసం పుతిన్ రష్యాలో వాడే 'ప్రెసిడెన్షియల్ లగ్జరీ లిమోజిన్' కారు ఆరస్ సెనాట్‌ను మాస్కో నుంచి విమానంలో తీసుకొస్తున్నారు.

పుతిన్‌ను విమర్శిస్తూ భారత పత్రికలో వ్యాసం

» ఫ్రాన్స్, జర్మనీ, యూకే రాయబారుల తీరును తప్పుబట్టిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 3: రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనకు వస్తున్న సమయంలో ఆయనను, రష్యాను తీవ్రంగా విమర్శిస్తూ ఉమ్మడిగా కథనం రాసిన మూడు దేశాల దౌత్యవేత్తల తీరును భారత్ తప్పుబట్టింది. తమకు సంబంధం లేని మూడో దేశం వ్యవహారంలో జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. పుతిన్ గురువారం భారత పర్యటనకు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌లోని యూకే హైకమిషనర్ లిండీ కామెరాన్, ఫ్రాన్స్ రాయబారి థియెరీ మాథౌ, జర్మనీ హైకమిషనర్ ఫిలిప్ అకర్‌మన్ సోమవారం టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఒక ఉమ్మడి వ్యాసం రాశారు. ఉక్రెయిన్‌పై రష్యా పక్కా ప్రణాళిక ప్రకారమే యుద్ధం చేస్తోందని.. శాంతి నెలకొల్పే ఆలోచన పుతిన్‌కు ఏమాత్రం లేదని అందులో విమర్శించారు. పుతిన్ శాంతి చర్చల్లో జాప్యం చేసినకొద్దీ తాము ఉక్రెయిన్‌కు రక్షణ, ఇతర సహాయ సహకారాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. దీనిని భారత విదేశాంగ శాఖ అధికారులు తీవ్రంగా తప్పుబట్టారు. పుతిన్ పర్యటనకు ముందు భారత పత్రికల్లో ఇలాంటి వ్యాసం రాయడం ఇక్కడి వారిని ప్రభావితం చేసే ప్రయత్నమేనని పేర్కొన్నారు. ఇది అసాధారణమని, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని.. దౌత్యపరమైన వ్యవహారాలకు పూర్తి విరుద్ధమని స్పష్టం చేశారు. ఇక మూడు దేశాల దౌత్యవేత్తల ఉమ్మడి వ్యాసం.. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని, రష్యా వ్యతిరేకతను ప్రచారం చేయడమేనని విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి కన్వల్ సిబల్ పేర్కొన్నారు.

కోకాపేటలో మూడో విడత భూముల వేలం పూర్తి

- ఎకరం సగటు ధర రూ. 137 కోట్లు
- 27 ఎకరాలకు రూ.3700 కోట్ల ఆదాయం
- రెండు సంవత్సరాల్లో 87% అసాధారణ వృద్ధి
- డిసెంబర్ 5న చివరి విడత భూముల వేలం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోకాపేట నియోపోలీస్‌లో మూడో విడత భూముల వేలం ప్రక్రియ బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ విడతలో ఎకరం సగటు ధర రూ.137.36 కోట్లు పలకడం విశేషం. ప్లాట్ నంబరు 19, 20లోని మొత్తం 8.04ఎకరాల భూమిని అమ్మడం ద్వారా హెచ్ఎండీఏకు సుమారు రూ.1000కోట్ల ఆదాయం సమకూరింది. నియోపోలీస్ లే అవుట్‌లో మొత్తం మూడు విడతల్లో జరిగిన వేలంలో.. 27 ఎకరాల విస్తీర్ణంలోని 6 ప్లాట్లను విక్రయించడం ద్వారా హెచ్ఎండీఏ రూ.3708 కోట్ల భారీ ఆదాయాన్ని ఆర్జించింది. ప్లాట్ నెంబరు 19లో నాలుగెకరాలకు గాను, ఎకరా రూ. 131కోట్లకు యోలా కన్‌స్ట్రక్షన్స్ ఎల్ఎల్పీ, గ్లోబస్ ఇన్ఫ్రాక్రాన్ ఎల్ఎల్పీ సంస్థలు దక్కించుకున్నాయి. ప్లాట్ నెం.20లోని మరో నాలుగెకరాల భూమిని బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఎకరాకు రూ. 118 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఈ ప్లాట్లు పశ్చిమం వైపు ఉండడంతో మూడు రోజుల క్రితం జరిగిన వేలంతో పోలిస్తే ధరలు స్వల్పంగా తగ్గినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నవంబర్ 28న జరిగిన రెండో విడతలో రికార్డు స్థాయిలో ఎకరం ధర రూ. 151 కోట్లు పలికిన సంగతి తెలిసిందే. రెండేళ్ల క్రితం ఇదే నియో పోలీస్ లేఔట్‌లో జరిగిన వేలం ధరలతో పోలిస్తే.. ఏకంగా 87శాతం అసాధారణ వృద్ధిని నమోదు చేయడం రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కోకాపేట ప్రాధాన్యాన్ని మరోసారి స్పష్టం చేసింది. అప్పుడు ఎకరా రూ.100 కోట్లు పలకగా.. సగటు ధర రూ.73 కోట్లుగా ఖరారు అయింది. అయితే కోకాపేటలోని గోల్డెన్ మైల్ లే అవుట్‌లో రెండు ఎకరాల స్థలాన్ని హెచ్ఎండీఏ శుక్రవారం చివరి విడత వేలం వేయనుంది. ఈ స్థలానికి ఎకరం కనీస ధర రూ.75 కోట్లు నిర్ణయించగా.. ఏ మేరకు ధర పలుకుతుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్


సాయికుమార్

తాండూరు,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయికుమార్ ఏసీబీ అధికారులకు చిక్కారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గంలోని ఓ వెంచర్‌కు రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం ఇవ్వాలని సాయికుమార్ రియల్టర్‌ను డిమాండ్ చేశారు. దీంతో అసిస్టెంట్ డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తున్న సాయిప్రసాద్, అశోక్ కుమార్ ద్వారా రూ.16,500 సాయికుమార్‌కు అందిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కాగా, మెదక్ జిల్లా వెల్దుర్తి మండల రెవెన్యూ కార్యాలయ సర్వేయర్ శ్రీనివాస్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఓ రైతు తన వ్యవసాయ భూమిని సర్వే చేయాలని కోరగా రూ.20వేలు ఇవ్వాలని సర్వేయర్ డిమాండ్ చేశారు. డబ్బులను ట్రైనీ సర్వేయర్ శరత్‌కుమార్‌గౌడ్‌కు ఇవ్వాలని సూచించారు. రైతు నుంచి రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

పీడీఎస్‌యూ మహాసభలు జనవరికి వాయిదా

నల్లకుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరగాల్సిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర మహాసభలను వాయిదా వేశారు. ఈ సభలను వచ్చే జనవరి 5, 6, 7 తేదీల్లో వరంగల్‌లో నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ నేతలు తెలిపారు. బుధవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి.మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద నవీన్ మాట్లాడారు. రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించుకుంటామని తెలిపారు.

గుర్తింపు లేని పార్టీలు ఆర్థిక నివేదికలివ్వాలి: సీఈఓ

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకొని నమోదిత గుర్తింపు లేని రాజకీయ పార్టీలు ఈ నెల పదో తేదీలోపు తమ ఆర్థిక నివేదికలు సమర్పించాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నమోదిత గుర్తింపు లేని రాజకీయ పార్టీలు నిధుల నివేదికలు, ఆడిట్ చేసిన వార్షిక ఖాతాలు, ఎన్నికల వ్యయం వివరాలు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. ఈ నివేదికలను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌కు పంపుతామని తెలిపారు.

సంక్రాంతికి భూభారతి కొత్త పోర్టల్

రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ వివరాలన్నీ ఒకే పేజీలో ఉండేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి

- 2.29 కోట్ల సర్వే నంబర్లకు భూదార్
- పరిశ్రమల పేరుతో గత ప్రభుత్వంలో చేతులు మారిన భూముల లెక్కలు తేలుస్తాం
- సాదాబైనామా కింద సర్కారు భూములను క్రమబద్ధీకరించం.. 'అఫిడవిట్'పై స్పష్టతనిస్తాం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'సంక్రాంతి నాటికి ధరణి పోర్టల్‌ను పూర్తిగా రద్దు చేసి.. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల వివరాలన్నీ ఒకే పేజీలో ఉండేలా భూభారతి నూతన పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. ప్రస్తుతమున్న 2.29 కోట్ల సర్వే నంబర్లకు దశల వారీగా భూధార్ కార్డులు జారీ చేస్తాం.. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఇటీవల ప్రయోగాత్మకంగా రీ సర్వే చేపట్టిన ఐదు గ్రామాల రైతులకు భూధార్ కార్డులు ఇస్తాం.. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలపై స్పష్టత వచ్చాక ట్రైబ్యునల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తాం.. జీవో 58, 59 సమస్యలతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో ఉన్న పట్టాలపైనా నిర్ణయం తీసుకుంటాం' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బుధవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు సంక్రాంతి నాటికి రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలను ఒకే పేజీలో ఉండేలా కొత్త భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ పోర్టల్ రైతులకు మెరుగైన సేవలను అందించేలా ఉంటుందని చెప్పారు. 373 గ్రామాల్లో రెండో విడత కింద సర్వే నిర్వహిస్తామన్నారు. మూడో విడతగా అన్ని జిల్లాల్లోనూ జిల్లాకు 70 గ్రామాలను ఎంపిక చేసి సర్వే అనంతరం భూదార్ కార్డులు అందిస్తామని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల్లో అర్హత కలిగిన వాటిని జనవరి నెలాఖరుకల్లా పరిష్కరిస్తామన్నారు. సమస్యలపై స్పష్టత వచ్చాక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. గత ప్రభుత్వ హయాం నుంచి చోటుచేసుకున్న అక్రమాలను వెలికితీసేందుకు గాను ఇంతవరకు రెండు జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ జరుగుతోందని, వాటి ఫలితాలను గమనించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి అక్రమార్కుల భరతం పడతామని వ్యాఖ్యానించారు. సాదాబైనామా దరఖాస్తుల్లో ప్రభుత్వ భూములుంటే.. క్రమబద్ధీకరణ చేయలేమన్నారు. సాదాబైనామా దరఖాస్తుల విషయంలో అఫిడవిట్ ఇవ్వాలనే దానిపైనా అవసరమైతే ఇప్పుడున్న ఉత్తర్వులు సవరణ చేస్తామన్నారు. జీవో 58, 59 సమస్యలను పరిష్కరిస్తామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పేరుతో పట్టాలిస్తే నిజమైన వారి కంటే బోగస్ ధ్రువపత్రాలు కలిగిన వారే ఎక్కువ ఉన్నారన్నారు. దీనిపై విచారించి.. నిజమైన ధ్రువపత్రాలున్న వారికి న్యాయం చేస్తామన్నారు. మునిసిపాలిటీల్లో విలీన ప్రక్రియ ముగిసిన తరువాత.. ప్రాంతాల వారీగా మార్కెట్ విలువల సవరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

నోటికొచ్చింది మాట్లాడితే ఎలా?

హిల్ట్ పాలసీపై బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చింది మాట్లాడుతున్నారని పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పురపాలక శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన.. ముడుపులు చెల్లించిన వారికే భూ బదలాయింపు చేపట్టారన్నారు. వారికి అవసరమైన ప్రాంతాలను రెసిడెన్షియల్ ప్రాంతాలుగా మార్చారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల్లా సొంత ప్రయోజనాల కోసం పనిచేయడం లేదన్నారు. పారదర్శకంగా క్యాబినెట్ తీర్మానం చేశాక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కన్వర్షన్ చేసిన భూముల వివరాల చిట్టాను గురువారం బయటపెడతామన్నారు.

తప్పుడు వార్తలతో నిజం మారదు..

ఇద్దరు అన్నదమ్ముల మధ్య గొడవలో రాఘవా కనస్ట్రక్షన్‌కు ఏం పని ఉంటుందని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా నిరాధారమైన వివరాలతో తప్పుడు వార్త రాసినంత మాత్రాన నిజం మారదన్నారు. ఓ దినపత్రికలో 'బాంబుల మంత్రి కుమారుడి దౌర్జన్యకాండ' అనే శీర్షికతో వచ్చిన వార్తపై తీవ్రంగా స్పందించారు. ఆధారాలు లేకుండా వార్త రాసిన వారే సిగ్గుపడతారన్నారు. తన కుమారుడిపై ఎఫ్ఐఆర్ నమోదైతే వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అసలు తన కుమారుడు వివాదాస్పద స్థలం వద్దకే వెళ్లలేదని స్పష్టం చేశారు.

ర్యాగింగ్ రచ్చ

- సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ముదిరిన గొడవ
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సొంత జిల్లాలో ఘటన

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సొంత జిల్లాలోని సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ అంశం రచ్చకెక్కింది. ర్యాగింగ్‌కు గురైన ఓ జూనియర్ విద్యార్థి ఇంట్లో.. ఆ విద్యార్థి కుటుంబసభ్యులు, సీనియర్ విద్యార్థుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సంగారెడ్డి మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని సీనియర్ విద్యార్థులు కొందరు మంగళవారం ర్యాగింగ్ చేశారు. ర్యాగింగ్ పేరిట ప్యాంటు, షర్టు విప్పించారు. సంగారెడ్డిలోని శాంతినగర్‌లో నివాసముండే ఆ విద్యార్థి ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలియజేశాడు. దీంతో ఆ విద్యార్థి తండ్రి, సోదరుడు.. సదరు సీనియర్ విద్యార్థులు కొందరిని బుధవారం తమ ఇంటికి పిలిపించారు. ఎందుకిలా చేసారని ప్రశ్నించారు. ఈలోపు ఓ సీనియర్ విద్యార్థి తన తోటి విద్యార్థులకు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వగా పదుల సంఖ్యలో సీనియర్లు అక్కడికి చేరుకున్నారు. దీంతో జూనియర్ కుటుంబసభ్యులు, సీనియర్ విద్యార్థుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఈ క్రమంలో ఫస్టియిర్ విద్యార్థి తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసు రాకను గమనించిన సీనియర్ విద్యార్థులు అక్కడి నుంచి పారిపోతుండగా, పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బుధవారం రాత్రి సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఘటనపై విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టులు మరణించి ఉంటారని ఐజీ పేర్కొన్నారు. చాలా మంది తప్పించుకున్నారని, గురువారం కూడా ఆపరేషన్ కొనసాగుతుందని చెప్పారు. మృతుల్లో పీఎల్‌జీఏ రెండో బెటాలియన్ కమాండర్ మొడియం వెల్ల ఉన్నాడని, అతనిపై రూ.8 లక్షలు రివార్డు ఉందని వెల్లడించారు. కాగా ఘటనా స్థలంలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పాపారావు ఉన్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మావోయిస్టు పార్టీ ఏటా డిసెంబరు 2 నుంచి వారం రోజుల పాటు పీఎల్‌జీఏ వారోత్సవాలను నిర్వహిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఎన్‌కౌంటర్ జరగడం గమనార్హం. కాగా, డీఆర్‌జీ జవాన్ల త్యాగాలను వృథాగా పోనివ్వబోమని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి తెలిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మావోయిస్టు పార్టీ ఆఖరి శ్వాస తీసుకుంటోందని, జవాన్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టబోమన్నారు. మృతి చెందిన జవాన్లకు నివాళులర్పించారు.

సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టుల మహా ధర్నా

- కేంద్రం తెచ్చిన కొత్త లేబర్ కోడ్‌తో జర్నలిస్టులకు నష్టం: దేవులపల్లి అమర్
- కొత్త అక్రిడిటేషన్ కార్డులు వెంటనే జారీ చేయాలి : విరాహత్ అలీ

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ఎదుర్కొంటున్న న్యాయసమ్మతమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీనియర్ జర్నలిస్టులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే-(ఐజేయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సమాచార్ భవన్ ఎదుట వేలాది మంది జర్నలిస్టులు బుధవారం మహా ధర్నా చేశారు. అనంతరం సమాచార శాఖ సంయుక్త సంచాలకులు డీఎస్ జగన్‌కు వినతి పత్రం అందజేశారు. తొలుత ధర్నాను ఉద్దేశించి మాట్లాడిన ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో మీడియా యాజమాన్యాలను ధిక్కరించి ఉద్యమంలో భాగస్వాములైన జర్నలిస్టులు హక్కుల కోసం పోరాడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్ వల్ల కార్మికులతోపాటు జర్నలిస్టులూ నష్టపోవాల్సి వస్తుందన్నారు. టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె.విరాహత్ అలీ మట్లాడుతూ అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తిపరమైన కమిటీలు ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్య స్థాయి పత్రికలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ్‌నారాయణ అన్నారు. కాగా, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, నగునూరి శేఖర్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, రమేష్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.నరహరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీష్, ఉర్దూ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు.. ముగ్గురి మృతి


- మరో ఇద్దరి పరిస్థితి విషమం.. మృతుల్లో ఒకరు మైనర్
- ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం


మృతి చెందిన జాయ్, శశివర్ధన్, సాజిద్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం వద్ద బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కురుస్తున్న వేళ మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి తుక్కుతుక్కు అయింది. ఈ దెబ్బకు కారులో ఉన్న ఐదుగురిలో ఓ బాలుడి సహా ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లికి చెందిన జాయ్(18) మిత్రుడి గృహ ప్రవేశానికి వెళ్లివస్తానని తల్లిదండ్రుల వద్ద కారు తీసుకొని మంగళవారం రాత్రి 11 గంటలప్పుడు ఇంటి నుంచి బయలుదేరాడు. తమ ఇంటికి సమీపంలోనే నివసించే సమీప బంధువు శశివర్ధన్(11)తో కలిసి బయలుదేరిన జాయ్.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి వెళ్లి తమ మిత్రుడైన తలారి అజయ్‌ను కలుపుకొని చంద్రుగొండ మండలంలోని మహ్మద్‌నగర్ వెళ్లారు. అక్కడ సాజిద్ (22), ఇమ్రాన్ అనే మరో ఇద్దరిని ఎక్కించుకొని సత్తుపల్లికి బయలుదేరారు. అయితే, వారి కారు బుధవారం తెల్లవారుజామున కిష్టారం గ్రామంలోకి ప్రవేశించేటప్పుడు అంబేడ్కర్‌నగర్ వద్ద జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదసమయంలో సాజిద్ కారును నడుపుతుండగా.. జాయ్, శశివర్ధన్ అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన మిగిలిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించగా.. సాజిద్ చికిత్స పొందుతూ మరణించాడు. అజయ్, ఇమ్రాన్‌ను ఖమ్మం తరలించగా వారి పరిస్థితి విషమంగా ఉంది. అతివేగానికి తోడు మంచు వల్ల రోడ్డు కనిపించకపోవడమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇక, ప్రమాద విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

హీటర్ వేసుకోవడంతో కారులో చెలరేగిన మంటలు!

- నలుగురికి తప్పిన ప్రమాదం.. దగ్ధమైన కారు



కడ్తాల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెల్లవారుజామున చలిగా ఉందని కారులో హీటర్ వేసుకోవడమే ప్రమాదాన్ని కొనితెచ్చింది. హఠాత్తుగా మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమవ్వగా.. డ్రైవర్ అప్రమత్తతో కారులోని వారు ప్రాణాలను దక్కించుకున్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెంకటాపూర్ గేట్ సమీపంలో బుధవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకుంది. వెంకటాపూర్ తండా నుంచి నలుగురు యువకులు కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. చలిగా ఉండటంతో డ్రైవర్ కారులో హీటర్ వేశాడు. అయితే వెంకటాపూర్ తండా గేటు వద్ద ఒక్కసారిగా కారులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై కారును ఆపి.. అందులోని వారిని లేపి దిగిపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కాగా, వారం రోజుల క్రితం ఓఆర్ఆర్‌పై కూడా ఇటువంటి ఘటనే చోటుచేసుకుంది. కారులో హీటర్ వేసి డ్రైవర్ పడుకోవడంతో మంటలు చెలరేగి అతడు సజీవదహనమయ్యాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజా విజయం

సంచార్ సాథీ అప్లికేషన్ విషయంలో కేంద్రప్రభుత్వం వెనక్కుతగ్గి మంచిపనిచేసింది. కొత్తగా వచ్చే సెల్‌ఫోన్లలో సంచార్‌సాథీ యాప్‌ను ముందుగా ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరి అంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను టెలికాం శాఖ ఉపసంహరించుకుంది. సైబర్ నేరాలనుంచి రక్షించేపేరిట కొత్త ఫోన్లలో దీనిని తప్పనిసరి చేయడంమీద విపక్షాలు మండిపడ్డాయి, ప్రజలు ఆందోళన చెందారు. ఇది పౌరుల వ్యక్తిగత జీవితాల్లోకి ప్రభుత్వం తొంగిచూసే చర్య అని నిపుణులు అనుమానించారు. ఈ యాప్ మీ ఫోన్‌లో ఉంటే మీకు ఎంతో తోడు, తోడ్పాటు అని ప్రభుత్వం చెబుతూంటే, దానిని పడగ నీడగా, మన జేబులోనే ఉంటూ మనల్ని వెంటాడే నిఘా నేత్రంగా పౌరసమాజం భావించింది. ఈ వ్యవహారాన్ని తెగేవరకూ లాగకుండా ప్రభుత్వం ఉన్నతంగా వ్యవహరించడం ప్రశంసనీయమైనది.

నిజానికి, తన ఆదేశాల తరువాత ఈ యాప్‌ను స్వచ్ఛందంగా డౌన్‌లోడ్ చేసుకున్నవారి సంఖ్య అమాంతం పెరిగిపోయిందని ప్రభుత్వం అంటోంది. ఒక్కరోజులో ఆరులక్షల మంది యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారని, దీనిగురించి తెలియనివాళ్లకు అవగాహన కల్పించే సదుద్దేశంతోనే యాప్‌ను తప్పనిసరి చేశామని టెలికాం విభాగం అంటోంది. విపక్షాలు, నిపుణులు తప్పుబడుతున్నా, ప్రజలు తమను అనుమానించడం లేదని, నమ్ముతున్నారని చెప్పుకోవడం ఈ ప్రకటన ఉద్దేశం కావచ్చు. నిజానికి ఈ విషయంలో ఇంతటి వివాదం అవసరం లేదు. 2023 మే నెలలో ఈ యాప్‌ను ఆరంభించిన ప్రభుత్వం దాని ప్రచారాన్ని ఉధృతం చేసి, క్రమంగా వినియోగాన్ని కూడా పెంచగలిగింది. ఫోన్‌లో సంచార్‌సాథీ ఉంటే సవాలక్ష ప్రయోజనాలంటూ పౌరులకు ఇటీవలికాలంలో రోజూ టెక్స్ట్ మెసేజ్‌లు అందుతూనే ఉన్నాయి. ఒక సిమ్‌మీద ఎన్ని కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవడం నుంచి, దొంగతనానికి గురైన మొబైల్స్‌ను కనుక్కోవడం వరకూ ఈ యాప్ ఉపకరిస్తుందన్న హామీని విశ్వసించి అత్యధికులు ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసుకున్నారు కూడా. ప్రజలు ఎంతగానో నమ్ముతున్నారని చెప్పుకుంటున్న ప్రభుత్వం యాప్‌ను ఇలా తప్పనిసరి చేయడం కాక, దానిని విస్తృత వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తే సరిపోయేది. అప్లికేషన్‌ను నిరంతరం అభివృద్ధిపరచడం, సమర్థతనూ దాని సాంకేతిక భద్రతనూ పెంచి ప్రచారం చేయడం, దుర్వినియోగం కాబోదని హామీ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం తన లక్ష్యాన్ని సునాయాసంగా సాధించగలిగేది. ఈ యాప్ ఉన్నపక్షంలో సైబర్ మోసాలను అడ్డుకోవడం, వాడుతున్న ఫోన్ మంచిచెడులు తెలుసుకోవడం, మోసపూరిత కాల్స్‌ను నిలువరించడం, ఫోన్ బ్లాక్ చేయడం సులభమని చెబుతున్నందున ప్రజలూ కాదనరు. లక్షలకొద్దీ నకిలీ కనెక్షన్లను రద్దుచేయడం, లక్షలాది ఫోన్ల ఉనికి కనిపెట్టడం ఈ యాప్ ద్వారా సాధ్యమైందంటున్న ప్రభుత్వం ప్రజలే దానిని స్వాగతించి, వాడుకొనేట్టుగా చేస్తే, చూస్తే సరిపోయేది. కానీ, ఎప్పుడైతే ప్రభుత్వం దానిని తప్పనిసరి చేసిందో, దానిమీద ప్రశ్నలు, సందేహాలు రేగి, అనుమానాలను రేకెత్తించే పలు అంశాలు ముందుకు రావడం అత్యంత సహజం. ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ ప్రజలకు లేకుండా నేరుగా కంపెనీలనే ప్రీ ఇన్‌స్టాల్ చేయమని ఆదేశించిన కారణంగా ప్రభుత్వానికి దురుద్దేశాలున్నాయన్న వాదనకు బలం చేకూరింది. సైబర్ నేరాలను నివారించడం, మోసాలను గుర్తించడం పేరుతో ఫోన్‌లో ఉన్నదంతా చదివేందుకు, తమపై ఓ కన్నేసి ఉంచేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోందని ప్రజలకు అనిపించింది. పౌరులపై నిరంతర నిఘా, గోప్యతహక్కులు, డేటా భద్రత, దుర్వినియోగం ఇత్యాది ఆరోపణలు వెల్లువెత్తడంతో పాటు, పాలకులు పెగాసస్‌ను ప్రయోగించి తమకు గిట్టనివారికి వ్యతిరేకంగా సాక్ష్యాలు సృష్టించి, ఏళ్ళతరబడి వారిని వేధించిన గతమూ గుర్తుకు వచ్చింది. ఈ యాప్‌ను తొలగించుకొనే అధికారాలూ అవకాశాలమీద పాలకులే పలుమార్లు మాటమార్చారు. అసలు ఆదేశాలకూ, అనంతరం మంత్రి మాటలకూ పొంతనలేదు. ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ వంటి సంస్థలు ఈ మొత్తం వ్యవహారంలో చురుకుగా వ్యవహరించి, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించడానికి కూడా సిద్ధపడ్డాయి. ప్రజలను సంసిద్ధులను చేయకుండా, సమాయత్తపరచకుండా ఇటువంటి దూకుడు నిర్ణయాలు పనికిరావు. యాప్ ప్రీ ఇన్‌స్టలేషన్‌కు యాపిల్ అంగీకరించలేదని, మిగతా కంపెనీలు కూడా అభ్యంతరపెట్టవచ్చునని వార్తలు వచ్చాయి. పాలకులు ఏ కారణాల వల్ల వెనక్కుతగ్గినా, ఇది ప్రజావిజయమే.

‘పార్ట్ టైం ప్రొఫెసర్ల’కు న్యాయం చేయండి

గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లమైన మేము నలిగిపోయాం. 2014లో తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి పేరుతో అనాలోచితంగా, కుట్రపూరితంగా తెచ్చిన సర్క్యులర్ మమ్మల్ని అధోగతిపాలు చేసింది. యూనివర్సిటీ వర్క్‌లోడ్ ప్రకారం వారానికి 15 గంటల బోధన సమయానికి మించినవారు యథాతథంగా పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మారేవారు. దీనితో 12 నెలల జీతం, కొన్ని సెలవులు, ప్రతి సంవత్సరం జీతంలో పెరుగుదల, యూనివర్సిటీలో బోధనేతర సేవలు కూడా అందించే అవకాశం ఉండేది. ఈ ప్రక్రియకు అడ్డుకట్ట వేస్తూ 2014 నుంచి పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు... కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల పరిధిలోకి రాకుండా 15 గంటల బోధన సమయానికి మించి వారికి ఇవ్వవద్దనేది ఈ సర్క్యులర్ సారాంశం. దీనిని ఎత్తివేయాలని నెత్తీనోరూ కొట్టుకున్నా గత ప్రభుత్వం కనికరించలేదు.

నేడు విశ్వవిద్యాలయాలలో సెమిస్టర్ విధానం నడుస్తోంది. అది 90 రోజుల పని విధానానికి లోబడి ఉంటుంది. అంటే సంవత్సరానికి రెండు సెమిస్టర్లు, గనుక 180 రోజులకు మించి ఉండదు... అంటే 6 నెలలు మాత్రమే. మా జీతం గంటకు 700... కనుక మొత్తంగా 30 వేల నుంచి 40 వేలకు మించి జీతం రాదు, అది కూడా ఆరు నెలలే వస్తుంది. మాలాంటి అభాగ్యుల శాపమో, వారు చేసుకున్న పాపాల ఫలితమో గత నియంత పాలన ఇనుప గడీలు విరిగిపోయాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన శ్రీకారం చుట్టుకుంది.

“పుట్టుక పేదరికంలో ఉండవచ్చు, కానీ అడగడంలో, అందిపుచ్చుకోవడంలో పేదరికం ఉండవద్దని” ఉస్మానియా యూనివర్సిటీకి ముఖ్యమంత్రి హోదాలో అడుగుపెట్టి రేవంత్‌రెడ్డి అన్న మాటలు మాలో కొత్త ఆశను రేపాయి. ఆ స్ఫూర్తితో, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధానంతో... మాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగి మా స్థితిగతులను ఈ ప్రభుత్వం ముందుకు తీసుకొస్తున్నాం. మేము యూనివర్సిటీలలో పర్మనెంట్, కాంట్రాక్టు వారితో సమానంగా పని, బోధన, సమయాన్ని కేటాయిస్తున్నాం. అయినా ఆరు నెలల జీతం, అర్ధాకలి బ్రతుకులు, దోపిడీ, అణిచివేత, అగౌరవం, నిర్లక్ష్యానికి గురవుతున్నాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణవాయువు అందించిన ఉస్మానియా యూనివర్సిటీని వెయ్యి కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పానికి సంతోషిస్తున్నాం. ప్రజాపాలన ఫలాలు మాకు కూడా అందేటట్లుగా... పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఉన్న మమ్మల్ని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పరిధిలోకి తెచ్చి, పే స్కేల్‌తో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నాం.

– డా. దుబ్బ రంజిత్
పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయూ

ఈ ఏకగ్రీవాల మతలబేమిటి?

ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా నిలవాల్సిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవాలు, వేలం పాటలుగా మారిపోయాయి. సర్పంచ్, వార్డు స్థానాలు ఈ ఎన్నికల్లో బేరసారాలకు వేదికలుగా మారిపోయాయి. ఒకప్పుడు గ్రామంలో బడి, రోడ్లు, తాగునీరు... వంటి సదుపాయాలు కల్పించి, గ్రామంలోని సమస్యలను పరిష్కరించగలిగే సామర్థ్యం ఉన్నవారిని సర్పంచ్‌గా ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకునేవారు. ఏకగ్రీవ గ్రామాలకు ప్రభుత్వం సైతం కొన్ని నిధులను ఇచ్చేది. కానీ ప్రస్తుత ఎన్నికల్లో డబ్బే ప్రధానపాత్ర పోషిస్తోంది. ఈ ఏకగ్రీవాల ద్వారా పెత్తందారుల చేతుల్లోకి స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ జారుకుంటుంది. ‘మంత్రుల దగ్గరకు వెళ్లి పని చేయించుకొనే వారికే ఓటు వేయాలి’ అంటూ సీఎం రేవంత్ ఇటీవల బహిరంగంగా చెప్పడం ఏ విలువలకు ప్రాతిపదిక? అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తరచుగా కన్పించే ఓట్ల కొనుగోలు విధానం గ్రామ పంచాయతీ ఎన్నికల్లోకి కూడా ప్రవేశించింది. స్థానిక ఎన్నికల వ్యవస్థను ధన ప్రభావితంగా మార్చివేసింది. గత ఎన్నికల్లో ఒక్కో సర్పంచ్ అభ్యర్థి 50లక్షల నుంచి కోటి రూపాయల వరకూ ఖర్చు చేశారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పనులకు నిధులు విడుదల కాక అప్పుల పాలయ్యారు. బిల్లులు రాక కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో మతం కూడా ప్రధానపాత్ర పోషిస్తోంది. గుడి, చర్చి, మసీదుల నిర్మాణ ప్రతిపాదనలతో ‘పంచాయతీ’ అభ్యర్థులు ప్రజల ముందుకు వస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అక్కడి పెత్తందారులే ఏకగ్రీవం పేరుతో తమకు అనుకూలమైన, ఆర్థిక పరిపుష్టి ఉన్నవారిని రంగంలో దింపుతున్నారు. దీనివల్ల ప్రజాసేవ చేయడానికి ముందుకు వచ్చే పేద ప్రజలకు పోటీచేసి, నాయకులుగా ఎదిగే అవకాశం సన్నగిల్లుతోంది.

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరుగుతున్న ఇలాంటి ఏకగ్రీవ విధానాల్లో ప్రభుత్వం, న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(జి) స్థానిక స్వపరిపాలన ఉద్దేశ్యం- ‘పరిపాలన, రాజకీయ, సాంఘిక సమానత్వం సాధించడం’ అని నిర్దేశించింది. ధన, కుల, మత ప్రమేయంతో జరిగే ఈ ఏకగ్రీవాలు చట్టవిరుద్ధం. ఇలాంటి తప్పుడు విధానాలను ఎన్నికల్లో నిరోధించడానికి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం సవరణ చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికల్లో ధన ప్రభావాన్ని తొలగించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టవలసిన ప్రధాన బాధ్యత ప్రభుత్వంపైన, గ్రామీణ ఓటర్లపైన ఉంది.

– ఎన్.తిర్మల్

ఆఖరి అంకంలో సాయుధ పోరాటం!

హిడ్మా ఎన్‌కౌంటర్, పెద్ద ఎత్తున మావోయిస్టుల అరెస్టులు, లొంగుబాట్లతో పీపుల్స్‌వార్/మావోయిస్టు పంథా ముగింపు దశకి వచ్చింది. చరిత్ర పునరావృతమైనట్లయింది. 1968లో విజయవాడలో తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి, కొల్లా వెంకయ్య తదితరుల నాయకత్వంలో వెలసిన ఏపీసీసీసీఆర్ ద్వారా సాయుధ పోరాట పంథాకు జరిగిన అంకురార్పణ శ్రీకాకుళం, వరంగల్, జగిత్యాల, ఇంద్రవెల్లి మీదుగా దేశమంతా పాకింది. ఈ క్రమంలో సీపీ గ్రూప్, పీపుల్స్‌వార్, లిన్ పియావో/ రెడ్‌ఫ్లాగ్ (రఫూఫ్), ఫైలా గ్రూప్, జీవీ గ్రూప్, ఫణిబాగ్చి వర్గం, కేఆర్ గ్రూప్, జనశక్తి, చలమన్న గ్రూప్, ఆర్‌వోసీ– అలా చీలికలు పీలికలవుతూ ఝార్ఖండ్ అడవుల్లోని ఎంసీసీతో కలిసిపోయింది. ఒక సమయంలో నేపాల్‌లోని ప్రచండ వర్గం నుంచి శ్రీలంకలోని ఎల్‌టీటీఈ వరకు సంబంధాలు పెట్టుకుని రెడ్ కారిడార్ ఏర్పరిచింది.

ఏదో ఒక నాటికి దుర్భేద్య స్థావరాలు అవసరమవుతాయనే కొండపల్లి సీతారామయ్య దూరాలోచన మేరకు వింధ్యారణ్యాల్లోని ఆదివాసీ ప్రాంతాల్లో వైద్యులు, టీచర్ల రూపంలో 1980ల నుంచే బేస్ ఏర్పరచుకున్నారు. ఆ స్థావరాలే ఇప్పటిదాకా ఉద్యమ నాయకత్వాన్ని కాపాడుకుంటూ వచ్చాయి. ఒకానొక సమయంలో అసలీ దావానలాన్ని ఆపగలమా అనే సందేహం పాలకవర్గాల్లో కలిగింది. కానీ ఊహించని స్థాయిలో విరుచుకుపడిన టెక్నాలజీ కారణంగా, ఆత్మరక్షణ వ్యూహాలతో ఉద్యమ విస్తరణ వెనుకబడడంతో సాయుధ పోరాటం చివరికొక అనాథలా ముగియడం సామాజిక విషాదం.

భారతదేశంలో సాయుధ పోరాటాలు, మావోయిస్టు పార్టీ పాత్రలపై ఏదో ఒక రోజు సమగ్ర చరిత్ర లిఖితమవుతుంది. ఈ ఉద్యమం మిగిల్చిన నెత్తుటి మరకలు, త్యాగాలు, అరాచకాలు, అన్నివైపులా జరిగిన ప్రాణనష్టం, క్రమేపీ కుంచించుకుపోయిన మేధావి వర్గం పోషించిన పాత్ర, జరిగిన వాగ్వాదాలు, పంథాల మధ్య ఘర్షణలు ఎలాగూ అక్షరాలకెక్కుతాయి. అరవయ్యేళ్ల సాయుధ పోరాట ఆలోచనా ప్రవంతిలో, కీలక సమయాల్లో జరిగిన నిర్ణయాల గురించి విపులంగా పరిశోధిస్తే, తప్పొప్పులను తూకం వేసుకోవడమే కాక, రాబోయే తరాల ఆలోచనలకు ఒక దిక్సూచి దొరుకుతుంది.

చైనాను మావో నడిపిన రోజుల్లో ముందడుగు (గ్రేట్ లీప్ ఫార్వర్డ్), సాంస్కృతిక విప్లవం పేరిట జరిగిన అరాచక ఆలోచనలు, సాయుధ పోరాటాలని అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలకు ఎగుమతి చెయ్యాలన్న నిర్ణయంలో భాగంగా భారతదేశంలో సాయుధ పోరాటానికి పునాది వేసి, రాళ్లు పేర్చింది అప్పటి ‘గ్యాంగ్ ఆఫ్ ఫోర్.’ అలా విదేశీ ఉత్ప్రేరకాల మూలాలున్నప్పటికీ, చారు మజుందార్, వెంపటాపు సత్యం, కొండపల్లి సీతారామయ్య లాంటి అతి సాధారణ వ్యక్తులు అన్ని లక్షల మందిని సాయుధ విప్లవం వైపు, అజ్ఞాత జీవితం వైపు, త్యాగాలు, మరణాల వైపు నడిపించగలిగారంటే, అప్పటి ప్రధాన రాజకీయ స్రవంతి, పాలనా యంత్రాంగం, ప్రజల సమస్యలు, ఆలోచనల పట్ల ఎంత గుడ్డితనంతో వ్యవహరించాయో అర్థమవుతుంది.

మావో బతికుండగానే నక్సల్బరీ వసంత గర్జన కలకత్తా వీధుల్లో శవమై తేలింది. శ్రీకాకుళ రైతాంగ పోరాటం అనుకోకుండా జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌తో నిశ్శబ్దమైపోయింది. చంద్ర పుల్లారెడ్డి మరణానంతరం కూడా పరిమిత హింసతో ఆ గ్రూపు కొనసాగింది. కానీ పోలీసులతో తలపడడానికి, కవ్వింపు చర్యలకు దూరంగా ఉంది. కానీ వీటన్నిటికీ నేపథ్యంలో కొండపల్లి మొదలెట్టిన పీపుల్స్‌వార్ గ్రూప్ మొదటి నుంచీ దూకుడుతనాన్నే ప్రదర్శించింది. మరి గతంలో వచ్చి పోయిన పాలపొంగుల్ని, వాస్తవ విప్లవ పరిస్థితుల్ని సరిగ్గానే అంచనా వేసిందా? 1976లో మావో మరణానంతరం గ్యాంగ్ ఆఫ్ ఫోర్‌ని తరిమికొట్టి, డెంగ్ నాయకత్వంలో చైనా పూర్తిగా సంస్కరణవాదం వైపు మళ్లడాన్ని ఏ మాత్రం సరిగ్గా అర్థం చేసుకుంది? ఎమర్జెన్సీలో జరిగిన అణచివేతకు ప్రతీకారంగా యువ విప్లవకారులు అరాచక హత్యల వైపు మళ్లినప్పుడు మేధావి వర్గం ఏ మేరకు గైడ్ చేసింది? భారత రాజకీయాల్లో భార్గవ కమిషన్ల వాతావరణం శాశ్వతమనుకున్నారా?

అతివాద, మితవాద వర్గాల ఘర్షణల్లో ప్రతిసారీ అతివాదులదే పైచేయి అయింది. అతివాదాన్ని సమర్థించే మేధావి వర్గ పరిమాణం కృశించిపోతుండగా, మితవాద మేధావులు క్రమేపీ విత్‌డ్రా అయిపోయారు. 1990 సోవియట్ యూనియన్ పతనం నుంచి నేర్చుకున్నదేమిటి? చరిత్ర గమనాన్ని గుర్తించారా? కొండపల్లిని బహిష్కరించడం, తర్వాత వరుసగా కర్నూలులో కన్నబీరన్, గుంటూరులో బాలగోపాల్ నిష్క్రమణ... సాయుధ పోరాటాన్ని ఏ దుస్సాహసాల వైపు నడిపించాయి?

> స్వాతంత్ర్య పోరాటంలో మిలిటెంటు రాజకీయాల వల్ల జరిగిన ప్రాణ నష్టాలతో పోలిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలో జరిగిన నష్టాలు ఎక్కువ. దానితో పోలిస్తే మావోయిస్టు సాయుధ ఉద్యమంలో జరిగిన ధన, ప్రాణ నష్టాలు కొన్ని వందల రెట్లు ఎక్కువ. ఈ మూడింట్లో ఏవీ నిరుపయోగంగా జరగలేదు. కానీ అంతకన్నా తక్కువ త్యాగాలు, నష్టాలతో, ప్రత్యామ్నాయ పోరాట మార్గాలలో ఎక్కువ మేలు జరిగే అవకాశాలు ఉన్నాయా అని ఇప్పటికైనా మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

ఒక పక్క ఎన్నికలు బహిష్కరించమని పిలుపులిస్తూ, పోలింగ్ స్టేషన్ల మీద దాడులు చేస్తూ, బ్యాలెట్ బాక్సులు ధ్వంసం చేస్తూ, ఇంకో పక్క 1983, 85 ఎన్నికలలో ఎన్టీఆర్‌ను, 1989లో చెన్నారెడ్డిని, 1994లో మళ్లీ ఎన్టీఆర్‌ను సమర్థించి, 1999, 2004లో తెలుగుదేశానికి బద్ధ వ్యతిరేకంగా పనిచేసి ఏం సాధించారు? వీళ్లతో ఎప్పటికయినా ప్రమాదమే అని అన్ని ప్రధాన పార్టీలకూ సంకేతాలివ్వడం తప్ప! తీరా 2009 నాటికి ఎన్నికలలో ఏ ప్రభావమూ చూపలేని పరిస్థితికి దిగజారిపోయారు.

1995లో ఉత్తర తెలంగాణను విముక్త గెరిల్లా ప్రాంతంగా ప్రకటించుకుని, ప్రత్యేక తెలంగాణకు పిలుపునిచ్చారు. దాన్ని వీవీ, బాలగోపాల్, కోదండరామ్, హరగోపాల్, గద్దర్‌లు విస్తృతంగా ప్రజల్లోకి, విద్యార్థుల్లోకి తీసుకెళ్లారు. కానీ తీరా తెలంగాణ ఏర్పడే నాటికి ఆ ప్రాంతాల్లో సాయుధ పోరాట దళాలే కనుమరుగైపోయి, పొరుగు రాష్ట్రాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి. మరి ప్రత్యేక తెలంగాణ పోరాటం ఏ దోపిడీ వర్గాల ప్రయోజనం కోసం చేసినట్టు?

ఇలా చరిత్ర చౌరస్తాలో ఎన్నోసార్లు నిలబడ్డా, సాయుధ పంథాను, వాస్తవ పరిస్థితులను, ప్రపంచ గమనాన్ని, టెక్నాలజీ ప్రభావాన్నీ ఎప్పుడూ సీరియస్‌గా సమీక్షించకుండా, విప్లవ బద్ధకాన్ని ప్రదర్శించడం వల్లే, ఈ వారించదగిన ప్రాణనష్టం, పరువు నష్టం జరిగాయేమో అని ఆలోచించాల్సిన సమయమిది. పూర్తిగా అశక్తులై... అవకాశమివ్వండి, చర్చలకొస్తాం అని అభ్యర్థించే స్థాయికి రావడం వెనుక వ్యూహాత్మక తప్పిదాలు, మేధావి వర్గాల ఉపసంహరణ, కొట్టుకుపోయే ధోరణులు ఎంతవరకు కారణమో విశ్లేషించుకోవాలి.

పునరాలోచించుకోమన్న వారందరినీ అన్యవర్గ ధోరణి ప్రభావితులనో, విప్లవ ప్రతీఘాత శక్తులనో, రివిజనిస్టులనో పక్కకు నెట్టేయడం వల్ల నష్టం జరిగింది ఎవరికి? రీగన్, థాచర్‌ల ప్రభావం, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నాల నేపథ్యంలో బ్రిటిష్ లేబర్ పార్టీయే తనను తాను పునర్నిర్వచించుకుని, న్యూ లేబర్‌గా అవతరించగా లేనిది, కీలక సమయాల్లో ఎంఎల్ పార్టీలు అటువంటి రాజకీయ బాధ్యత ఎందుకు తీసుకోలేదు?

నష్టపోయారు, ఓడిపోయారు కాబట్టి అపహాస్యం చెయ్యడం అనాగరికం. ఇరువైపులా పోయిన ప్రాణాలన్నీ మనవే. చరిత్రలోని ఈ అధ్యాయం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను విస్మరిస్తే, భవిష్యత్తులో మరిన్ని కష్టాలు, నష్టాలు తప్పవు. స్వాతంత్ర్య పోరాటంలో మిలిటెంటు రాజకీయాల వల్ల జరిగిన ప్రాణ నష్టాలతో పోలిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలో జరిగిన నష్టాలు ఎక్కువ. దానితో పోలిస్తే మావోయిస్టు సాయుధ ఉద్యమంలో జరిగిన ధన, ప్రాణ నష్టాలు కొన్ని వందల రెట్లు ఎక్కువ.



> ఒకానొక సమయంలో అసలీ దావానలాన్ని ఆపగలమా అనే సందేహం పాలకవర్గాల్లో కలిగింది. కానీ ఊహించని స్థాయిలో విరుచుకుపడిన టెక్నాలజీ కారణంగా, ఆత్మరక్షణ వ్యూహాలతో ఉద్యమ విస్తరణ వెనుకబడడంతో సాయుధ పోరాటం చివరికొక అనాథలా ముగియడం సామాజిక విషాదం. నష్టపోయారు, ఓడిపోయారు కాబట్టి అపహాస్యం చెయ్యడం అనాగరికం. ఇరువైపులా పోయిన ప్రాణాలన్నీ మనవే. చరిత్రలోని ఈ అధ్యాయం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను విస్మరిస్తే, భవిష్యత్తులో మరిన్ని కష్టాలు, నష్టాలు తప్పవు.

ఈ మూడింట్లో ఏవీ నిరుపయోగంగా జరగలేదు. అన్నిటి వల్లా సమాజానికి ఎంతో కొంత మేలే జరిగింది. కానీ అంతకన్నా తక్కువ త్యాగాలు, నష్టాలతో, ప్రత్యామ్నాయ పోరాట మార్గాలలో ఎక్కువ మేలు జరిగే అవకాశాలు ఉన్నాయా అని ఇప్పటికైనా మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. ఇన్ని పోరాటాలు చేసి, ఇన్ని త్యాగాలు చేసి, చివరకు రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను ఎటువంటి శక్తులకు అప్పజెప్పాం?

తుపాకులు, మందుపాతర్లు, ప్రజాకోర్టులు మాదక ద్రవ్యాల్లాంటివి. అలాగే బూటకపు ఎన్‌కౌంటర్లు కూడా. ఒకసారి అలవాటుపడితే వెనక్కి రావడం కష్టం. ప్రజల మెదళ్లలో నెగళ్లు రాజేసి, వాళ్లనే ఆలోచనాపరుల్ని చేయనంతకాలం రాజకీయాలను అవుట్‌సోర్సింగ్‌కి ఇచ్చేయడానికే అలవాటుపడతారు. సమస్యలు వారివి అయినపుడు పరిష్కారాల కోసం ప్రత్యామ్నాయాలు వెతుక్కునే పని కూడా వారిదే. దానికోసం విస్తృత స్థాయిలో త్యాగాలు చెయ్యనక్కరలేదు. వకాల్తా పుచ్చుకుని ప్రాణ త్యాగాలు చేసినంత మాత్రాన ప్రేక్షకుల ఆలోచనాస్థాయి మారదు. బల ప్రయోగంతో బానిసల్ని చెయ్యగలరు గానీ, బలవంతాన ఎవర్నీ స్వతంత్రుల్ని చెయ్యలేం. ఈ సుదీర్ఘ పోరాట ప్రయోగంతో ‘చితి’కిపోయిన ప్రాణాలకు, కుటుంబాలకు లాల్ సలాం.

■ ఎ.బి. వెంకటేశ్వరరావు
(మాజీ పోలీసు ఉన్నతాధికారి)

మెకాలే శృంఖలాల్లో భారతీయ మేధ


స్వతంత్ర భారతదేశ మేధా ప్రస్థానంలో ఒక ప్రధాన అపసవ్యతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరిగ్గా ఎత్తి చూపారు. దశాబ్దాల స్వపరిపాలన ఆ కళంకాన్ని రూపుమాపలేకపోయిందని ఆయన గర్హించారు. ఇటీవల రామనాథ్ గోయెంకా స్మారకోపన్యాసం వెలువరిస్తూ ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. భారతీయులు వలసపాలనలో రూపొందిన మనస్తత్వాలను త్యజించి, తమ స్వీయ నాగరికతా వారసత్వం ఆలంబనతో పరిపూర్ణ స్వావలంబన దేశాన్ని నిర్మించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఆ ఉపన్యాసంలో థామస్ బాబింగ్టన్ మెకాలే గురించి మోదీ చేసిన వ్యాఖ్యలను నేను అంగీకరిస్తున్నాను. మనలను మనం ‘గులామీకి మానసికతా’ (మానసిక బానిసత్వం) నుంచి విముక్తం చేసుకోవాలని, రాబోయే దశాబ్ద కాలం చాలా నిర్ణయాత్మక కాలమని ఆయన పిలుపునివ్వడాన్ని నేను బలపరుస్తున్నాను. నేనూ ఒక సూచన చేయదలిచాను: వచ్చే పది సంవత్సరాల కాలంలో మనం భారతీయ జనతా పార్టీని అధికార పీఠాల నుంచి కూలదోసి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావజాల ప్రభావాన్ని తొలగించాలి.



■ యోగేంద్ర యాదవ్

ఎకసెక్కంగానో, ఎత్తిపొడుపుగానో నేను ఆ సూచన చేయలేదు. మేధా నిబద్ధతతో, కొత్త ఆలోచనలను పురిగొల్పే లక్ష్యంతోనే నేనా సూచన చేశాను. అవును, మెకాలే మానసపుత్రులపై సమరాన్ని తిలక్‌ధారి మెకాలేలను దీటుగా ఎదుర్కోవడం ద్వారా ప్రారంభించాలి. ఆ తరువాత సూట్‌లు ధరించి టైలు కట్టుకునే నవీన కులీన మెకాలేల భరతం పట్టాలి. సాంస్కృతిక జాతీయవాదం అనే ప్రచ్ఛన్న రూపంలో ఉన్న మానసిక బానిసత్వం బ్రౌన్ సాహిబ్‌ల (పాశ్చాత్య జీవనశైలి, భాష, ఆలోచనా పద్ధతులను అనుసరించే స్వదేశీ పెద్ద మనుషులు) అసభ్యకరమైన, కనిపించే బానిసత్వం (పాశ్చాత్య పద్ధతులు, ఆదర్శాలను గుడ్డిగా అనుకరించడం) కంటే మరింత ప్రమాదకరమైనది.

మెకాలే 1835లో రాసిన ‘మినిట్ ఆన్ ఇండియన్ ఎడ్యుకేషన్’ లక్ష్యాల గురించి ముందు తెలుసుకుందాం. ఇంగ్లీషు బోధనా మాధ్యమంగా ఉండాలని సంప్రదాయ భారతీయ విషయాల కంటే పాశ్చాత్య శాస్త్రాలు, సారస్వతాన్ని ప్రోత్సహించాలని మెకాలే తన నివేదికలో సూచించాడు. ‘ఒక మంచి యూరోపియన్ గ్రంథాలయంలో ఒక బీరువాలో ఉన్న పుస్తకాల విలువ– భారత్, అరేబియాలు సృష్టించిన మొత్తం సాహిత్యం కంటే ఉన్నతమైనది. సంస్కృత భాషలోని సమస్త పుస్తకాల నుంచి సమీకరించిన చారిత్రక పరిజ్ఞానం, ఇంగ్లాండ్‌లో ఒక ప్రాథమిక పాఠశాల పాఠ్యగ్రంథంలో సంక్షేపించిన జ్ఞానం కంటే తక్కువ విలువైనది. ఇది ప్రాకృతిక, నైతిక తత్వశాస్త్రాలలోని ప్రతి విభాగానికీ వర్తిస్తుంది’ అని మెకాలే పేర్కొన్నాడు. ఈ కారణంగా భారతీయ విద్యారంగానికి ఆయన చేసిన విధాననిర్దేశమిది: ‘మనకు, మనం పాలించే ప్రజలకు మధ్య వారధులుగా ఉండే ఒక ప్రత్యేక వర్గాన్ని సృష్టించడం మన విద్యా విధాన లక్ష్యం కావాలి. ఆ ప్రత్యేక వర్గంలో ఉండేవారు రక్తం, రంగులో భారతీయులు అయినప్పటికీ అభిరుచులు, నమ్మకాలు, నైతిక విలువలు, అభిప్రాయాలు, తెలివితేటల్లో ఇంగ్లీష్‌వారుగా ఉండాలి’.



> వర్తమాన పాలకుల జాతీయవాద వాక్పటిమ వలసపాలనలో మనం స్వీయ అస్తిత్వాన్ని కోల్పోయామనే వాస్తవాన్ని మరచిపోయేలా చేస్తోంది. జాతి కోల్పోయిన ఆత్మగౌరవాన్ని తిరిగి సాధించేందుకు మనం ‘సంఘ్’ భావజాల ప్రభావం నుంచి బయటపడి మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ మేధా మార్గాలలో ముందుకు సాగాలి.

పాశ్చాత్య సామ్రాజ్యవాదుల రాజకీయ ఆధిపత్యానికి, ఆర్థిక దోపిడీకే కాకుండా జ్ఞానపరమైన హింస (పాలితుల అవగాహనా సామర్థ్యాలు, జ్ఞానసముపార్జనా పద్ధతులు, దృక్పథాలను తిరస్కరించడం, అణచివేయడం)కు కూడా భారత్ గురయిందన్న వాస్తవాన్ని మెకాలే ‘మినిట్’ మనకు జ్ఞాపకం చేస్తోంది. అయితే, ఆధునిక యుగానికి ముందు పరిఢవిల్లిన భారతీయ విద్యా విధాన ప్రశస్తత గురించి మోదీ వ్యాఖ్యలను (బహుశా ఆయన ధరమ్‌పాల్ పుస్తకం ‘ది బ్యూటిఫుల్ ట్రీ’ నుంచి స్ఫూర్తి పొంది ఉంటారు) నిశితంగా పరీక్షించవలసిన అవసరం ఉన్నది. మెకాలే ప్రణాళిక విజయవంతమవడంపై ఆయన విచారం వాస్తవానుగుణ్యమైనది, ఆయన అభిప్రాయాలలో సత్యవాదిత్వం ఉన్నది. బ్రిటిష్ పాలకులు పెంపొందించిన విద్యా వ్యవస్థ భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని చావుదెబ్బ తీసింది. బ్రౌన్ సాహిబ్ (రక్తం, రంగులో మాత్రమే భారతీయులు)ల పాలనలోనే ఉండిపోయాము. స్వతంత్ర భారతదేశ విద్యావ్యవస్థ మెకాలే వారసత్వాన్ని చాలా వరకు కొనసాగించిందన్న మోదీ ఆరోపణ నిజమే. మన సమాజంలో ‘విదేశీ మేధావుల నుంచి స్వీకరించిన భావాల, దిగుమతి చేసుకున్న వస్తువుల, ‘సేవల’ ప్రభావం మితిమీరిన స్థాయిలో ఉండడాన్ని మోదీ తీవ్రంగా ఆక్షేపించారు.

మోదీ వాదనలను కొట్టివేసేందుకు విమర్శకులు కపట, కృత్రిమ వాదనలపై ఆధారపడ్డారు. వారిలో కొంతమంది స్వాతంత్ర్యానంతర భారతీయ విద్యా వ్యవస్థ వలసపాలనాకాల విద్యావ్యవస్థకు కొనసాగింపు కాదని వాదించారు. అధికారిక ఉద్దేశాలు, అభిమతాలలో ఆ కొనసాగింపు లక్షణాలు లేని మాట నిజమే కాని ఆచరణల్లో ఆ పాత వ్యవస్థనే కొనసాగించారన్నది నిజం. ఆంగ్ల భాషకు ప్రాధాన్యమివ్వడమే అందుకొక తార్కాణం. ఆధునిక విద్య, ఆంగ్ల భాష సుగుణాలను ప్రస్తుతించేవారు ఒక వింత వాదన చేస్తున్నారు. మన పూర్వకాలపు జ్ఞాన వ్యవస్థలను, దేశీయ భాషలను పక్కన పెడితేనే నవీన విద్య, ఇంగ్లీష్ నుంచి మనం సంపూర్ణ ప్రయోజనాలు పొందగలుగుతామనేది ఆ వాదన సారాంశం. ఈ విమర్శకులు నిజానికి మెకాలేతో ఏకీభవిస్తున్నారు. మెకాలే విద్యా విధానంలో శిక్షణ పొందినవారిలో ఆత్మన్యూనతా భావం బాగా ఉందన్న ప్రధానమంత్రి అభిప్రాయానికి ఆ విమర్శకులే నిదర్శనం.

వలసపాలన తన విధేయులనే కాకుండా విమర్శకులను కూడా ఎలా తనకు అనుకూలంగా కట్టడి చేస్తుందో ఆశిష్ నంది (వర్తమాన సజీవ భారతీయ ఆలోచనాపరులలో అగ్రగణ్యుడు, వలసవాద మానసిక ప్రభావాల గురించి నిశితంగా విశదీకరించిన విజ్ఞుడు) జీవితకాల మేధా కృషి తేటతెల్లం చేసింది. వలసవాదంలో రెండు విభిన్న దశలను ఆయన గుర్తించారు. మొదటిది: భూభాగాలను ఆక్రమించుకోవడం, రెండోది: హేతుబద్ధమైన ‘నాగరిక’ భావజాలాల ద్వారా పాలితుల సంస్కృతిని, ఆలోచనా పద్ధతులను ప్రభావితం చేయడం. తద్వారా పాశ్చాత్య ఆధిపత్య భావనలను పాలితులు అంతర్గతీకరించుకునేలా చేస్తుంది. పాశ్చాత్య సంస్కృతి, విలువలు, సంస్థలు తమ వాటికంటే మెరుగైనవి, అభివృద్ధి చెందినవని నమ్మేలా చేసే ప్రక్రియ అది. ఈ ప్రక్రియను ఆశిష్ నంది తన పుస్తకం ‘ది ఇంటిమేట్ ఎనిమీ: లాస్ అండ్ రికవరీ ఆఫ్ సెల్ఫ్ అండర్ కొలోనియలిజం’లో సమగ్రంగా వివరించారు. శతాబ్దాల వలసపాలనతో పాశ్చాత్య ప్రపంచం మనకు ‘సన్నిహిత శత్రువు’ (ఇంటిమేట్ ఎనిమీ) అయిందని నంది అభివర్ణించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రవచించే జాతీయవాదం వలసవాదంతో ప్రేరేపితమైన అనుకరణ ప్రతిస్పందనలకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. మోదీ వెలువరించిన గోయెంకా ఉపన్యాసం కూడా అటువంటి ప్రతిస్పందనలకు ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ‘గవర్నెన్స్ మోడల్’, ‘టూరిజం’ ‘మేడ్ ఇన్ ఇండియా’ మొదలైన భావనల గురించి ఆయన ప్రస్తావించారు. ఈ ఆంగ్ల పదాలు ఆయన హిందీ ఉపన్యాసంలో ప్రస్తావితమయ్యాయి. అవన్నీ ‘దిగుమతి అయిన భావాలు’ అన్న వాస్తవాన్ని అర్థం చేసుకోకుండానే వాటిని ఆయన ప్రస్తావించారు మరి. నూతన విద్యా విధానం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. నిజానికి అది అమెరికన్ విద్యా విధానానికి భారతీయ జ్ఞాన వ్యవస్థల అంశాలను కలగలుపుతూ రూపొందించిన విధానమే.

ఆరెస్సెస్ సైద్ధాంతిక పత్రాలు, బీజేపీ భావజాల పెద్దల రచనలు చదివితే ఆ సంస్థలు తమ సంస్థాపక భావాలను భారతీయ నాగరికతా విలువలకు విరుద్ధంగా పాశ్చాత్య దేశాల నుంచి ఎలా సంగ్రహించిందీ అర్థమవుతుంది. ప్రధాన భావన అయిన జాతీయవాదం విఫలమైన పాశ్చాత్య జాతి-రాజ్యం నమూనాకు అనుకరణే. ఎందుకంటే, ఆ విఫల పాశ్చాత్యనమూనా సాంస్కృతిక స్వరూప స్వభావాల ఏకరూపతను, అధికార కేంద్రీకరణను డిమాండ్ చేస్తుంది. ఇది మన నాగరికతా అనుభవానికి విరుద్ధమైనది. హిందుత్వ భావజాలంలోని దూకుడుతనం, మితిమీరిన ప్రభుత్వ జోక్యం (హైపర్-స్టేటిజం), కలహశీల మెజారిటేరియన్ వాదం అంతర్గతీకరించుకున్న ఆత్మన్యూనతా భావాన్ని దాచిపెడుతున్నాయి.

వలసవాద మేధను సూచించేదేమిటి? వలస పాలకుల ఆధిపత్య ప్రాపంచిక దృక్పథాన్ని అంతర్గతీకరించుకుని మనసా వాచా కర్మణా వారికి ప్రతిరూపంగా వెలుగొందాలన్న లక్ష్యమే వలసవాద మేధకు గీటురాయి. ఈ దృష్ట్యా మన వలసవాద మనోవైఖరులు కొనసాగేందుకు ప్రస్తుత పరిపాలనా విధానం ఒక ఆలంబనగా ఉన్నది. కాషాయ వస్త్రధారులైన మెకాలే వారసుల పాలన ఆంగ్ల మానసపుత్రుల పరిపాలన కంటే అధ్వానమైనది. వర్తమాన పాలకుల జాతీయవాద వాక్పటిమ వలసపాలనలో మనం స్వీయ అస్తిత్వాన్ని కోల్పోయామనే వాస్తవాన్ని మరచిపోయేలా చేస్తోంది. జాతి కోల్పోయిన ఆత్మగౌరవాన్ని తిరిగి సాధించేందుకు మనం ‘సంఘ్’ భావజాల ప్రభావం నుంచి బయటపడి మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ మేధా మార్గాలలో ముందుకు సాగాలి.

(వ్యాసకర్త ‘స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)


వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు కియోస్క్

రాంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కియోస్కో ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు సులువని టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. పైలెట్ ప్రాజక్టులో భాగంగా నక్కలగుట్టలోని విద్యుత్ బిల్లుల చెల్లింపుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పేమెంట్ సిస్టం (కియోస్కో)ను సీఎండీ బుధవారం ప్రారంభించారు. వినియోగదారులు క్యూలో నిలబడకుండా తమ బిల్లులను చెల్లించేలా యూనియన్ బ్యాంకు సహకారంతో రూపొందించామన్నారు. త్వరలోనే అన్ని ఈఆర్వో సెంటర్‌లలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వి.తిరుపతిరెడ్డి, సీజీయం చరణ్‌దాసు, సీఈ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

చికాకుల షి'కారు'

గ్రామ పంచాయతీ ఎన్నికలు గులాబీ నేతల్లో చిచ్చుపెడుతున్నాయి. ముందుముందు నియోజకవర్గాల పునర్విభజన ఉండటంతో సేఫ్ సీటుపై గులాబీ నేతలు కన్నేస్తున్నారు. దీంతో పంచాయతీ ఎన్నికల్లో కొత్త పంచాయితీ మొదలైంది. ప్రధానంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తితో పాటు వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యతలు కావాలని పట్టుబడుతుండటం, ఆయన వ్యతిరేక శిబిరం అడ్డుపడుతుండటంతో గులాబీలో అంతర్గత కుమ్ములాటలకు తెర తీస్తోంది. దాదాపు రెండేళ్లుగా వరంగల్, జనగామ జిల్లాకు అధ్యక్షులను అధిష్ఠానం నియమించకపోవటం గులాబీ కేడర్‌లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. పంచాయతీ ఎన్నికల్లో కేడర్‌ను సమన్వయం చేసే దిక్కు లేకుండా పోయారన్న చర్చ జరుగుతోంది.



'గులాబీ'లో గలాటా

బీఆర్ఎస్ నేతల మధ్య పంచాయితీ

- వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యతలపై ఎర్రబెల్లి వర్సెస్ వినయభాస్కర్
- పాలకుర్తితో పాటు వర్ధన్నపేట తనదే అంటున్న ఎర్రబెల్లి
- హనుమకొండ జిల్లా పరిధిలోని మండలాల్లో వినయ్ పంచాయితీ
- మనస్థాపంతోనే కేటీఆర్ పర్యటనకు ఎర్రబెల్లి దూరంగా ఉన్నట్లు ప్రచారం
- రెండేళ్లుగా జనగామ, వరంగల్ జిల్లాకు అధ్యక్షులను నియమించని అధిష్ఠానం
- బీఆర్ఎస్ నేతల్లో సమన్వయలోపంతో పంచాయతీ ఎన్నికలపై ప్రభావం

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన ఓరుగల్లులో గులాబీ పుట్టెడు కష్టాల్లో ఉంది. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతోపాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఘోరపరాజయంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. అధికారం లేకపోవటం, పార్టీ కీలకనేతల వలసలతో గులాబీ తుమ్ముళ్లలో నైరాశ్యం నెలకొంది. అయితే పంచాయతీ ఎన్నికల్లో పట్టు సాధించి పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు అధిష్ఠానం చేస్తున్న ప్రయత్నాలు నేతల ఆధిపత్య పోరుతో నీరుగారిపోతోందనే ఆందోళన గులాబీ శ్రేణుల్లో వ్యక్తం అవుతోంది. ప్రధానంగా రాజకీయాల్లో ఉద్ధండుడిగా పేరున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ ప్రజాసమస్యలపై పాలకుర్తి నియోజకవర్గంలో తిరుగుతున్నారు. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వర్ధన్నపేట మాజీ అరూరి రమేష్ రాజీనామా చేశారు. దీంతో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వాలని ఒకవర్గం అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చింది. అయితే పాలకుర్తితో పాటు తనకే వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్టుబట్టారు. అయితే ఈ ఇన్‌చార్జి బాధ్యతల గొడవకు కేసీఆర్ ఫుల్‌స్టాప్ పెడుతూ గత ఏప్రిల్‌లో జరిగిన పార్టీ రజతోత్సవ వేడుకల బాధ్యతలు దయాకర్ రావుకే అప్పగించారు. అయితే పంచాయతీ ఎన్నికలు రావటంతో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలపై మరోసారి లొల్లి తెరపైకి వచ్చింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న



కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడుతుండగా హసన్‌పర్తి ముఖ్యనాయకులకు వినిపిస్తున్న ఎర్రబెల్లి (ఫైల్)

(మిగతా 7లో..)

పట్టాలెక్కిన 'తొలివిడత' పోరు

ముగిసిన ఉపసంహరణల ఘట్టం

- పంచాయతీల్లో తేటతెల్లమైన పోటీ చిత్రం
- జోరందుకోనున్న అభ్యర్థుల ప్రచారం
- ఉపసంహరణల కోసం జోరుగా నేతల బుజ్జగింపులు, ఒత్తిళ్లు
- పూర్తయిన గుర్తుల కేటాయింపు
- సర్పంచ్‌కు గులాబీ రంగు బ్యాలెట్
- వార్డు సభ్యులకు తెల్ల రంగు బ్యాలెట్



గెలిపిస్తే కోతుల బెడద తీర్చుతానని కమలాపూర్ మండలంలో తన అనుచరులకు ఎలుగుబంటి డ్రెస్ వేసి ప్రచారం చేస్తున్న అభ్యర్థి

హనుమకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల బరిలో ఎవరెవరు ఉన్నారనేది స్పష్టమైంది. మొదటి విడత ఎన్నికల ముఖ చిత్రం తేటతెల్లమైంది. దీనితో అధికారికంగా ఎన్నికల ప్రచారం మొదలైంది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. దీంతో అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులతో ఇప్పటి నుంచి ప్రచారం సాగించనున్నారు. ఇప్పుడు బ్యాలెట్ పత్రాలపై గుర్తులు మాత్రమే

(మిగతా 6లో..)

హోరాహోరీ

- ఎల్కతుర్తిలో 20 సర్పంచ్ స్థానాలకు 68 మంది..
- భీమదేవరపల్లిలో 25కు 89 మంది..
- కమలాపూర్‌లో 24కు 109 మంది...

హనుమకొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలకు సంబంధించి పోటీచిత్రం తేటతెల్లమైంది. ఎల్కతుర్తి మండలంలో 20 సర్పంచ్ స్థానాలకు 117 నామినేషన్ల రాగా, బుధవారం 25 మంది ఉపసంహరణతో తుది బరిలో 68 మంది అభ్యర్థులు ఉన్నారు. 180 వార్డు స్థానాలకు 445 నామినేషన్లు వేయగా, 35 మంది అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. 410 మంది బరిలో ఉన్నారు. ఈ మండలంలో శాంతినగర్, గుంటూరుపల్లి సింగిల్ నామినేషన్‌లు ఉండడంతో అధికారులు ఎకగ్రీవంగా ప్రటించారు. భీమదేవరపల్లి మండలంలో 25 గ్రామాలకు రెండు గ్రామాలు ఏకగ్రీవం కావడంతో 23 సర్పంచ్ స్థానాలకు 137 నామినేషన్లు రాగా, 45 మంది ఉపసంహరించుకున్నారు. తుదిబరిలో 89 మంది అభ్యర్థులు ఉన్నారు. అలాగే 232 వార్డు స్థానాలకు 568 నామినేషన్లు దాఖలుకాగా, 77 మంది అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. బరిలో 425 మంది ఉన్నారు. కమలాపూర్ మండలంలో మొత్తం 24 గ్రామాలకు కొత్తపల్లి గ్రామం ఏకగ్రీవం అయ్యింది. 23 సర్పంచ్ స్థానాలకు 246 నామినేషన్లు వచ్చాయి. 45 మంది ఉపసంహరణతో బరిలో 109 మంది ఉన్నారు. అలాగే 246 వార్డుస్థానాలకు 45 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా, 77 మంది అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. బరిలో 554 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

'మూడోవిడత' నామినేషన్లు షురూ

తొలిరోజు 68 సర్పంచ్ స్థానాలకు 62 దాఖలు

హనుమకొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరిధిలో 3వ విడత గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డుస్థానాల ఎన్నికల నామినేషన్లు బుధవారం ప్రారంభమయ్యాయి. దామెర మండలంలో 14 గ్రామ పంచాయతీలకు, 8 నామినేషన్లు, 132 వార్డు స్థానాలకు 11 నామినేషన్లు, నడికూడ మండలంలో 14 గ్రామ పంచాయతీలకు 12 నామినేషన్లు, 138 వార్డు స్థానాలకు 31 నామినేషన్లు, శాయంపేట మండలంలో 24 గ్రామ పంచాయతీలకు 30 నామినేషన్లు, 212 వార్డు స్థానాలకు 24 నామినేషన్లు, ఆత్మకూరు మండలంలో 16 గ్రామ పంచాయతీలకు 6 నామినేషన్లు, 152 వార్డు స్థానాలకు 22 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. మండలాల్లో క్లస్టర్ల వద్ద అధికారులు ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5గంటల లోపు వచ్చిన అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరించినట్లు తెలిపారు.

మూడో విడత నామినేషన్ కౌంటర్ | మొదటి రోజు 03-12-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
దామెర	14	12	132	11
శాయంపేట	24	30	212	24
నడికూడ	14	12	138	31
ఆత్మకూరు	16	08	152	20
మొత్తం	68	62	634	86

5 పంచాయతీలు ఏకగ్రీవం

హనుమకొండ జిల్లాలో తేలిన మొదటి విడత ఏకగ్రీవాలు

హనుమకొండ, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత బుధవారం నామినేషన్ల ఉపసంహరణ జరిగిన తర్వాత ఏకగ్రీవం అయిన పంచాయతీల సంఖ్య పెరిగింది. హనుమకొండలో జిల్లాలో 5 జీపీలు ఏకగ్రీవం అయ్యాయి. ఎల్కతుర్తి మండలంలో శాంతి నగర్ (ఎస్సీ మహిళ)లో వేలంగిని మేరీ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయగా ఏకగ్రీవమయ్యారు. భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డ తండా పంచాయతీ (ఎస్టీ మహిళ)లో కాంగ్రెస్ బలపరిచిన గుగులోతు పూర్ణిమ ఏకగ్రీవం అయ్యారు. అలాగే ఇదే మండలం గాంధీనగర్‌లో కేతిరి లక్ష్మారెడ్డి (జనరల్) కాంగ్రెస్ మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే కమలాపూర్ మండలం కొత్తపల్లి జీపీ నుంచి పుల్లూరి రవీందర్ రావు (జనరల్) బీఆర్ఎస్ మద్దతుతో ఏకగ్రీవం అయ్యారు.

అమెరికా నుంచి నామినేషన్

- బందంపల్లి సర్పంచ్ పదవిపై రిటైర్డు ఎస్సై గురి
- తిరిస్కరించిన ఎన్నికల అధికారి

దుగ్గొండి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బందంపల్లి గ్రామ సర్పంచ్ పదవి జనరల్‌కు రిజర్వు అయింది. ఈ గ్రామానికి చెందిన పోరెడ్డి లక్ష్మారెడ్డి ఇటీవల అమెరికాలోని తన పిల్లలవద్దకు వెళ్లారు. ఇంతలోనే సర్పంచ్ ఎన్నికలు వచ్చాయి. సర్పంచ్‌గా పోటీచేయాలని అనుకున్న లక్ష్మారెడ్డి నామినేషన్ ఫామ్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నింపి, సంతకం చేసి ఆన్‌లైన్‌లో పంపించారు. బందంపల్లికి చెందిన పోరెడ్డి శరత్ బలపరిచి స్పీడ్ పోస్టు ద్వారా వచ్చిందని తెలిపి మంగళవారం సాయంత్రం లక్ష్మీపురంలోని ఎన్నికల కేంద్రం ఆర్‌వోకు దాఖలు చేశారు. లక్ష్మారెడ్డి కొన్ని నెలల కిందట ములుగు ఎస్సైగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. 2013 నుంచి 2018 వరకు లక్ష్మారెడ్డి భార్య సుభద్ర బందంపల్లి సర్పంచ్‌గా పనిచేశారు. అయితే లక్ష్మారెడ్డి వేసిన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి భద్రమ్మ బుధవారం తిరస్కరించారు. నామినేషన్ పత్రంలో ఇంక్‌పెన్‌తో సంతకం చేయలేదని, ఆన్‌లైన్‌లో వచ్చినట్లు పరిశీలనలో తేలినందున తిరస్కరించినట్లు వెల్లడించారు.

కుక్కలు వెంటపడడంతో...

- బైక్ అదుపు తప్పి కిందపడిన యువకుడు
- తలకు గాయాలతో అక్కడికక్కడే మృతి



శివకుమార్(ఫైల్)

గీసుగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఉద్యోగం చేసుకొని ద్విచక్ర వాహనంపై రాత్రి ఇంటికి వస్తున్న ఓ యువకుడిని వీధి కుక్కలు వెంటాడాయి.. దీంతో బెదిరిపోయిన యువకుడు బైక్ స్పీడ్ పెంచాడు.. ఈ క్రమంలో అదుపుతప్పి డ్రైనేజీలో పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటన మంగళవారం అర్ధరాత్రి మచ్చాపూర్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి గ్రామానికి చెందిన ఆడెపు శివకుమార్ (24) హన్మకొండలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం హనుమకొండకు వెళ్లిన శివకుమార్ పనులు పూర్తయిన తరువాత తిరిగి రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలు దేరాడు. కాగా, మార్గంమధ్యలో మచ్చాపూర్ వద్దకు రాగానే అకస్మాత్తుగా కుక్కలు వెంబడించాయి. దీంతో ఆందోళన చెందిన అతను అదుపుతప్పి రోడ్డుకు పక్కనున్న మట్టి దిబ్బను ఢీకొట్టి డ్రైనేజిలో పడిపోయాడు. తలకు గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. మృతుడు అవివాహితుడు.

మామను కత్తితో పొడిచిన అల్లుడు

- తోపులాటలో ఇద్దరికీ గాయాలు
- కుటుంబ కలహాలే కారణం

మట్టెవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంతో మామ అల్లుళ్లు పరస్పరం కత్తితో దాడులకు పాల్పడ్డారు. చివరికి ఇద్దరూ ఆస్పత్రిపాలయ్యారు. మట్టెవాడ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రామన్నపేటకు చెందిన గున్నాల ప్రభాకర్ మూడు నెలలుగా స్థానిక బొడ్రాయి ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడు. ఆయన రెండో కూతురు శ్రీకన్యను హనుమకొండ నయీంనగర్ ప్రాంతానికి చెందిన వాకేటి అనిల్‌కుమార్‌రెడ్డికి ఇచ్చి ఆరు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. అల్లుడు, కూతురు తరుచూ గొడవ పడుతుండటంతో వారితో రామన్నపేట పోతన నగర్‌లో అద్దె ఇంట్లో కాపురం పెట్టించారు. శ్రీకన్య మట్టెవాడలోని ఓ ప్రైవేట్ సంస్థలో పని చేస్తోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి దంపతుల మధ్య మళ్లీ గొడవ జరిగింది. దాంతో శ్రీకన్య తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. తర్వాత అనిల్‌కుమార్‌రెడ్డి వచ్చి శ్రీకన్యతో గొడవపడుతుండగా అడ్డువచ్చిన అత్తమామలతో సైతం ఘర్షణకు దిగాడు. గొడవ పెద్దదవడంతో అనిల్ వెంట తెచ్చుకున్న కత్తితో మామ ప్రభాకర్‌ను పొడిచాడు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో అనిల్‌కుమార్‌రెడ్డికి సైతం గాయాలయ్యాయి. ఇద్దరికీ రక్తస్రావం కావటంతో వెంటనే ఎంజీఎంకు తరలించారు. సమాచారం అందుకున్న క్లూస్‌టీం సభ్యులు వచ్చి ఆధారాలు సేకరించారు. ప్రభాకర్ పెద్ద కూతురు కొత్త లావణ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అనిల్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఎస్‌ఐ సబ్బని శివకృష్ణ తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

వడ్డెపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. పెన్షన్లు, భవిత కేంద్రాలు, స్కాలర్‌షిప్‌లు, ప్రత్యేక స్వయం సహాయక సంఘాలు, విద్య, ఉపాధి, గృహకల్పనలో దివ్యాంగులకు ప్రత్యేక కోటా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున దివ్యాంగులకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల సౌకర్యార్థం అంబేద్కర్ భవన్‌లో, కలెక్టరేట్‌లో ర్యాంపు సౌకర్యం ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వేడుకల్లో భాగంగా బన్ను, వికాస్, లిటిల్‌ఫ్లవర్ స్కూల్, స్పందన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన దివ్యాంగులకు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి, డీఆర్‌డీవో మేన శ్రీను, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఈసంపెల్లి జోనా, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, అనితారెడ్డి, బిల్ల మహేందర్, దివ్యాంగ సంఘం ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, సీడీపీవో విశ్వజ, ఎఫ్ఆర్‌ఓ రవికృష్ణ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జి అధికారి సౌరం ప్రవీణ్‌కుమార్, భాస్కర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

డీసీసీ కూర్చుపై కసరత్తు

- పదవులపై ఆశావహుల చూపు
- బెర్త్ కోసం అప్పుడే ప్రయత్నాలు
- హనుమకొండ జిల్లా కాంగ్రెస్‌లో రాజకీయ సందడి



హనుమకొండ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హనుమకొండ జిల్లా కమిటీ త్వరలో ఏర్పాటు కానుంది. జిల్లా అధ్యక్షుడిగా ఇనుగాల వెంకట్రాంరెడ్డిని పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు కూడా స్వీకరించారు. ఇనుగాల సారథ్యంలోని నూతన కమిటీపై పార్టీలో భారీ అంచనాలే ఉన్నాయి. కమిటీపై పలువురు ఆశావహులు కన్నేశారు. అప్పుడే లాబీయింగ్ యత్నాలు ముమ్మరం చేశారు. తమ నాయకుల వద్ద ఆశించే పదవులపై ఏకరువు పెడుతున్నారు. ఈ పరిస్థితి ఒక విధంగా ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలకు కూడా సంకటంగా మారింది. తమ సిఫార్సులు ఫలించకపోతే అనుంగుల అసంతృప్తితో ఇమేజ్ దెబ్బతింటుందనే భావనతో బడా నేతల్లో కూడా డీసీసీ కమిటీ అంశం టెన్షన్‌కు గురి చేస్తోంది. ఉపాధ్యక్ష, ప్రధానకార్యదర్శి, కార్యదర్శి తదితర ముఖ్యమైన పదవులను ఆశించే వారే అధికంగా ఉన్నారు. టీపీసీసీ బెర్త్‌లోకి చాలా మంది సీనియర్లు వెళ్లడంతో నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీలో చోటు దక్కుతుందనే ఆశలతో యువనాయకులు, కార్యకర్తలు ఉన్నారు. మండల, డివిజన్ అధ్యక్షులు ఇక ఆ పదవుల నుంచి డీసీసీ కమిటీలోకి రావాలనే ఉత్సుహతతో ఉన్నారు. వీరితో పాటు గత కమిటీలో నామమాత్రపు స్థాయి పదవుల్లో ఉన్న వారు ఈసారి ముఖ్య స్థానాల వైపు దృష్టి పెట్టారు. దీంతో జిల్లా కాంగ్రెస్ కొత్త కమిటీ రూపకల్పన పార్టీ వర్గాల్లో చర్చంశనీయాంగా మారింది.

కూర్పుపై ఆసక్తి

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సారథిగా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రాంరెడ్డి కమిటీ ఎలా రూపొందిస్తారేది ఆసక్తికరంగా మారింది. పదవులు ఆశించే వారి ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతల సిఫార్సుల పరిగణన, ఇక తన స్వీయ నిర్ణయాలను జోడించడం, మద్దతు కూడగట్టుకోవడం తదితర వాటిని ఇనుగాల ఎదుర్కోవాల్సి ఉంది. ఈ తరుణంలో ఆయన ఒత్తిళ్లకు లోనయ్యే పరిస్థితే ఉంటుంది. వీటన్నింటినీ అధిగమించి కమిటీ ఏర్పాటు తంతు ఇనుగాల ఎలా పూర్తి చేస్తారనేదే పార్టీలో హాట్‌టాపిక్‌గా ఉంది. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల క్రమంలో డీసీసీ కమిటీ వెంటనే ప్రకటించలేప్పటికీ డిసెంబరు లేదా జనవరి ప్రథమార్థంలో కమిటీ ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంటుందనే అభిప్రాయాలను పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.



మొంథా తుఫాన్ బాధితులను

ఆదుకోవాలి

- వరంగల్‌కు రూ.100కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి
- పార్లమెంట్‌లో ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి

హనుమకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు మొంథా తుఫాన్ వల్ల జరిగిన నష్టానికి కేంద్రం తక్షణ సహాయం అందించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. బుధవారం లోక్‌సభలో జీరో అవర్‌లో ఈ అంశంపై గళమెత్తారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 200 మిల్లీమీటర్లకుపైగా వర్షం కురవడంతో శివనగర్, ఎన్ఎన్‌నగర్, డీకేనగర్ సహా 54 కాలనీలు వరదనీటిలో తీవ్రంగా మునిగిపోయాయని వివరించారు. పోతనరోడ్, భద్రకాళి పాలిటెక్నిక్ రోడ్డు, ములుగు రోడ్డు, బొంది వాగు, పోచమ్మమైదాన్ 80 అడుగుల రహదారి పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అమృత్ స్మార్ట్‌సిటీల కింద చేపట్టిన డ్రైనేజీ పనులు 66 శాతం మాత్రమే పూర్తికావడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. వరద పనులకు రూ.100కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కావ్య అభ్యర్థించారు. వరంగల్‌లో డిజిటల్ సేవల విస్తరణపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కూడా కావ్య కోరారు. బుధవారం పార్లమెంట్‌లో వరంగల్‌లో డిజిటల్ సేవల విస్తరణ అంశాన్ని ఎంపీ లేవనెత్తారు. ప్రజల డిజిటల్ భద్రతను మరింత పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. 5జీ సేవలు, పోస్టల్ సేవల డిజిటలీకరణ, డిజిటల్ సాక్షరత, సైబర్ భద్రతపై ఎంపీ వివరణ కోరారు. ఈ మేరకు 5జీ సేవల విస్తరణ కోసం ఇప్పటి వరకు 209 బీటీఎస్ టవర్లు ఏర్పాటు చేసినట్లు కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.



టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న అర్చక, ఉద్యోగ సంఘ నేతలు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన అర్చక, ఉద్యోగ సంఘం నేతలు

హనుమకొండ, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచారి, జేఏసీ కోకన్వీనర్ డీవీఆర్ పరాశరం రవీంద్రాచార్యులు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిశారు. అర్చక, ఉద్యోగులు ఎదర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అభ్యర్థించారు. ఇందుకు టీపీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. అర్చకులు, స్వీపర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగులకు దేవాదాయ శాఖ ద్వారా న్యాయం జరిగేలా సీఎం చొరవతో త్వరలో పరిష్కారం లభిస్తుందని అన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ కె.గిరికుమార్ సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరికుమార్ మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో జరుగుతున్న సైబర్‌నేరాల్లో చువుకున్న ఉద్యోగులు మోసపోతున్నారన్నారు. విద్యార్థులు సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండి అందరికీ అవగాహన కల్పించాలన్నారు.

సోషల్ మీడియాను అతిగా వాడితే హాని తప్పదని హెచ్చరించారు. అపరిచితులకు వ్యక్తిగత సమచారాన్ని సమర్పించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ ఎ.గోపాల్, ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు అశోక్, శివకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రాజ్‌కుమార్, అధ్యాపకులు యాకూబ్, దయాకర్, భిక్షపతి, విజయ్‌చందర్, రాజేష్, శ్రీదేవి, రేవతి, శ్రీదేవి, స్టూడెంట్ కౌన్సిలర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై నేరం రుజువైనందున మూడేళ్ల జైలుశిక్ష, రూ.21వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి బుధవారం తీర్పు చెప్పారు. అదే విధంగా బాధితురాలికి రూ.50వేల నష్ట పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలికను హనుమకొండ బాలసముద్రం ప్రాంతానికి చెందిన లకావత్ వీరు అనే వ్యక్తి ప్రేమించాలని వెంటపడుతూ మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెట్టాడు. ఈ క్రమంలో ఆమె అశ్లీల ఫొటోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తుండటంతో బాధితురాలు తల్లిదండ్రులకు తెలిపింది. ఈ విషయమై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎం.చందర్ సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా కె.రమేశ్వరి, దర్యాప్తు అధికారులుగా సీఐలు పి.రవి, ఎండి.గాలిబ్‌లు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

స్మార్ట్‌సిటీ పనులపై విజిలెన్స్ విచారణ?

- ఇంజనీరింగ్ విభాగాన్ని వివరాలు కోరిన అధికారులు
- స్మార్ట్‌సిటీ పథకం బడ్జెట్ ఎంత? ఖర్చు వివరాలు సేకరణ
- ఇటీవలి వర్షాలకు నగరం ముంచెత్తడంతో దర్యాప్తు



వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన మొంథా తుపాన్ కారణంగా వరంగల్ నగరం వరద ముంపుబారిన పడిన విషయం విదితమే. ఇందుకు స్మార్ట్‌సిటీ పథకం పనులు ప్రమాణాలకు విరుద్ధంగా చేయడమే కారణమని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ క్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజాసంఘాలు ఫిర్యాదు చేయడంతో విచారణ చేయాలని నిఘా విభాగాలకు ఆదేశాలు అందాయి. దీంతో సెంట్రల్ విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగినట్టు విశ్వసనీయ సమాచారం. ఇద్దరు అధికారులు జీడబ్ల్యూఎంసీకి చేరుకుని సంబంధిత ఇంజనీరింగ్ సెక్షన్‌తోపాటు స్మార్ట్‌సిటీ ప్రతినిధులను కలిసినట్టు తెలిసింది. స్మార్ట్‌సిటీ పథకం ఎప్పుడు ప్రారంభం అయ్యింది? ఏ సంస్థ డిజైన్ చేసింది? మొత్తం స్మార్ట్‌సిటీ పథకానికి సంబంధించిన నిధులు ఎన్ని? ఇప్పటివరకు జరిగిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై పూర్తి నివేదిక ఇవ్వాలని కోరినట్టు తెలిసింది.

అసలు ఏం జరిగింది?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పట్టణాలు ఆధునీకరించే క్రమంలో వరంగల్ నగరాన్ని స్మార్ట్‌సిటీ పథకానికి 2015లో ఎంపిక చేశారు. భద్రకాళి బండ్, వడ్డెపల్లి బండ్, స్మార్ట్‌రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణంలో పాటు బయో మైనింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ. 1000కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టులో పనులను డిజైన్ చేసేందుకు లీ అసోసియేట్స్ డిజైన్స్ సంస్థ రూ.50కోట్లు తీసుకుని 77 పనులు పూర్తి చేసేందుకు డిజైన్ చేశారు. కానీ ఇప్పటివరకు సగం పనులు కూడా పూర్తి కాలేదు. వెయ్యి కోట్లకు రూ.550కోట్లు ఖర్చు చేయగా, మిగతా రూ.450 కోట్లు పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఎంపీ కడియం కావ్య స్మార్ట్‌సిటీ పనులు నిర్వహించేందుకు మరి కొంత సమయం కావాలని కోరడంతో 2025 డిసెంబరు 31 వరకు కేంద్ర ప్రభుత్వం గడువు ఇచ్చింది. అయినా ఇప్పటి వరకు కూడా భద్రకాళి బండ్ రెండో దశ పనులు, వడ్డెపల్లి బండ్ పనులు, బయోమైనింగ్ ప్లాంట్‌తోపాటు చాలా పనులు ఎక్కడికక్కడ తిష్టవేసుకుని కూర్చున్నాయి.

అక్రమాలు

నగరంలో మూడు పెద్ద నాలాలైన నయీంనగర్, రంగంపేట, బొంది వాగు పరివాహకప్రాంతాలలో అక్రమార్కులు బఫర్‌జోన్‌లను సైతం ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. జీడబ్ల్యూఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొందరు లంచాలు పుచ్చుకుని తప్పు అని తెలిసినా అడ్డదారిలో ఇండ్ల అనుమతులు ఇవ్వడంతో నగరానికి ఈ దుస్థితి వచ్చిందిని గుర్తించారు. నగరంలో ప్రధానంగా 29 నాలాలు పూర్తిగా కుచించుకుపోయి వర్షంనీరు వెళ్లే అవకాశం లేకపోవడంతో వర్షం నీరు డ్రైనేజీల నుంచి ఇండ్లు, కాలనీలలో వచ్చి జల ప్రళయం సృష్టించాయి. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, శిఖం భూములను రక్షించాల్సిన వరంగల్ నగర పాలక సంస్థ పాలక వర్గంతో పాటు అధికారులు డబ్బుల తప్పులో కాలు వేయడంతో చిన్నపాటి వర్షానికే నగరం నీటి మునుగుతుందని సీనియర్ ఇంజనీర్లు చెప్పుకొస్తున్నారు.

జీడబ్ల్యూఎంసీ పరిధిలో ఉన్న ఏ ఒక్క చెరువుకు కూడా ఇప్పటి వరకు కచ్చితమైన హద్దులు నిర్వహించలేదు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షానికి సాయిగణేశ్ కాలనీ, గాంధీనగర్, డీకే నగర్, లెనిన్‌నగర్, వివేకానంద కాలనీ, శివనగర్, ఎస్సీఆర్ నగర్, ఎంఎస్ నగర్, సీఎస్ఆర్ గార్డెన్, కొత్తబస్‌స్టేషన్, గోకుల్‌నగర్, శాంతినగర్, కాశిబుగ్గ, రంగశాయిపేట, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, ఉర్సుగుట్ట, టీకే నగర్, మైసయ్యనగర్, గోపాలపురం, తెలంగాణ జంక్షన్, రంగంపేట, ఎన్‌జీవోఎస్ కాలనీ, పోచమ్మకుంట, ఎల్‌వీఆర్ కాలనీ, కొత్తవాడ, కాపువాడ, పాతబీటుబజార్, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, అండర్ రైల్వే గేట్ ప్రాంతాలతోపాటు సుమారు వంద కాలనీలు నీటిలో మునిగిపోవడానికి అడ్డదిడ్డంగా డిజైన్ చేసిన స్మార్ట్‌సిటీ పనులే కారణమని ప్రజలు మండిపడుతున్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నగరం వర్షంతో ముంచెత్తడానికి కారణమైన స్మార్ట్‌సిటీ పనుల పురోగతితో పాటు గతంలో చేసిన పనులను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయనున్నారు. పనుల రూపకల్పన, టెండర్లు, కాంట్రాక్టు పొందిన సంస్థలు, పనుల నాణ్యత, పనులకు సంబంధించి ఉపయోగించిన మెటీరియల్, బిల్లుల చెల్లింపులు, అధికారులు, కాంట్రాక్టర్లు పొందిన లంచాల పర్సంటేజీలపై దర్యాప్తు చేయనున్నట్టు తెలిసింది.

327 ఉమ్మడి వరంగల్ ఎంఆర్టీ డివిజన్ కమిటీ ఎన్నిక

రాంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327 అనుబంధంగా ఉన్న ఉమ్మడి వరంగల్ ఎంఆర్టీ డివిజన్ కమిటీని బుధవారం హనుమకొండ పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో యూనియన్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పి.సారంగపాణి, కార్యదర్శిగా కె.రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎస్.శోభారాణి, యు.రవిందర్, ఎం.శ్రీదేవి, జాయింట్ సెక్రటరీలుగా ఆర్.ప్రా ణయిత, ఎన్.వనజ, డి.సుజాత, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.అంబేద్కర్, ఆర్.హరి, ఎస్.కమలాకర్, జాకీర్ అరిస్టన్, కోశాధికారిగా జె.విద్యాసాగర్ ఎన్నికయ్యారు.



నూతనంగా ఎన్నికైన 327 ఎంఆర్టీ డివిజన్ కమిటీ

జీఎంహెచ్ ఆర్ఎంవోగా మంజుల



వరంగల్ మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్ ఆర్ఎంవోగా డాక్టర్ అన్నెపాక మంజులను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ జిల్లా దామెర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మంజుల డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతిపై జీఎంహెచ్ ఆర్ఎంవోగా బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఖమ్మంకు చెందిన ఆమె ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాల అంతర్జాతీయ సదస్సు

వర్ధన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19, 20 తేదీలలో వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ అనే అంశంపై అంతర్జాల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వర్ధన్నపేట ప్రభు త్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.పోషయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ అంశంపై పరిశోధన చేసిన రాబ్సన్, కిటగావా, ఓమర్‌యాగిలకు ఈ సంవత్సరం కెమిస్ట్రీ నోబుల్ ప్రైజ్ వరించిందన్నారు. మెంటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ సాంకేతికతను ఉపయోగించి పర్యావరణంలోని కాలుష్య వాయువులను వేరు చేయవచ్చని, ఔషధాలను సమర్థవంతంగా శరీరంలో లక్ష్యాలకు చేరవేయవచ్చున్నారు. అదేవిధంగా ఎడారిలో నీటిని సృష్టించవచ్చు అనే అంశలపై రెండు రోజులు జరిగే ఈ అంతర్జాల అంతర్జాతీయ సదస్సును ఉద్దేశించి ఫ్రాన్స్ దేశానికి చెందిన శాస్త్రవేత్తలు, అదే విధంగా మన దేశంలోని ప్రసిద్ధ సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారని సదస్సు కన్వీనర్ డాక్టర్ నేరేళ్ల శ్రీనివాస్ తెలిపారు.



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిగ్రీ కళాశాల ప్రొఫెసర్లు

న్యాయవాదులు రాజ్యాంగ విలువలు పాటించాలి



ప్రసంగిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధీర్

వరంగల్ లీగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ న్యాయవాది సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, రాజ్యాంగ విలువలు కాపాడాలని వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ అన్నారు. బుధవారం తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన న్యాయవాద దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.రమాకాంత్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్స జనార్దన్, సంయుక్త కార్యదర్శి శశిరేఖ, కార్యవర్గ సభ్యులు ఇ.సురేశ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పట్టాలెక్కిన 'తొలివిడత' పోరు

(5వ పేజీ తరువాయి)

ఉంటాయి కనుక పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ గుర్తులను ఓటర్లు గుర్తుంచుకునేలా ప్రచారం సాగిస్తారు. పార్టీలకతీతంగా పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నందు వల్ల ప్రచారంలో అభ్యర్థి గుర్తును ఓటర్లు గుర్తుంచుకొని ఓటు వేయడమే ప్రధానం. ఈ దిశగా అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రచార వ్యూహాలను రూపొందించుకున్నారు.

గురువారం నుంచి గుర్తులతో అభ్యర్థులు ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు. ఎన్నికల ప్రచారానికి ఎక్కువ సమయం లేదు. కేవలం వారం గడువు మాత్రమే ఉన్నది. ఈలోగానే అభ్యర్థులు తమ గుర్తులతో బలంగా ఓటర్ల దగ్గరకు వెళ్లాల్సి ఉంటుంది. మొదట విడత పోలింగ్ ఈనెల 11వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుంది. అదేరోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుంది. ఉపసర్పంచుల ఎన్నిక కూడా అదే రోజు నిర్వహిస్తారు. మొదటి విడత భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల పరిధిలోని 69 స ర్పంచ్, 658 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. అన్ని గ్రామాల్లో మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మద్దతుదారులు మాత్రం కచ్చితంగా పోటీలో ఉండనున్నారు

ప్రచారం

ప్రచారంలో భాగంగా అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులతో కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ముద్రించుకొని ఓటర్ల వద్దకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ప్రతీరోజు ఎక్కడా సమయాన్ని వృథా చేయకుండా ప్రచారంలో దూసుకెళ్లనున్నారు. కొందరు అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా గ్రామాభివృద్ధికి తమ ఎజెండాను వివరించడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బిర్యానీలు, మద్యం సీసాల పంపిణీకి ఇంకొందరు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మొత్తంగా అసలు సిసలైన ఎన్నికల వాతావరణం గురువారం నుంచి పల్లెల్లో మొదలవనున్నది.

హైడ్రామా

ఉపసంహరణల రోజు బుధవారం అన్ని గ్రామపంచాయతీల్లో హైడ్రామాలు చోటు చేసుకున్నట్టు తెలిసింది. ప్రధానపార్టీలు మద్దతునిస్తున్న అభ్యర్థు లు గెలిచే వ్యూహంలో భాగంగా ఆ పార్టీల ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు సైతం తిరుగుబాటుదారులు, స్వ తంత్ర అభ్యర్థులు బరిలో నుంచి తప్పుకునేలా తీవ్రస్థాయిల్లో ఒత్తిళ్లు తీసుకువచ్చారు. బుధవారం 3గం టలలోగా నామినేషన్లు ఉపసంహరించుకునేలా పావులు కదిపారు. వారిని నయానో భయానో ఒప్పించారు. తాయిలాలు ఆశ చూపారు. వచ్చే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇస్తామని హామీలు ఇచ్చారు.

బుజ్జగింపులకు చల్లబడిన తిరుగుబాటుదారులను కార్యకర్తలను వెంట పంపించి క్లస్టర్ కేంద్రాల్లో నామినేషన్లు ఉపసంహరించుకునే వరకు జాగ్రత్తగా వ్యవహారం నడిపారు. బరిలో ఎక్కువ మంది నిలి స్తే ఓటర్లు చీలిపోయే ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే కొందరు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పోటీలో కొనసాగాలని నిర్ణయించుకున్నారు.

అక్షర క్రమంలో గుర్తులు

మొదటి విడత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులను తెలుగు అక్షర క్రమంలో కేటాయించారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలల్లో తమ పేర్లను ఎలా పేర్కొన్నారో అలాగే తెలుగు అక్షరాల క్రమాన్ని గుర్తించారు. కొందరు అభ్యర్థులు తమ ఇంటిపేరును ముందుగా, మరికొందరు చివరగా పేర్కొన్నారు. ఏ పేరు ముందుగా ఉంటుందో దాని తెలుగు అక్షరం ఆధారంగా గుర్తులు కేటాయించారు. సర్పంచి ఎన్నిక నిర్వహణకు ఎన్నికల సంఘం 30 గుర్తులను కేటాయించింది. మరో గుర్తుగా నోటాను అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు ఎక్కువగా ఉంటే ప్రత్యేక బ్యాలెట్ ముద్రిస్తారు. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన గుర్తులను పింక్ రంగు బ్యాలెట్ పేపర్‌పై ముద్రించారు. ఆయా గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థుల సంఖ్య ప్రకారం సిద్ధం చేసి న బ్యాలెట్ పేపర్లను పంపిస్తారు. వార్డు సభ్యులకు 20 గుర్తులు కేటాయించింది. నోటాతో కలుపుకొని 21 గుర్తులు ఉంటాయి. వార్డు సభ్యుల ఎన్నికల గుర్తులను తెల్లరంగు బ్యాలెట్‌పై ముద్రించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7100	6300
మక్కలు	1851	1521
కందులు	----	----
పెసళ్లు	----	----
పల్లికాయ (సూక)	5400	4860
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	11259	11000
పసుపు (గోల)	11556	11256
తేజ మిర్చి (కొత్త)	----	----
తేజ మిర్చి ఏసీ	14200	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	18500	12000
యూఎస్341ఏసీ	16500	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



తైబందీ.. ఏమైందీ..!?

- పాకాల యాసంగి సాగుపై రైతుల ఆశలు
- తైబందీ ఖరారు కోసం ఎదురు చూస్తున్న వైనం
- ఈసారి పూర్తి ఆయకట్టుకా..? రొటేషన్ విధానంలోనా?
- సాగునీటి అధికారుల నిర్ణయంపై సందిగ్ధం
- ఖరీఫ్ కలిసి రాక యాసంగిపైనే ఆశలు

ఖానాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాకాల ఆయకట్టులో యాసంగి తైబందీ ఖరారు ఎప్పుడో అని రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పాకాల ఆయకట్టులో ఖరీఫ్‌కు సంబంధించి వరికోతలు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నది. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 60 శాతానికిపైగా కోతలు పూర్తయ్యాయి. మరొక 10 నుంచి 15 రోజుల్లో కోతలు పూర్తిదశకు చేరుకోనున్నాయి. ఈ ఏడాది వానాకాలం సాగు రైతులకు కలిసి రాలేదు. అధిక వర్షాలు, తుఫాన్‌ల కారణంగా వాతావరణం అనుకూలించగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల దిగుబడే వస్తున్నది. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

ఈ నేపథ్యంలో పాకాల ఆయకట్టు రైతులు యాసంగి పంటల సాగుకోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు త్వరగా తైబందీ నిర్ణయిస్తే వానాకాలం సాగు పనులను త్వరగా ముగించుకుని యాసంగి సాగుకు సమాయత్తమయ్యేందుకు రైతులు సిద్ధపడుతున్నారు.


పూర్తిస్థాయి ఆయకట్టుకా..? రొటేషన్ విధానమా..?

పాకాలకు గోదావరి జలాల రాకతో ఏటా పూర్తిస్థాయిలో రెండు పంటలకు సాగునీటిని అందిస్తున్నారు. పాకాల ఆయకట్టులో పంటకాలువలు అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఈ క్రమంలో వానాకాలం, యాసంగిలో సాగుకు ముందు పంట కాలువలను శుభ్రం చేయడం ఆనవాయితీగా మారింది. అయినప్పటికీ ఈ ఏడాది వానాకాలంలోనే చివరి ఆయకట్టుకు నీరందించడం కష్టతరంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో యాసంగిలో చివరి ఆయకట్టుకు నీరందించడం ఎలా? అనే విషయంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పూర్తిస్థాయి ఆయకట్టుకు తైబందీ ఖరారు చేస్తే పంటలు ఎండిపోయే ప్రమాదముంది. అదే జరిగితే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు పాకాల పంట కాలువల ఆధునీకరణ కోసం ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రూ.140కోట్ల ప్రతిపాదనలు పంపించారు. నేడో రేపో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. నిధులు మంజూరైతే వెంటనే పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. అప్పుడైనా కొంత ఆయకట్టుకు సాగును నిలిపివేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అధికారులు యాసంగి సాగుకు పూర్తిస్థాయిలో తైబందీ ఖరారు చేస్తారా..? లేక గతంలో మాదిరిగా రొటేషన్ విధానం అనుసరిస్తారా? అని రైతులు అయోమయానికి గురవుతున్నారు. కానీ, రైతులు మాత్రం వానాకాలం సాగు కలిసి రానందున యాసంగి పూర్తిస్థాయిలో ఇవ్వాలని కోరుతున్నారు. రైతుల సందిగ్ధానికి వీలైనంత త్వరలో అధికారులు తెరదించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తైబందీ ఖరారు చేస్తేనే మేలు

యాసంగి తైబందీని త్వరగా ఖరారు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. సకాలంలో నార్లు పోసుకుని నాట్లు వేసుకుంటారు. దీంతో కోతల సమయంలో అకాలవర్షాల ముప్పు తగ్గించుకోగలుగుతారు. అదేవిధంగా ముందుగా సాగు పనులు చేపట్టడం మూలంగా సన్నధాన్యం ఎక్కువ రోజులకు దిగుబడినిచ్చే రకాలను సాగుచేసుకోగలుగుతారు. తద్వారా రైతులకు దిగుబడి పెరిగి ఆర్థికంగా లాభం చేకూరుతుంది. రైతుల ప్రయోజనాల దృష్ట్యా అధికారులు త్వరగా తైబందీ ఖరారు చేయాలి.

- పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలు
- ఎన్టీఆర్ హయాంలో పలు మార్పులు
- నాడు బోర్డులు.. నేడు పంచాయతీలు..
- పంచాయతీలే నిచ్చెన మెట్లుగా ఎదిగిన నాయకులు
- తండాలకు పంచాయతీ హోదా
- 567 నుంచి 1,708కి పెరిగిన పంచాయతీలు



స్వపరిపాలనకు 130 ఏళ్లు

హనుమకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వనరులను, మానవ వనరులను సద్వినియోగం చేయడంలో ప్రతీ పౌరుడు భాగస్వాములు కావడానికి పంచాయతీరాజ్ సంస్థలు ఒక వేదికగా పని చేస్తాయి. వందల, కిలో మీటర్ల దూరంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రజలకు అందుబాటులో లేకపోవచ్చు. కానీ స్థానిక స్వపరిపాలన సంస్థలు పరిపాలనను ముంగిటకు తీసుకువెళ్లడంలో కీలక పాత్రను పోషిస్తాయి. పరిపాలనలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను నెలకొల్పడానికి ఆలంబనగా పని చేస్తాయి. అలాంటి పంచాయతీ సంస్థల ప్రస్థానం, వాటి పరిణామ క్రమం ఎలా సాగిందో చూద్దాం..

నాడు బోర్డులు

దస్తుర్-అమల్ కింద జిల్లా స్థాయిలో జిల్లా బోర్డు, తాలూకా స్థాయిలో తాలూకా బోర్డులు తొలిసారిగా ఏర్పాటయ్యాయి. ఇవే ఆ తర్వాత కాలంలో అనేక మార్పులకు లోనయ్యాయి. దస్తుర్-ఉల్-అమల్‌కు ముందు సెస్సు వసూలు జిల్లాలో జనాభా అధికంగా ఉన్న (అంటే ప్రస్తుత మేజర్ పంచాయతీల్లాగా) కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉండేది. 1,899 నుంచి మొత్తం ఉమ్మడి జిల్లాకు వర్తింపచేశారు. జిల్లా బోర్డు హనుమకొండ కేంద్రంగా, తాలూకా బోర్డులు మహబూబాబాద్, ములుగు, పరకాల, పాకాల, జనగామ కేంద్రాలుగా పని చేసేవి.

పంచాయతీలు

ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ చట్టం 1964లో అమలులోకి రావడంతో అప్పటివరకు ఆచరణలో ఉన్న హైదరాబాద్ పంచాయతీ చట్టం-1856 రద్దయింది. పంచాయతీరాజ్ చట్టం కింద జిల్లాలో మొదట 1097 గ్రామాలను కలుపుకొని 564 పంచాయతీలు ఏర్పాటయ్యాయి. వీటిలో 12 నోటిఫైడ్‌వికాగా 552 నాన్‌నోటిఫైడ్ పంచాయతీలు. 1965లో మరో నాలుగు పంచాయతీలు అదనంగా తోడయ్యాయి.

130 ఏళ్ల ప్రస్థానం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒకప్పుడు 567 పంచాయతీలు ఉండేవి. ఆ తర్వాత కాలంలో 1,008కి పెరిగాయి. తదనంతర కాలంలో అదనంగా మరో 700 తోడయి వాటి సంఖ్య ప్రస్తుతం 1708కి చేరుకున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానిక స్వపరిపాలన 130 ఏళ్ల కిందటే ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మార్పులకు లోనైంది. పంచాయతీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పలు చట్టాలు అమలులోకి వచ్చాయి. 1894లో దస్తుర్-ఉల్-అమల్ (క్రమబద్ధీకరణ)తో పంచాయతీలకు అంకురార్పణ జరిగింది. ఆ తర్వాత కాలంలో ఈ వ్యవస్థ మహావృక్షంగా ఎదిగింది. దీని నీడలో పల్లెలు ప్రగతి పథంలో పయనించాయి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపాలుగా మారాయి.

ఐదంచెలు

ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలో ఐదంచెల వ్యవస్థ అమలులోకి వచ్చింది. ఎన్టీఆర్ సమితులను రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకువచ్చారు. జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీకి మధ్య అదనంగా ఎంపీటీసీ, జడ్పీటీసీలను తీసుకువచ్చారు. దీంతో గ్రామాల్లో అప్పటి వరకు సర్పంచ్‌లకు ఉన్న అధికారాలు, ప్రాతినిధ్యం, వారి ప్రాబల్యం తగ్గిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీల పటిష్టతకు సంస్కరణలు చేపట్టింది. 500 జనాభా ఉన్న తండాలను కూడా పంచాయతీలుగా చేసింది. దీనితో ఉమ్మడి జిల్లాలో మరో 700 పంచాయతీలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం మొత్తం పంచాయతీల సంఖ్య 1008 నుంచి 1708కి పెరిగింది.

సర్పంచ్‌ల స్థాయి నుంచి..

పంచాయతీలు ఎందరో నాయకులకు రాజకీయ భిక్షపెట్టింది. రాజకీయాల్లో ఎదగడానికి నిచ్చెనలుగా నిలిచాయి. ఉమ్మడి జిల్లాలో సర్పంచ్ స్థాయి నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన వారు ఎంతో మంది ఉన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు స్వర్గీయ హయగ్రీవాచారి మొదట వేలేరు సర్పంచ్. రాజకీయాల్లో రాణించి మంత్రి స్థాయికి చేరుకున్నారు. మాజీ మంత్రులు మందాడి నర్సింహారెడ్డి, నెమురుగొమ్ముల యతిరాజారావు, రెడ్యానాయక్, చందూలాల్ తదతరులు వీరిలో ఉన్నారు. ఎడబోయిన బస్వారెడ్డి సర్పంచ్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యారు. బోడకుంటి వెంకటేశ్వర్లు కూడా సర్పంచ్ నుంచి ఎంపీ, ఎమ్మెల్సీ పదవులను అలంకరించారు. యతిరాజారావు భార్య విమలాదేవి కూడా సర్పంచ్ స్థాయి నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యారు. ప్రస్తుత రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఎంపీటీసీ స్థాయి నుంచి రాజకీయంగా ఎదిగారు.

సమితులు

1956లో హైదరాబాద్ జిల్లా బోర్డుల చట్టం ఏర్పాటు స్వపరిపాలనలో ఒక మైలురాయి. కానీ 1959లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్‌ల చట్టం వచ్చిన తర్వాత ఇది రద్దయింది. అప్పటి నుంచి పంచాయతీరాజ్ వ్యవస్థలో మూడంచెల వ్యవస్థ అమలులోకి వచ్చింది. 1959 డిసెంబరు 1న జిల్లా పరిషత్ ఏర్పాటైంది. అప్పట్లో జిల్లాలో 8 పంచాయతీ బ్లాకులు, 2 నాన్ సమితి బ్లాకులు ఉండేవి. 1952 అక్టోబరు 2న ములుగులో మొదటి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బ్లాక్ ఏర్పాటైంది. 1964లో సమితుల సంఖ్య 17కు పెరిగింది. అయితే ఇదే ఏడు జరిగిన పునర్‌వ్యవస్థీకరణ ఫలితంగా సమితుల సంఖ్య 14కు తగ్గింది. ఘనపూర్, వర్ధన్నపేట, హనుమకొండ, జనగామ, కొడకండ్ల, చేర్యాల, పరకాల, చిట్యాల, మహబూబాబాద్, మరిపెడ, నర్సంపేట, గూడూరు, ములుగు, ఏటూరునాగారం వీటిలో ఉన్నాయి. ప్రతీ సమితిలో దాని పరిధిలోని పంచాయతీల అధ్యక్షులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉండేవారు. పంచాయతేతర ప్రాంతం నుంచి ఒకరిని కలెక్టర్ నామినేట్ చేసేవారు. వీరితో పాటు ఒక మహిళ, ఒక ఎస్సీ, ఒక ఎస్టీకి కూడా సమితిలో ప్రాతినిధ్యం ఉండేది.

అశోక్ మెహతా కమిటీ

1977లో ఏర్పాటైన అశోక్‌మెహతా కమిటీ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి విలువైన సూచనలు, సిఫార్సులు చేసింది. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరపాలని సూచించింది ఈ కమిటీనే.. జిల్లా స్థాయిలో ప్రణాళిక వికేంద్రీకరణ జరగాలని సిఫార్సు చేసింది. జిల్లా ప్రణాళికా వికేంద్రీకరణలో జిల్లా కలెక్టర్ ప్రధాన పాత్ర పోషించాలని, ప్రణాళిక వికేంద్రీకరణలో భాగంగా బ్లాక్‌ను ఒక యూనిట్‌గా తీసుకొని ప్రణాళికా రచనలు చేయాలని సిఫార్సు చేసింది. అశోక్ మెహతా సిఫార్సుల ఫలితంగా ఆ తర్వాత కాలంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో పలు మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి.

60 ఏళ్ల తెలంగాణ గోసను తీర్చిన కేసీఆర్

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్


బీఆర్ఎస్ కార్యాలయంలో ఉద్యమం నాటి ఫొటోలను తిలకిస్తున్న వినయ్‌భాస్కర్ తదితరులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల తెలంగాణ ప్రజల గోసను తీర్చిన ఉద్యమ నేత మాజీ సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కొనియాడారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్ష దివస్‌లో భాగంగా ఉద్యమ నాటి ఫొటోల ఎగ్జిబిషన్, కేసీఆర్‌పై రాసిన పుస్తకాల ప్రదర్శనను దాస్యం వినయ్‌భాస్కర్, రిటైర్డ్ ప్రొఫెసర్ శోభ ప్రారంభించారు. అనంతరం తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగం, సకల జనుల పోరాటంతోనే స్వరాష్ట్రం సిద్ధించిందని అన్నారు. మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి ప్రాణత్యాగం మరువలేనిదని అన్నారు. కేసీఆర్ పట్టుదల, లక్ష్యసాధన, పోరాటపటిమ విద్యార్థులకు చదువుల్లో కష్టపడడానికి స్ఫూర్తిని ఇస్తుందని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్‌లో భాగంగా ఈనెల 5న బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌లను బీఆర్ఎస్వీ నేతలతో కలిసి వినయ్‌భాస్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మనోజ్‌కుమార్, బుద్దె వెంకన్న, భైరపాక ప్రశాంత్, పస్తం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సతి గెలుపు కోసం పతి పాదయాత్ర

నర్సంపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు లైన్ తండా గ్రామ పంచాయతీలో వినూత్న సంఘటన చోటు చేసుకుంది. సర్పంచ్ పదవికి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వాంకుడోతు పుష్ప గెలుపు కోసం ఆమె భర్త తావునాయక్ పాదయాత్ర చేపట్టడం విశేషం. తండాలో నివసించే దాదాపు 450 మంది ఓటర్లు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారందరి మద్దతు పొందాలంటే వారి వద్దకే వెళ్లాలనుకున్నాడు తావునాయక్.

అంగ వైకల్యం ఉన్నా..

అంగవైకల్యం ఉన్నా ఆత్మవిశ్వాసంతో తాను అనుకున్న లక్ష్యం కోసం ముందుకు సాగుతున్నాడు తావునాయక్. తన భార్యను ఎలాగైనా గెలిపించాలనే ఉద్దేశంతో పుట్టుకతో ఎడమ కాలు, చెయ్యి రెండు అంగవైకల్యం కలిగినా ఆయన గూడూరు - నర్సంపేట మార్గం గుండా నేరుగా హైదరాబాద్ వరకు పాదయాత్ర ప్రారంభించారు. నేరుగా హైదరాబాద్‌లో ఉండే ఓటర్ల వద్దకు పాదయాత్ర ద్వారా వెళ్లి వేడుకునేందుకు వెళ్లడం విశేషం. కాగా, ఈ పాదయాత్ర బుధవారం నర్సంపేటకు చేరుకుంది. తావునాయక్ పాదయాత్రను చూసి గ్రామస్థులు, నెటిజన్‌ల్లు ప్రశంసిస్తున్నారు.


హైదరాబాద్‌కు నడిచి వెళ్తున్న తావునాయక్

సెల్ స్విచ్ ఆఫ్.. ఆపై జంప్..!

- ఉపసంహరణల కోసం పార్టీ ఒత్తిళ్లతో పలువురు అభ్యర్థుల తీరు
- మధ్యాహ్నం 3 తర్వాత స్విచ్‌ఆన్

కేసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం కోసం ఒత్తిళ్లను తప్పించుకునేందుకు పలువురు అభ్యర్థులు తమ సెల్‌ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకొని, స్థానికంగా లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో ఒకే పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు పోటీలో నిల్చున్నారు. అయితే అందులో ఒకరికే పార్టీ నుంచి మద్దతు లభించగా ఇతర రెబల్ అభ్యర్థులను ఉపసంహరింపజేసేందుకు, కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం చేసేందుకు పార్టీ నాయకులు నామినేషన్లు ముగిసిన రోజు నుంచి ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. పార్టీకి చెందిన స్థానిక, జిల్లా స్థాయి నాయకులు సైతం ఫోన్లు చేస్తుండడం, అభ్యర్థి ఎవరు చెబితే వింటాడో వారి ద్వారా కూడా చెప్పించారు. కొన్ని గ్రామాల్లో పార్టీ నాయకుల మాట విని పలువురు అభ్యర్థులు ఉపసంహరణలు చేసుకున్నారు. ఎలాగైనా పోటీ చేయాలని భీష్మించుకున్న కొందరు అభ్యర్థులు ఈ ఒత్తిళ్లను తట్టుకోలేక తమ సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసుకొని స్థానికంగా లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. బుధవారం మధ్యాహ్నం ఉపసంహరణల సమయం 3 గంటల అనంతరం మొబైల్ స్విచ్ ఆన్ చేసుకొని మళ్లీ గ్రామంలో ప్రత్యక్షం కావడం గమనార్హం.

ఒకే వాడలో రెండు జీపీల ఓటర్లు


ఒకే వాడలో ఉన్న బయ్యారం, అంకుసాపూర్ ఓటర్ల ఇళ్లు

కాటారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకే వాడలో రెండు గ్రామ పంచాయతీల ఓటర్లు ఉన్న విచిత్ర పరిస్థితి భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో నెలకొంది. అంకుసాపూర్‌కు చెందిన 300 మందికి పైగా ప్రజలు బయ్యారం జీపీలో ఓటర్లుగా మారాల్సి వచ్చింది. 1995లో టీడీపీ హయాంలో కొత్త గ్రామ పంచాయతీగా బయ్యారం ఏర్పడింది. అంకుసాపూర్ పక్కనే బయ్యారం ఆవిర్భవించగా సరిపడా జనాభా లేకపోవడంతో కొంతమందిని ఈ జీపీలో కలిపారు. కొందరు నాయకులు అంకుసాపూర్‌లోని కొన్ని వాడలను బయ్యారం జనాభాగా చూపి అంకుసాపూర్‌లో భాగంగా ఉన్న బయ్యారాన్ని ప్రత్యేక జీపీగా చేయించుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం అంకుసాపూర్ 1,046, బయ్యారంలో 850 మంది ఓటర్లు ఉన్నారు. బయ్యారం పంచాయతీ ఏర్పాటుతో అప్పటి నుంచి వారంతా అంకుసాపూర్ గ్రామంలోనే ఉంటున్నా బయ్యారం ఓటర్లుగా కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న బయ్యారం వెళ్లి ఓటు వేసే దుస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆధార్ కార్డులో అంకుసాపూర్ అడ్రస్ ఉండగా, రేషన్ కార్డు మాత్రం బయ్యారం అడ్రస్ ఉందని అంటున్నారు. వాడలకు నీటి సరఫరా, వీధి దీపాలు పెట్టేటప్పుడు సైతం రెండు గ్రామ పంచాయతీల సిబ్బంది మీరంటే మీరని వాదులాడుకునే పరిస్థితి ఉందని సింగిల్ విండో డైరెక్టర్ అయిలి రాజబాపు తెలిపారు. నూతన గ్రామ జీపీల ఏర్పాటు సమయంలో అప్పటి అధికారులకు, కలెక్టర్‌కు సైతం వినతి పత్రాలు ఇచ్చామని, అయినా తమ గోడును పట్టించుకునే వారు లేరని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రేషన్ కార్డులో ఉన్న రెండు గ్రామాల పేర్లు

గులాబీలో గలాట

(5వ పేజీ తరువాయి)

మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్.. తన జిల్లా పరిధిలో ఉన్న మండలాలను తానే సమన్వయం చేసుకుంటానని తేల్చి చెపుతున్నట్లుగా సమాచారం. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని హసన్‌పర్తి, ఐనవోలు మండలాలు హనుమకొండ జిల్లాలో ఉన్నాయి. దీంతో ఎర్రబెల్లి మనస్తాపానికి గురైనట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే గత నెల 26వ తేదీన ఉమ్మడి జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు సందర్శనతో పాటు హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన దీక్ష దివస్ సన్నాహక సమావేశం జరిగింది. అయితే జనగామలో జరిగిన సమావేశంలో పాల్గొని, వరంగల్‌లో జరిగిన కార్యక్రమాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. కొద్దిరోజులుగా వినయ్‌భాస్కర్‌తో ఎర్రబెల్లికి విభేదాలు ఉండటమే కారణమనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ కీలక నేతలు మీడియా సమావేశాలు హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో జరుగుతున్నప్పటికీ ఎర్రబెల్లి దూరంగా ఉంటున్నారు. దీంతో వర్ధన్నపేట కేంద్రంగా దాస్యం వర్సెస్ ఎర్రబెల్లి లొల్లి జరుగుతోంది.

ఇదిలా వుండగా, తన పర్యటనకు ఎర్రబెల్లి దూరంగా ఉండటం వెనుక మతలబేమిటని కేటీఆర్ ఆరా తీసినట్లుగా సమాచారం. విషయం తెలుసుకున్న కేటీఆర్.. మరుసటి రోజు హసన్‌పర్తి మండల సమావేశంలో స్వయంగా ఎర్రబెల్లికి ఫోన్‌చేసి హసన్‌పర్తితో పాటు ఆ మండల పరిధిలోని డివిజన్‌ల బాధ్యతలు దయాకర్‌రావే చూసుకుంటారని కేటీఆర్ కార్యకర్తలకు చెప్పారు. వినయ్‌భాస్కర్‌కు నేను చెబుతా.. అంటూ కేటీఆర్ హామీ ఇచ్చారు. దీంతో ఎర్రబెల్లి తీరుపై వినయ్‌భాస్కర్ వర్గం కోపంగా ఉంది. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వినయ్‌భాస్కర్‌కు ఆహ్వానం లేకుండా ఎలా సమావేశాలు పెడుతారని, బీసీ ఉద్యమం నడుస్తున్న వేళ.. బీసీ అయిన వినయ్‌భాస్కర్ లేకుండా పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

అయితే వినయ్‌భాస్కర్ కూడా నియోజకవర్గాల పునర్విభజనలో హసన్‌పర్తి మండలంతో పాటు కొన్ని డివిజన్లు కూడా తన పరిధిలోకి వస్తాయని, దీంతో ఇప్పటి నుంచే ఆ ప్రాంత కేడర్‌లో టచ్‌లోకి వెళ్లాలని యోచిస్తున్నారనే చర్చ ఉంది. మరోవైపు అందరికీ ఒక్క నియోజకవర్గంలోనే బాధ్యతలు ఉంటే.. ఎర్రబెల్లికి రెండు నియోజకవర్గాల్లో బాధ్యతలు ఏమిటని మాజీ సీఎం కేసీఆర్ వద్ద ఎర్రబెల్లి వ్యతిరేక వర్గం వాదిస్తోంది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి వర్ధన్నపేట బాధ్యతలు ఇవ్వాలని ఆ వర్గం పట్టుబడుతోంది. దీంతో ఇప్పట్లో ఈ వర్ధన్నపేట బాధ్యతల లొల్లి సద్దుమణిగేలా లేదనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2022 జనవరి 26న అన్ని జిల్లాలకు పార్టీ అధ్యక్షులను అధిష్ఠానం నియమించింది. సుమారు నాలుగేళ్లు కావొస్తున్నా.. ఇప్పటివరకు జిల్లా కార్యవర్గాలను బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రకటించలేదు. రెండేళ్ల అధ్యక్ష పదవికి కూడా నాలుగేళ్లు కావస్తున్న కొత్త కమిటీలు లేవు. ఇక జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పాకాల సంపత్‌రెడ్డి 2023 డిసెంబరు 4వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. రెండేళ్లు కావొస్తున్నా.. ఇప్పటివరకు జనగామ జిల్లాకు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిని నియమించలేదు. జనగామ నియోజకవర్గం నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో అధ్యక్షుడు లేకపోవడంతో పార్టీ భారం కూడా పల్లాపై పడుతోంది.

అధ్యక్షులను కూడా నియమించలేరా ?

అలాగే వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ 2024 మార్చి 16న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అప్పటి నుంచి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు లేకుండాపోయారు. వరంగల్ జిల్లా నుంచి అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్దిస్వప్నతో పాటు ఆరడజను మంది రెడీగా ఉన్నారు. అయినా నియామకంపై అధిష్ఠానం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు కీలకమైన జిల్లాలకు పార్టీ అధ్యక్షులను, కార్యవర్గాలను నియమించకపోటంతో కేడర్‌లో అసంతృప్తి రేగుతోంది. పంచాయతీ ఎన్నికల వేళ పార్టీని సమన్వయం చేసేది ఎవరు అనేది గులాబీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలి

కలెక్టర్ స్నేహ శబరీష్


దామెరలో నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

దామెర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. బుధవారం దామెర మండలంలో ఏర్పాటు చేసిన మూడో విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. ఇందులో భాగంగా దామెరతో పాటు ఒగ్లాపూర్ క్లస్టర్ల వద్ద ఎలక్షన్ నోటీస్, రిజర్వేషన్ల జాబితాలను ఆమె పరిశీలించారు. అలాగే ఆర్వోలు, ఏఆర్వోలతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియతో పాటు అధికారులు, సిబ్బంది, పోలీస్ భద్రత వంటి వివరాలను ఎంపీ డీవో కల్పన జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, ఎంపీడీవో గుమ్మడి కల్పన, తహసీల్దార్ ఎం.జ్యోతివరలక్ష్మీదేవి, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆఫీసర్(పీఆర్ ఏఈ) జె.సమ్మిరెడ్డి, ఎంపీవో కె.వి.రంగాచారి, ఆర్వో వై.సత్యనారాయణ, సీఐ పి.రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, జీపీ సెక్రటరీలు ఇంజపెల్లి నరేష్, కవిత, జీపీ సిబ్బంది, అంగన్ వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఒగ్లాపూర్ క్లస్టర్‌లో ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ పరిశీలించారు. ఇందులో డివిజనల్ పంచాయతీ అధికారి రవిబాబు, ఎంపీవో కె.వి.రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి


వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. బుధవారం సుమారు 10వేల మందికి పైగా వనదేవతలను దర్శించుకున్నారు. మహాజాతర జనవరి చివరి వారంలో మహాజాతర జరగనుండగా ముందస్తుగా వచ్చి మొక్కులు చెల్లించు కుంటున్నారు. కాగా, మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మేడారం వనదేవతల దేవస్థానం వద్ద అభివృద్ధి పనులు సాగుతున్నాయి. పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల స్థల మార్పు కోసం దేవస్థానంలో వరుస క్రమంలో నూతనంగా ఏర్పాటు చేశారు. సమ్మక్క-సారలమ్మల గద్దెలను దర్శించుకొని అదే క్రమంలో పగిడిద్ద రాజు, గోవిందరాజును భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లను చేశారు. ఈ నూతన గద్దెలపై దేవతలను గురువారం పునః ప్రతిష్ఠించనున్నారు.


పునఃనిర్మాణం అవుతున్న గోవిందరాజు గద్దె

బాలికపై లైంగిక దాడికి యత్నం

- యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు - మిల్స్ కాలనీలో ఘటన

కరీమాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మిల్స్‌కాలనీ పరిధిలో ఓ యువకుడు 8 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉర్సు హరిజనవాడకు చెందిన వేల్పుగొండ (కరాటే) కుమారస్వామి కిరాణం వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు ఉండగా చిన్న కుమారుడైన కమల్ అలియాస్ అబ్బు అనే యువకుడు మంగళవారం నాడు షాపులో ఉన్నాడు. అదే సమయంలో సరుకుల కోసం వచ్చిన బాలికకు చాక్లెట్ ఆశ చూపించి లోనికి తీసుకెళ్లాడు. అసభ్యంగా ప్రవర్తిస్తుండగా షాపులోకి ఇతరులు రావడంతో వదిలేశాడు. దీంతో బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లింది. తల్లిదండ్రులు కంగారు పడి ఏం జరిగిందని ఆరా తీశారు. షాపులో ఒంటరిగా ఉన్న కమల్ తనను బెడ్‌రూంలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడని, తన దుస్తులు విప్పుతుండగా షాపులోకి ఇతరులు రావడంతో వదిలేశాడని, దీంతో పరుగెత్తుకుంటూ ఇంటికి వచ్చానని తెలిపింది. ఈ ఘటనపై వారు వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

సోమశేఖర్‌కు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన తాటికొండ సోమశేఖర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మక డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. ఫీచర్ సెలక్షన్ యూసింగ్ మెటా హ్యూరిస్టిక్ టెక్నిక్ ఫర్ స్కీవేడ్ డాటా క్లాసిఫికేషన్ ప్రాబ్లమ్ అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగ హెడ్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. డాక్టరేట్ పొందిన తాటికొండ సోమశేఖర్‌ను పలువురు అభినందించారు.

'బీవీపీ ట్రస్ట్ సేవలు హర్షణీయం'

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సేవే పరమార్థంగా ముందుగు సాగుతున్న బీవీపీ చారిటబుల్ ట్రస్ట్ సేవలు హర్షణీయమని కాజీపేట ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో బీవీపీ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో బీవీపీ ప్రతినిధులు శివరామకృష్ణ, సుబ్బారావు, ఇన్‌చార్జి హెచ్ఎం వీరభద్రం, చంచల్ అగర్వాల్, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వివేకానంద ప్రసాద్, రామారావు, దామోదర్, రాములు, నివేదిత తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, నిర్వాహకులు

దివ్యాంగులకు ఆస్తి హక్కూ ఉంటుంది..

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, జడ్జి రామలింగం

బాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులకు అన్ని హక్కులతో పాటు ఆస్తి హక్కు కూడా ఉంటుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి రామలింగం అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండలోని అతిథి మనోవికాస కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మానసిక దివ్యాంగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వారికి కోర్టు పక్షాన ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. అలాగే మానసిక నిపుణులు ఆశ్రమాలను సందర్శించి సేవలందించేలా అధికారులకు డీఎల్ఎస్ఏ పక్షాన లెటర్ పెడతామని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న కె.అనితారెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగులకు కావల్సింది చేయూత అని సానుభూతి కాదన్నారు. జిల్లాలోని దివ్యాంగ సంస్థలన్నీ ఒకే వేదిక మీదికి వచ్చి సమస్యలను వివరించినపుడు ఫలితాలు బాగుంటాయని అన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు సుజాత, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.



అతిథి మనోవికాస కేంద్రంలో దివ్యాంగులతో జడ్జి రామలింగం

దివ్యాంగులు ప్రతిభను చాటాలి

వరంగల్ ఎడ్యుకేషన్: దివ్యాంగులు సమాజంలో వారికున్న ప్రతిభను, సామర్థ్యాలను ప్రదర్శించాలని ఆర్ట్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రెహమాన్ అన్నారు. బుధవారం హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో దివ్యాంగుల సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల అంతర్జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ.. విద్య, అభివృద్ధిరంగాల్లో దివ్యాంగుల హక్కులను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అంజన్‌రావు, శేషు, వీరస్వామి, కల్యాణి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్ట్స్ కళాశాలలో మాట్లాడుతున్న రెహమాన్

దివ్యాంగులకు సన్మానం

రాంనగర్: దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ (మెపా) ఆధ్వర్యంలో బుధవారం కిషన్‌పురలోని వెలాసిటీ జూనియర్ కళాశాలలో దివ్యాంగులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పుల రాజేశ్, ఉపాధ్యక్షుడు విజేందర్, ఉమ్మడి వరంగల్ దివ్యాంగుల ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు బిల్లా మహేందర్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మన్నె చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూలో దివ్యాంగుల దినోత్సవం

కేయూ క్యాంపస్: కేయూ దివ్యాంగుల సెల్ నేతృత్వంలో డిసెంబరు 4న (గురువారం) ఉదయం 10.30గంటలకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. దీనికి కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య, యూజీసీ సమన్వయకుడు మల్లికార్జున్‌రెడ్డి, పాలక మండలి సభ్యురాడాక్టర్ కె.అనితారెడ్డిలు హాజరు కానున్నట్లు డైరెక్టర్ రాజు తెలిపారు.


కిషన్‌పురలో దివ్యాంగులను సత్కరిస్తున్న మెపా నాయకులు


బాలింతలకు జాగ్రత్తలు చెబుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

డీఎంహెచ్‌వో అప్పయ్య ▸▸ పలు ఆరోగ్య కేంద్రాల సందర్శన

వరంగల్ మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకుంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. బుధవారం లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్యటించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతీ సెంటర్‌లో వ్యాక్సినేషన్ కోసం ఉన్న డ్యూ లిస్టులు, అందులో ఎంతమందికి వ్యాక్సిన్ వేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులుగా పేరు నమోదైయినప్పటి నుంచి వారికి అన్ని జాగ్రత్తలు వివరించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం జరిగేలా గర్భిణులకు నమ్మకం కలిగేలా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం గోపాల్‌పూర్‌లోని ప్రయివేట్ మహి మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌ను వైద్యాధికారి హైదర్‌తో కలిసి తనిఖీ చేశారు. మెడికల్ షాపులలో ఎంటీపీ కిట్లను పరిశీలించి, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మొద్దని, వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని డీఎంహెచ్‌వో అప్పయ్య సూచించారు.

హైదరాబాద్‌కు తరలిన జర్నలిస్టు నాయకులు


హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ధర్నాకు వెళ్తున్న జర్నలిస్టు నాయకులు

బాలసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల సాధనకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాకు బుధవారం హనుమకొండ జిల్లా నుంచి భారీగా జర్నలిస్టులు తరలివెళ్లారు. ఉదయం 7గంటలకు హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ నుంచి బయలుదేరి హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల కార్యాలయం చేరుకున్నారు. హైదరాబాద్ తరలిన వారిలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వేణుమాధవ్, కంకణాల సంతోష్, జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లరపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, యూనియన్ రాష్ట్ర నాయకులు బుచ్చిరెడ్డి, యాదగిరి, పొడిశెట్టి విష్ణువర్ధన్, సోమ నర్సయ్య, రాజేంద్రప్రసాద్, సాయిరాం, సుధాకర్, దుర్గాప్రసాద్, నయీంపాషా, శ్రీహరి రాజు, విజయ్‌రాజ్, యుగంధర్ తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన



కేయూ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కాలుష్యానికి వ్యతిరేకంగా ఉద్యమించిన ఆందోళనకారులపై అక్రమకేసులు పెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం కేయూ మొదటి గేటు వద్ద పీడీఎస్‌యూ నేతృత్వంలో నిరసన ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్‌జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ మాట్లాడారు. స్వచ్ఛమైన గాలిని కోరితే దేశద్రోహం కేసులు పెడుతారా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో ఆందోళనకారులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకుని జైలు నుంచి వదిలివేయాలని డిమాండ్ చేశారు. పౌరహక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంగేటి మోహన్, రాజేశ్, రాంబాబు, హరిప్రసాద్, జయచందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి వర్ధంతి


శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హసన్‌పర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ముచ్చెర్లలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేష్, హరిప్రసాద్, కుమార్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, జయపాల్, సారయ్య, శివ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు సన్మానం

హసన్‌పర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఎన్నికల వ్యూహంపై సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ఈ ఎన్నికల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ సందర్భంగా ఈటలను స్థానిక బీజేపీ నాయకులు మారపల్లి రాంచంద్రారెడ్డి, తాళ్ళపల్లి కుమారస్వామిగౌడ్, పిట్టల కుమారస్వామి, కార్పొరేటర్ శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు మారపల్లి తిరుపతిలు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.


ఎంపీ రాజేందర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ శివకుమార్ తదితరులు

ఆర్ఎస్ఎస్ ఫాసిజాన్ని ప్రతిఘటించాలి

సైంటిఫిక్ స్టడీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చారువాక


ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వడ్డెపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ సృష్టించిన మనువాద ఫాసిజాన్ని సమాజంలోని ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని సైంటిఫిక్ స్టడీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చారువాక, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలను మత విద్వేషాలతో కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను తాకట్టు పెట్టిందని విమర్శించారు. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో జరిగే అఖిల భారత ఫాసిస్టు వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు గురిమిళ్ల రాజు, మర్రి మహేశ్, మండల కుమారస్వామి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీని చాటిన విద్యార్థులు

రాంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన నగదును విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు అందజేసి పాఠశాల విద్యార్థులు నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. డబ్బాల సమీపంలోని ఏకశిల పాఠశాలకు చెందిన పూజిత, లిథిక్ అనే ఇద్దరు విద్యార్థులు బుధవారం పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యంలో రూ.400 దొరికాయి. డబ్బులను తాము తీసుకోకుండా సమీపంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గంగాధర్‌కు అందజేసి నిజాయితీని చాటుకున్నారు. చిన్నారుల నిజాయితీని మెచ్చి పలువురు అభినందించారు.


దొరికిన డబ్బులను కానిస్టేబుల్‌కు ఇస్తున్న విద్యార్థులు

'అవయవదానం చేయాలి'

హసన్‌పర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అయవయదానం చేసి ఆదర్శంగా నిలవాలని తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ముచ్చెర్లలో నవంబరు 23న అనారోగ్యంతో మృతిచెందిన గురిజాల కాంతమ్మ సంతాప సభ బుధవారం జరిగింది. ఈసందర్భంగా కుమారుడు దేవేందర్‌రెడ్డి, కుమార్తె రాజమణి వారి కుటుంబ సభ్యుల సహకారంతో తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో అదే రోజు నేత్రదానం చేయగా వారి కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌తో పాటు శాలువాతో సత్కరించి అభినందించారు. నేత్రదాతలు సామాజిక బాధ్యతతో 87905 38706, 94901 33650 నెంబర్‌లకు ఫోన్ చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, ఇంజనీర్ రవిందర్, సుజాత, రిటైర్డ్ ప్రొఫెసర్ సాంబయ్య, రాజేంద్రప్రసాద్, నవీన్, సత్యనారాయణ, నరసింహారాములు, అశోక్‌బాబు, సాయిరెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నెట్ వర్కింగ్ వ్యవస్థ ఆధునీకరణ


బీఎస్ఎన్ఎల్ అధికారులతో వీసీ ప్రతాప్‌రెడ్డి, రామచంద్రం

కేయూ క్యాంపస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్‌లో నెట్ వర్కింగ్ వ్యవస్థను ఆధునీకరించి, మరింత సమర్థవంతంగా మార్చేందుకు బీఎస్ఎన్ఎల్‌తో అవగాహన చర్యలు చేపట్టినట్లు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు తెలిపారు. ఈ మేరకు బుధవారం బీఎస్ఎల్ఎల్ అధికారులతో చర్చలు జరిపిన అనంతరం వర్క్‌ఆర్డర్‌ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎల్ఎల్ అధికారులు అరవింద్‌కుమార్, కిషన్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు సెమినార్ పత్రాల పుస్తకావిష్కరణ

పింగళి డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం నేతృత్వంలో ఇటీవల నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు సెమినార్ పత్రాల పుస్తకాన్ని బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పింగళి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, వర్సిటీ అధికారులు, పింగళి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఈటీ నరేశ్‌కు పురస్కారం

రాంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీఈటీ ఏకు నరేశ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం రాంనగర్‌లో నిర్వహించిన ఆత్మీయ సభలో పరకాలకు చెందిన నరేశ్ ఉత్తమ పీఈటీ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సునిల్, సుందర్‌రాజ్ యాదవ్, రామప్ప కళాశాల డైరెక్టర్ కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.


పీఈటీ ఏకు నరేశ్‌ను సన్మానిస్తున్న టీపీటీఎఫ్ బాధ్యులు

ముగిసిన రెండో విడత స్క్రూటినీ

హసన్‌పర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 పంచాయతీ గ్రామాల్లో రెండో విడత నిర్వహించే పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్క్రూటినీ బుధవారం జరిగినట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీవో సుమనవాణి తెలిపారు. 15 జీపీ గ్రామాల్లో 138 వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించగా, వారిలో 18 మంది సింగిల్ నామినేషన్లు సమర్పించారు. ఈ నామినేషన్లలో ఇద్దరు డబుల్ సెట్లు, ఇద్దరు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో తిరస్కరించినట్లు తెలిపారు. వీరిలో జయగిరి 4వ వార్డులో ఒకరు, నాగారం 10వ వార్డులో ఒకరు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో రిజెక్టు చేసినట్లు తెలిపారు. అలాగే నాగారం 6వ వార్డులో ఒకరు, 8వ వార్డులో మరొకరు డబుల్ సెట్లు వేయగా స్క్రూటినీలో తొలగించినట్లు తెలిపారు. మొత్తం 357 వార్డు సభ్యులు నామినేషన్ వేయగా, వారిలో మిగిలిన 14మంది వార్డు సభ్యులు సింగిల్ నామినేషన్లు వేసినట్లు తెలిపారు. మిగిలిన 353 వార్డు సభ్యులు బరిలో ఉన్నట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు. అలాగే 15 పంచాయతీ గ్రామాల్లో 15 సర్పంచ్ అభ్యర్థులకు 95 మంది సభ్యులు నామినేషన్ వేయగా వీరిలో 17 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలు స్క్రూటినీలో తొలగించినట్లు తెలిపారు. బుధవారం నామినేషన్ల స్క్రూటినీ పర్వం ముగిసే వరకు 78 మంది సర్పంచ్, 353 మంది వార్డు అభ్యర్థులు బరిలో నిలిచినట్లు తెలిపారు.

హోంగార్డులకు క్రీడా పోటీలు


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న హోంగార్డులు

వరంగల్ క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైజింగ్‌డేను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని మూడు జోన్ల పరిధిలోని ఉన్న హోంగార్డులకు బుధవారం క్రీడాపోటీలు నిర్వహించారు. పురుషులకు వాలీబాల్, మహిళా హోంగార్డులకు లెమన్ స్పూన్ పోటీలను నిర్వహించారు. ఈ నెల 6న నిర్వహించే రైజింగ్ డేన క్రీడాపోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ డీసీపీలు శ్రీనువాస్, సురేశ్‌కుమార్, ఏసీపీలు నాగయ్య, అంతయ్య, ఆర్ఐలు చంద్రశేఖర్, శివ కేశవులు, శ్రీనువాస్, ఆర్ఎస్సై మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

హిందువులకు సీఎం క్షమాపణ చెప్పాలి

రాంనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి డిమాండ్ చేశారు. హిందూ దేవుళ్ల పట్ల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం కేయూ జంక్షన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందువుల ఓట్లతో గెలిచి వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా సీఎం మాట్లాడటం సమంజసం కాదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో హిందువులు కర్ర కాల్చి వాత పెడుతారన్నారు. ఈ కార్యక్రమంలో 52 డివిజన్ కార్పొరేటర్ చాడ స్వాతిరెడ్డి, నాయకులు జయంత్‌లాల్, సంద్ర మధు, భరత్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్



సీఐటీయూ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమేష్ తదితరులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకు మెదక్ పట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో మహాసభల వాల్‌పోస్టర్‌ను రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గానికి అన్యాయం చేస్తోందని, దీన్ని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక హక్కులను తుంగలో తొక్కుతున్న బీజేపీ విధానాలపై సమరశీల పోరాటాలకు కార్మికులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ మహాసభలకు సీఐటీయూ ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, సీపీఐ (ఎం)పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీఐటీయూ అఖిల భారత అధ్యక్ష, కార్యదర్శులు కె.హేమలత, తపన్‌సేన్, జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, ఆఫీస్ బేరర్స్ మెట్టు రవి, బొల్లారపు సంపత్, ధరావత్ భానునాయక్, జిల్లా నాయకులు మల్లేశం, బొట్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌లో జపనీస్, జర్మన్ భాషల బోధన

» 43 కాలేజీల్లో మొదలైన తరగతులు

» 1700 మంది నర్సింగ్ విద్యార్థుల ఆసక్తి

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం నర్సింగ్ ఆఫీసర్ల కొరత తీవ్రంగా ఉన్న జపాన్, జర్మనీ దేశాల భాషల బోధనను ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 37 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలు, 6 నర్సింగ్ స్కూల్స్ సహా మొత్తం 43 విద్యా సంస్థల్లో బుధవారం నాడు వర్చువల్ పద్ధతిలో ఈ తరగతులు లాంఛనంగా మొదలయ్యాయి. ప్రభుత్వ నర్సింగ్ సంస్థల్లో విదేశీ భాషలను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి అని వైద్య వర్గాలు తెలిపాయి. ఈ భాషల బోధన కోసం వైద్య ఆరోగ్య శాఖ, ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఎఫ్లూ)తో ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం 1,863 మంది నర్సింగ్ విద్యార్థులకు ఈ శిక్షణ అందించాల్సి ఉండగా, ఇప్పటికే 1,700 మంది విద్యార్థులు జపనీస్, జర్మన్ భాషలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపినట్లు వైద్యవర్గాలు వెల్లడించాయి. ఈ కోర్సు వ్యవధి 16 నెలలు కాగా, ప్రతి సెమిస్టర్ 4 నెలల పాటు ఉంటుంది. ప్రస్తుతం జపాన్‌లో భారతీయ నర్సులకు సగటున నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.75 లక్షల వేతనం లభిస్తోంది. అదే జర్మనీలో అయితే ఏకంగా నెలకు రూ.2-3 లక్షల వరకు ఉంటుంది.

బాలికకు సీరియల్స్, సినిమాల్లో అవకాశాల ఎర.. ఆపై లైంగిక దాడి

కో డైరెక్టర్, కెమెరామన్‌లకు సహకరించిన బాలిక పెద్దమ్మ అరెస్టు

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీవీ సీరియల్స్, సినిమాల్లో అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికి బాలికను లొంగదీసుకున్న సినీ కో డైరెక్టర్, కెమెరామన్‌లు ఆమెపై లైంగిక దాడి చేశారు. ఇందుకు ఆ బాలిక పెద్దమ్మ వారికి సహకరించింది. ఆ ముగ్గురినీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే బాలిక(13) ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కొద్ది రోజులు హాస్టల్‌లో ఉన్న ఆ బాలిక నాలుగు నెలల క్రితం పెద్దమ్మ వద్దకు వచ్చింది. అక్కడే ఉంటూ పాఠశాలకు వెళుతోంది. బాలిక పెద్దమ్మకు సినీ పరిశ్రమలో కో డైరెక్టర్‌గా పనిచేసే కడపకు చెందిన బండి వెంకట శివారెడ్డి, కెమెరామన్ పెనికెలపాటి అనిల్‌తో పరిచయం ఉంది. తరచూ వారు ఆమె ఇంటికి వస్తుంటారు. వారి కన్ను బాలికపై పడింది. ఇదే విషయాన్ని బాలిక పెద్దమ్మకు చెప్పారు. ఆమె బాలిక వద్దకు వెళ్లి శివారెడ్డి, అనిల్ సినీ పరిశ్రమలో చాలా పేరున్న వారని, వారితో చనువుగా ఉంటే సినిమాలు, సీరియల్స్‌లో అవకాశాలు కల్పిస్తారని చెప్పింది. నమ్మిన బాలిక వారితో మాట్లాడటం మొదలు పెట్టింది. నవంబరు 30న ఆ ఇద్దరూ బాలికను మాటల్లో పెట్టి పలుమార్లు లైంగిక దాడి చేశారు. వారి చెర నుంచి తప్పించుకున్న బాలిక జరిగిన విషయాన్ని పాఠశాలలో ఉపాధ్యాయురాలికి చెప్పగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ దేవాలయానికి భక్తుల రద్దీ పెరిగింది. బుధవారం సుమారు 10వేల మందికి పైగా భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. జనవరి చివరి వారంలో మహాజాతర జరగనుండగా.. ముందస్తుగానే వచ్చి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.ఆలయ విస్తరణకు ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో భాగంగా.. సమ్మక్క-సారలమ్మల గద్దెలను దర్శించుకొని అదే క్రమంలో పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను భక్తులు దర్శించుకునేలా అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ నూతన గద్దెలపై దేవతలను గురువారం పునః ప్రతిష్ఠించనున్నారు.

నాటుబాంబును కొరికి మృతిచెందిన శునకం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో నాటు బాంబు కలకలం రేపింది. చెత్త కుప్పలో ఉన్న నాటు బాంబును వీధి కుక్క కొరకడంతో అది పేలిపోయింది. ఘటనలో శునకం మృతి చెందింది. పేలుడు శబ్దంతో రైల్వేస్టేషన్ ప్రాంగణంలో విధుల్లో ఉన్న సిబ్బంది, ప్రయాణికులు ఆందోళన చెందారు. రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్, కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేశారు. రైల్వేట్రాక్, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి 5నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్ ప్రాంగణంలో చెత్త కుప్పలో పడేసిన సంచిలో ఉల్లిగడ్డ ఆకారంలో ఉన్న బాంబును కొరకడంతో కుక్క మృతి చెందినట్టు తేల్చారు.

తెలంగాణవాసికి అమెరికా ప్రతిష్ఠాత్మక అవార్డు


అభినవ్ కందాళ

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో స్థిరపడ్డ తెలంగాణవాసి అభినవ్ కందాళకు ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. భౌతిక శాస్త్రం, సమాచార రంగాల్లో విశేష కృషిచేసిన వారికి అందించే అమెరికన్ ఫిజికల్ సొసైటీ అవార్డుకు ఈ ఏడాదికి అభినవ్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని ప్రముఖ ఐటీ సంస్థ ఐబీఎంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో గత దశాబ్దా కాలంలో చేసిన విశేష కృషికిగాను.. ఈ పురస్కారానికి ఎంపిక చేశామని అమెరికన్ ఫిజికల్ సొసైటీ తెలిపింది. హైదరాబాద్‌కు చెందిన అభినవ్ ఐఐటీ బాంబేలో బీటెక్, అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నిందితుడి ఆచూకీ చెబితే 50వేల డాలర్లు

» అమెరికాలో ఆంధ్రా మహిళ హత్యకేసులో ఎఫ్‌బీఐ ప్రకటన

న్యూయార్క్, డిసెంబరు 3: ఎనిమిదేళ్ల క్రితం అమెరికాలోని న్యూజెర్సీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శశికళ నర్రా (38), ఆమె కుమారుడు అనీష్ నర్రా (6) హత్య కేసులో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో నిందితుడైన భారత్‌కు చెందిన నజీర్ హమీద్ ఆచూకీ తెలిపిన వారికి 50 వేల డాలర్ల రివార్డు అందిస్తామని ప్రకటించింది. న్యూజెర్సీ పోలీసులు ఈ కేసులో నజీర్ హమీద్‌ను నిందితుడిగా తేల్చారు. ఆంధ్రాకు చెందిన హనుమంతరావు నర్రా, శశికళ నర్రా దంపతులు కుమారుడు అనీష్‌తో కలిసి అమెరికాలోని న్యూజెర్సీలో నివసించేవారు. 2017 మార్చిలో హనుమంతరావు విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి వారి అపార్ట్‌మెంట్‌లో శశికళ, అనీష్ రక్తపు మడుగులో పడిఉన్నారు. విచారణలో భాగంగా హనుమంతరావు సహోద్యోగి నజీర్ హమీద్ ప్రమేయం ఉందేమో అన్న కోణంలో దర్యాప్తు చేస్తుండగా.. హమీద్ అమెరికా నుంచి భారత్‌కు పారిపోయాడు. డీఎన్ఏ పరీక్షల ఆధారంగా నజీరే నిందితుడని ఇటీవల నిర్ధారించారు. హమీద్ అరెస్టుకు వారెంట్ జారీచేసి అతన్ని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రస్తుతం హమీద్ భారత్‌లో ఉన్నాడు. దీంతో అయనను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మేరకు న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ గతవారం అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రాకు లేఖ కోరారు.

విద్యాశాఖ నిర్వహణలో సీఎం రేవంత్ ఫెయిల్

» విద్యార్థులకు మంచి భోజనం పెట్టండి:హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖను కూడా తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆ శాఖను సమర్థవంతంగా నిర్వహించడంలో పూర్తిగా ఫెయిల్ అయ్యారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం.. కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందన్నారు. మింగడానికి మెతుకులేదు కానీ మీసాలకు సంపెంగ నూనె అన్నట్లుగా రేవంత్‌రెడ్డి తీరు ఉందని, చేయాల్సిన పనులకు డబ్బుల్లేవంటూనే ఆర్భాటాలు మానడం లేదని బుధవారం ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెయ్యి కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన సీఎం, కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఆయన తన ప్రగల్భాలు మాని.. విద్యార్థులకు కడుపు నిండా మంచి భోజనం పెట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

లక్ష కోట్ల పెట్టుబడులు

రాష్ట్రంలో లక్ష కోట్లకుపైగా పెట్టుబడులకు 14 కంపెనీలు సిద్ధం.. 70 వేల కోట్లతో టీసీఎస్-టీపీజీ డేటా కేంద్రాలు

» రూ.70 వేల కోట్లతో టీసీఎస్-టీపీజీ డేటా కేంద్రాలు

» హ్యుందాయ్ కార్ల ఫ్యాక్టరీ, 25 బయోగ్యాస్ ప్లాంట్లు

» ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులకు పరిశ్రమల ఆసక్తి

» తెలంగాణ రైజింగ్ సదస్సులో ప్రకటించనున్న సీఎం రేవంత్


గ్లోబల్ సమ్మిట్ పనులను పరిశీలిస్తున్న వేము నరేందర్‌రెడ్డి, శశాంక, సుధీర్‌బాబు

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ పెట్టుబడులు సలక్షణంగా రైజింగ్ అవుతున్నాయి. తెలంగాణ రైజింగ్ సదస్సు వేదికగా ఏకంగా రూ.లక్ష కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టేందుకు 14 కంపెనీలు ముందుకొచ్చాయి. మరో 30కిపైగా ప్రాజెక్టుల ఏర్పాటుకు కూడా రంగం సిద్ధమవుతోంది. గుజరాత్ జామ్‌నగర్‌లో రిలయన్స్ గ్రూప్ అభివృద్ధి చేసిన వంతారా జూ మన ఫ్యూచర్ సిటీలోనూ ఏర్పాటుకానుంది.. ఐటీ దిగ్గజ సంస్థ టీసీఎస్ మరో సంస్థ టీపీజీతో కలిసి రూ.70వేల కోట్ల (8 బిలియన్ డాలర్ల)తో అత్యాధునిక హైపర్‌వాల్ట్ డేటా సెంటర్లను స్థాపించనుంది. ఇవేకాదు.. పరిశ్రమలతోపాటు పర్యాటకం, క్రీడలు, వినోద రంగాల్లోనూ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రానున్నాయి. చాలా కంపెనీలు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం అందులో బుధవారం నాటికి రూ.లక్ష కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సదస్సు ప్రారంభానికి మరో 4-5 రోజుల సమయం ఉండటంతో.. కంపెనీల సంఖ్య, పెట్టుబడుల మొత్తం మరింత భారీగా పెరగనుంది. ఈనెల 8, 9 తేదీల్లో ఫ్యూచర్‌సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంవోయు) కుదుర్చుకోనున్నాయి.

విదేశీ కంపెనీలకు ప్రత్యేక పారిశ్రామిక వాడలు..

ఫ్యూచర్ సిటీలో పరిశ్రమల ఏర్పాటుకు విదేశీ కంపెనీలు కూడా ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నాయి. ఇందులో తైవాన్, సింగపూర్, వియత్నాం కంపెనీల కోసం ప్రత్యేక పారిశ్రామిక వాడలు (ఇండస్ట్రియల్ పార్కులు) ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇక రాష్ట్రాన్ని అంతర్జాతీయ సినిమాలకు కేంద్రంగా మార్చాలన్న సీఎం రేవంత్ ఆలోచన సాకారం కానుంది. ఫ్యూచర్‌సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్‌సిటీ ఏర్పాటుకు బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గన్ ముందుకొచ్చారు. పెట్టుబడుల మొత్తం ఎంతనేది ప్రకటించాల్సి ఉంది. సీతారాంపూర్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటు చేయనున్న హిందూస్థాన్ యూనిలీవర్ సంస్థ కూడా పెట్టుబడుల మొత్తాన్ని వెల్లడించనుంది.

ఏఐ యునివర్సిటీ, విదేశీ క్యాంపస్..

ఏఐ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో 100 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఇందులో ఏఐ యునివర్సిటీ ఏర్పాటుకు అనుమతించింది. ప్రజ్ఞా ఏఐ సంస్థ ప్రజ్ఞా ఏఐ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుంది. అలాగే లండన్ యూనివర్సిటీ తన ఆఫ్‌షోర్ క్యాంపస్‌ను నగరంలో ఏర్పాటు చేయనుంది. ఇవేగాక మరెన్నో ఐటీ, పర్యాటకం, క్రీడలు, సినిమా, ఉన్నత విద్యారంగంలో పెట్టుబడులకు సంబంధించిన అనేక ఒప్పందాలు తెలంగాణ రైజింగ్ సదస్సులో కుదరనున్నాయి.

బుధవారం నాటికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పెట్టుబడులివీ..

కంపెనీ	ప్రాజెక్ట్	పెట్టుబడి (రూ.కోట్లలో)
ఫుడ్‌లింక్ ఎఫ్ఎండ్‌బీ హోల్డింగ్స్	కన్వెన్షన్, 3 హోటల్స్	3,000
క్రిసల్ లాగూన్స్, గ్రీన్ పాంథర్స్ ప్రాపర్టీస్	ఎంటర్‌టైన్‌మెంట్ హబ్	850
టీసీఎస్-టీపీజీ	హైపర్‌వాల్ట్ డేటా కేంద్రాలు	70,000
ఎకిలాన్ నెక్సస్, నార్త్‌స్టార్ ఆపర్చునిటీస్	డేటా కేంద్రాలు	850
హ్యుందాయ్	టెస్ట్ ట్రాక్, తయారీ ప్లాంట్,	8,000
మహీంద్రా	జహీరాబాద్ ప్లాంట్ విస్తరణ	400
విస్ట్రాన్	మ్యాన్యుఫ్యాక్చరింగ్	1,000
క్రాంప్టన్ గ్రీవ్స్	తయారీ ప్లాంట్, ఫ్యాబ్ సిటీ	300
ఎంఎస్ఎన్	ఆర్ అండ్ డీ హబ్	1,500
బయోలాజికల్-ఈ	ఆర్ అండ్ డీ హబ్	200
లిక్సిల్‌గ్రూప్ (జపాన్)	హౌజింగ్ ఎక్విప్‌మెంట్ తయారీ	150
ఆల్ట్‌మిన్	లిథియం రిఫైనరీ	2,200
అతిరథ్ హోల్డింగ్స్	బయోగ్యాస్ ప్రాజెక్టు	4,000
సనోఫీ	జీసీసీ విస్తరణ	3,500

భారీగా పెట్టుబడులు పెట్టనున్న కంపెనీలు..

- వంతారా (రిలయన్స్ గ్రూప్)- వైల్డ్ లైఫ్ కన్సర్వేటరీ, నైట్ సఫారీ
- అజయ్ దేవ్‌గన్ ఫిల్మ్ స్టూడియో- సినిమా రంగం
- ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా)
- టోనీబ్లెయిర్ ఇనిస్టిట్యూట్
- ఏషియన్ అంబాసిడర్స్ - బుద్ధిస్ట్ టూరిస్ట్ సర్క్యూట్
- ఫ్లూయిడ్రా (స్పెయిన్) - కృత్రిమ సముద్ర తీరం, కొత్వాల్‌గూడ
- మైక్రోసాఫ్ట్ - చందనవల్లి డేటా సెంటర్ విస్తరణ
- బ్రిలియంట్ బయో - యానిమల్ ఆర్ అండ్ డీ ల్యాబ్
- యూనిలీవర్ - తయారీ కేంద్రం, సీతారాంపూర్
- లూలూ గ్రూప్ (యూఏఈ) - లూలూ హైపర్‌మాల్
- టీసీసీఐ (తైవాన్) - మినీ పారిశ్రామిక పార్కు, కొంగరకలాన్
- సెంబ్‌కార్ప్ (సింగపూర్) - పారిశ్రామిక పార్కు
- విన్ గ్రూప్ (వియత్నాం) - సమీకృత పారిశ్రామిక పార్కు
- ట్రంప్ మీడియా టెక్ గ్రూప్
- దుబాయ్ జీఎంఆర్ స్పోర్ట్స్ - శాటిలైట్ స్పోర్ట్స్ సిటీ
- సూపర్‌క్రాస్ ఇండియా - సూపర్‌క్రాస్, మోటోక్రాస్ ఫెసిలిటీ
- ఫిఫా-ఏఐఎఫ్ఎఫ్ - విమెన్ ఫుట్‌బాల్ అకాడమీ
- ఫిఫా-ఏఐఎఫ్ఎఫ్ - మెన్ ఫుట్‌బాల్ అకాడమీ
- హార్ట్‌ఫోర్డ్ ఇన్సూరెన్స్ - జీసీసీ
- జ్యూరిక్ ఇన్సూరెన్స్ - జీసీసీ
- నెట్‌ఫ్లిక్స్ - జీసీసీ
- లోరియల్ - జీసీసీ
- ఓఎస్ఎఫ్ డిజిటల్ - జీసీసీ
- షుక్ ఏఐ - ఏఐ టెక్ సెంటర్
- టీటీఎల్ - పాలిటెక్నిక్‌ల ఉన్నతీకరణ ఎంవోయూ
- టీటీఎల్ - రెండో విడత అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఎంవోయూ
- టామ్‌కామ్ - సినర్జీ గ్రూప్ (రష్యా)
- టామ్‌కామ్ - నెక్స్‌వేవ్ (జర్మనీ)
- టామ్‌కామ్ - ప్లేస్‌మెంట్స్ ఇన్ తైవాన్
- టామ్‌కామ్ - అపోలో మెడ్ స్కిల్స్
- యూనివర్సిటీ ఆఫ్ లండన్ - ఆఫ్‌షోర్ క్యాంపస్, హైదరాబాద్
- ప్రజ్ఞా ఏఐ - ఏఐ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ
- తారామండల్ - ఆర్బిటల్ వెహికిల్ సిస్టం
- టూరిజం స్కూల్

పెద్ద సంఖ్యలో తరలిరానున్న విదేశీ ప్రముఖులు

తెలంగాణ రైజింగ్ సదస్సుకు దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు హాజరుకానున్నారు. సదస్సులో పాల్గొనాలని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 4,800 మందికి ఆహ్వానాలు పంపింది. అందులో అనేకమంది వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, రిలయన్స్ గ్రూప్ డైరెక్టర్ అనంత్ అంబానీ, మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, ట్రంప్ మీడియా టెక్నాలజీ గ్రూప్ సీఈవో ఎరిక్ స్వీడర్, యూఏఈ రాచ కుటుంబానికి చెందిన రస్-అల్-ఖైమా ప్రతినిధి తారిఖ్ అల్ ఖాసిమి, సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ మసా గ్రూప్ ప్రతినిధి మహమ్మద్ అబ్దుల్ నయామ్, టీవీఎస్ గ్రూప్ చైర్మన్ ఆర్.దినేశ్, ప్రెస్టీజ్ గ్రూప్ చైర్మన్ ఇర్ఫాన్ రజాక్, బయోకాన్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టి, సన్ గ్రూప్ సీఈవో కావ్య మారన్, హ్యుందాయ్ ఎండీ ఉన్సూ కిమ్, ఆస్కార్ సినీ దర్శకుడు గునీత్ మోంగా తోపాటు సినీ, క్రీడా, పారిశ్రామిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు.

'హిల్ట్' పేరుతో రేవంత్ భూ దందా

» పారిశ్రామిక భూముల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్

» లక్షలాది కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరం

» హిల్ట్ విధానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి

» కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పు (హిల్ట్) విధానం పేరుతో సీఎం రేవంత్ రెడ్డి భారీ భూదందాకు తెర తీశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పారిశ్రామికవేత్తల లబ్ధికే హిల్ట్ తీసుకొచ్చారన్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 22 పారిశ్రామికవాడల్లోని సుమారు 9 వేల ఎకరాల భూములను వాణిజ్య జోన్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 27 తీసుకొచ్చిందని, ఇది అవినీతి జీవో అని విమర్శించారు. దీని వల్ల పారిశ్రామిక వాడల్లోని లక్షలాది కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రజల ప్రయోజనాల కన్నా సొంత ప్రయోజనాలే ముఖ్యమన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. హిల్ట్‌లో భారీ స్థాయిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరగనుందని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని, ఆ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని పదేళ్లలో బీఆర్ఎస్ రూ.10 లక్షల కోట్ల రుణాలతో అప్పుల కుప్పగా మారిస్తే.. రెండేళ్లుగా సీఎం రేవంత్ కూడా అదే దారిలో ప్రయాణిస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్ తానే మేధావినని కాళేశ్వరం ప్రాజెక్టును గుదిబండగా మార్చారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి రూపంలో మరో కొత్త మేధావి వచ్చారని ఎద్దేవా చేశారు. రేవంత్ ఇష్టారీతిన భూములు అమ్మాలని నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. నేడు ఉద్యోగులకు జీతాలు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రయోజనాలు అందించాలన్నా భూముల అమ్మక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. భూములు అమ్మకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి పూట గడవని పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మాలని ప్రయత్నిస్తే సుప్రీంకోర్టు చీవాట్లు పెడితే తప్ప వెనక్కి తగ్గలేదన్నారు. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి హెచ్ఎండీఏ 2013లో రూపొందించిన మాస్టర్ ప్లాన్ రైతుల పాలిట మాత్రం శాపంగా మారిందని చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి అవకాశం లేని కన్జర్వేషన్ జోన్ల కిందికి రైతుల భూములు రావడంతో వారు సొంత ఇల్లు కట్టుకోవడానికి కూడా అనుమతులు రావట్లేదన్నారు. తమ జోన్ మార్చాలని రైతులు ఏళ్లుగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం.. పారిశ్రామికవేత్తలకు మాత్రం అడగకుండానే మార్చుకునేందుకు వీలు కల్పిస్తోందన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో త్వరలో 7,267పోస్టుల భర్తీ

» 2,322 స్టాఫ్ నర్సుల నియామకాలు

» జాబితాలో స్పెషలిస్టు డాక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఫార్మసిస్టు పోస్టులు.. రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో 7,267 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో 1,623 స్పెషలిస్టు డాక్టర్లు, 607 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 48 డెంటల్ డాక్టర్లు, 2,322 స్టాఫ్‌నర్సులు, 732 ఫార్మసిస్టులు, 1,931 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్(మహిళ), నాలుగు స్పీచ్ పాథాలజిస్టు పోస్టులున్నట్లు పేర్కొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వైద్యశాఖలో మొత్తం 9,203 పోస్టులను భర్తీ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రెండేళ్లలో వైద్యరంగంలో సాధించిన ప్రగతిపై బుధవారం నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్ల సంఖ్యను క్రమంగా పెంచుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా 9 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడంతో అదనంగా 450 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కొత్తగా 16 నర్సింగ్ కాలేజీలతో రాష్ట్రంలో వాటి సంఖ్య 37కు పెరిగింది. ఈ రెండేళ్లలో 28 పారామెడికల్ కాలేజీలను ప్రభుత్వం ప్రారంభించింది. క్యాన్సర్ రోగులకు జిల్లాల్లోనే కీమో థెరపి చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కొత్తగా 18 డయాలసిస్ సెంటర్లను ప్రారంభించారు. ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది.

ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్ తగ్గింది

కాంగ్రెస్ వచ్చాక కొత్తగా 213 అంబులెన్స్‌లను ప్రారంభించామని, వీటితో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్ గిరిజన ప్రాంతాల్లో 20 నిమిషాల నుంచి 14 నిమిషాలకు తగ్గిందని, గ్రామీణ ప్రాంతాల్లో 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గిందని ప్రభుత్వం నివేదికలో పేర్కొంది. త్వరలోనే మరో 77 అంబులెన్స్‌లు తీసుకువచ్చి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్‌ను 10నిమిషాలకు తగ్గించనున్నట్లు వివరించింది. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో బాధితుల ప్రాణాలు కాపాడేందుకు రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంతానలేమి సమస్యలతో బాధపడే వారి కోసం హైదరాబాద్‌లోని గాంధీ, పెట్లబుర్జు హాస్పిటళ్లలో ఐవీఎఫ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. వరంగల్ ఎంజీఎంలోనూ ఐవీఎఫ్ సెంటర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ట్రాన్స్‌జెండర్లకు అవసరమైన వైద్య సేవల కోసం ప్రత్యేకంగా మైత్రి క్లినిక్స్‌ను ప్రారంభించింది.

వందేళ్లకు తగ్గట్లుగా ఉస్మానియా

హైదరాబాద్‌లో 3 సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్(టిమ్స్) త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. అల్వాల్ టిమ్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ న్యూరో సైన్సెస్‌గా, సనత్‌నగర్ టిమ్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ సైన్సెస్‌గా, కొత్తపేట్ టిమ్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ గ్యాస్ట్రో సైన్సెస్‌గా సేవలు అందించనున్నాయి. వందేళ్ల అవసరాలకు తగ్గట్లుగా ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తున్నామని, రూ.2వేల కోట్లతో నూతన ఆసుపత్రికి శ్రీకారం చుట్టామని ప్రభుత్వం వెల్లడించింది.

రేవంత్ రెడ్డిది అహంకారం

» హిందూ దేవుళ్ల అంశంలో సీఎం వ్యాఖ్యలపై భగ్గుమన్న బీజేపీ

» హైదరాబాద్‌లో నిరసనలు, సీఎం దిష్టిబొమ్మల దహనం

» కాంగ్రెస్ నేతలకు ఇతర మతాల దేవుళ్లకు వ్యతిరేకంగా మాట్లాడే దమ్ముందా ? : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తల నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోని వారికి ఆంజనేయుడు, రెండు పెళ్లిళ్లు చేసుకునే వారికి మరో దేవుడు, మందు తాగే వారికి మరో దేవుడు.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు భగ్గుమన్నాయి. సీఎం రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తూ హైదరాబాద్‌లో బుధవారం నిరసనలు చేపట్టాయి. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశాయి. హిందూ దేవుళ్లను అవమానించేలా సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ వ్యతిరేక వైఖరి తీసుకోవడం కాంగ్రెస్‌కు అలవాటేనని, కాంగ్రెస్ నేతలకు ఇతర మతాల దేవుళ్లకు వ్యతిరేకంగా మాట్లాడే దమ్ముందా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. గతంలో హిందువులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు ప్రజలు ఎలా బుద్ధి చెప్పారో ఆ విషయాన్ని సీఎం రేవంత్ గుర్తు చేసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ముందు తానే గొప్ప హిందువునంటూ మాట్లాడిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే హిందువుల మనోభావాలను అవహేళన చేయడం సిగ్గు చేటు అని ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి కూడా ప్రచారం కోసం హిందూ దేవుళ్లపై నోరు పారేసుకోవడం శోచనీయమంటూ ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలను బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది కూడా తప్పుబట్టారు. మరోపక్క, సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. అనంతరం గాంధీభవన్ ముట్టడికి ర్యాలీగా బయలుదేరిన నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బీజేపీది దుష్ప్రచారం

» సీఎం రేవంత్ రెడ్డి

హిందూ దేవుళ్లపై తాను ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదని, బీజేపీ నేతలు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయి నిరాశలో కూరుకుపోవడం వల్లే బీజేపీ ఇలా దుష్ప్రచారం చేస్తోందని తెలిపారు. డీసీసీ అధ్యక్షుల వర్క్‌షాప్‌లో తాను అంతర్గతంగా మాట్లాడిన విషయాలను ముందు, వెనుక కట్ చేసి అసత్యప్రచారం చే స్తున్నారని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితేనేం, ఈ విధంగానైనా తనకు ఉత్తర భారతంలో జాతీయ స్థాయిలో ప్రచారం కల్పిస్తున్నారని వ్యాఖ్యానించారు. హిందూ దేవుళ్లు మూడు కోట్లమంది ఉన్నారని, ఈ దేవుళ్లలో ఒక్కొక్కరికీ ఒక్కో లక్షణం, ప్రత్యేకత ఉంటుందని అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కూడా హిందూ సమాజం లాంటిదేనని, అందరూ ఒకేరకంగా ఉండరని తాను జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు రేవంత్ వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలన్న విషయాన్ని సరళంగా వివరించేందుకు అందరికీ తెలిసిన అంశాన్ని ఉదాహరణగా చెప్పానని అన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్యం కోల్పోతున్న బీజేపీ ఈ విషయాన్ని వక్రీకరించి, భూతద్దంలో పెట్టి చూపించి వివాదాస్పదం చేసిందని రేవంత్ రెడ్డి వివరించారు.

బెట్టింగ్ కోసం రూ.కోటి అప్పు

- రికవరీ బంగారం, రివాల్వర్ కూడా తాకట్టు!
- రివాల్వర్ గుట్టు విప్పని ఎస్సై భానుప్రకాశ్
- రివాల్వర్ ఎక్కడో పోయిందని విచారణలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై.. దొరికినచోటల్లా అప్పులు చేసి, నేరస్తుల నుంచి రికవరీ చేసిన బంగారాన్ని సైతం తాకట్టుపెట్టి సస్పెండైన అంబర్‌పేట డిటెక్టివ్ ఎస్సై భానుప్రకాశ్‌రెడ్డి విచారణలో పోలీసులకు సహకరించటం లేదని తెలిసింది. ఆయన డబ్బుకోసం సర్వీస్ రివాల్వర్‌ను సైతం తాకట్టు పెట్టారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే, అది కనిపించకుండా పోయిందని చెప్పుండటంతో ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. హైదరాబాద్ సిటీ కమిషనరేట్ చరిత్రలో ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదని చెబుతున్నారు.

రూ.కోటికిపైగా అప్పులు..

ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటికి చెందిన భానుప్రకాశ్‌రెడ్డి తెలంగాణలో నాన్‌లోకల్ కోటాలో 2020 బ్యాచ్ సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. గతేడాది అంబర్‌పేట పీఎస్‌కు డీఎస్సై (డిటెక్టివ్ ఎస్సై)గా వెళ్లాడు. అయితే, ఎస్సైగా ఎంపికైనప్పటి నుంచే అతడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడని సమాచారం. బెట్టింగ్‌లకు బానిసై దొరికినచోటల్లా అధిక వడ్డీలకు అప్పులు చేశాడు. నాలుగేళ్లలో రూ.కోటిపైగా అప్పులు చేసినట్లు విచారణలో గుర్తించినట్లు తెలిసింది. అతడి తల్లి కొంత వ్యవసాయ భూమిని అమ్మి కొడుకు చేసిన అప్పుల్లో రూ.45 లక్షల వరకు తీర్చినట్లు గుర్తించారు. అయినా, అతడు బెట్టింగ్‌ను మానుకోలేదు. వచ్చే జీతం సరిపోకపోవడంతో స్టేషన్‌లో తోటి ఉద్యోగల వద్ద కూడా అప్పులు చేసినట్లు విచారణలో తేలింది.

రివాల్వర్ గుట్టు విప్పని భానుప్రకాశ్..

ఏపీలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో ఉద్యోగం సాధించిన భానుప్రకాశ్.. ఎస్సై ఉద్యోగం నుంచి రిలీవ్‌లో భాగంగా సర్వీస్ రివాల్వర్‌ను అప్పగించాలని అధికారులు ఆదేశించటంతో, అది కనిపించడంలేదని చెప్పాడు. దాంతో ఉన్నతాధికారులు ఆరా తీయటంతో ఆయన బెట్టింగ్ బాగోతం వెలుగులోకి వచ్చింది. బుల్లెట్లు తనవద్దే ఉన్నాయని చెప్పిన భానుప్రకాశ్.. రివాల్వర్ ఏమైందన్న విషయం మాత్రం చెప్పడం లేదని తెలిసింది. డబ్బుకోసం ఖాళీ రివాల్వర్‌ను కూడా ఆయన తాకట్టుపెట్టినట్లు ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. మరోవైపు ఇటీవల పలు నేరాల్లో అరెస్టై అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన కొంతమంది నేరస్తులను కూడా ఈ కేసులో విచారిస్తున్నట్లు సమాచారం. స్టేషన్‌కు తీసుకొచ్చిన సమయంలో వారిలో ఎవరైనా డెస్క్‌లోంచి రివాల్వర్‌ను చోరీ చేసి ఉంటారా? అనే కోణంలో విచారిస్తున్నారు. కానీ అందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిసింది. దీంతో కావాలనే భానుప్రకాశ్ రివాల్వర్ విషయం దాచిపెడుతున్నట్లు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు.

కౌంటర్‌లో తత్కాల్ టికెట్లకూ ఓటీపీ తప్పనిసరి!

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ (విండో కౌంటర్)లో తత్కాల్ టికెట్ల జారీకి ఓటీపీ (వన్-టైమ్ పాస్‌వర్డ్)ని తప్పనిసరి చేయనుంది. గత నెల 17 నుంచి దేశవ్యాప్తంగా 52 రైళ్లకు ఈ పద్ధతిలో తత్కాల్ టికెట్ల జారీకి అమలుచేసిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో మరికొద్ది రోజుల్లో అన్ని రైళ్లకూ ఈ పద్ధతి ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్టు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం.. ప్రయాణికులు రిజర్వేషన్ కౌంటర్‌లో తత్కాల్ టికెట్ బుక్ చేసుకునేటప్పుడు రిజర్వేషన్ ఫారంలో తమ మొబైల్ ఫోన్ నంబరు రాయాలి. ఆ నంబరుకు ఓటీపీ వస్తుంది. దాన్ని కౌంటర్‌లోని సిబ్బందికి చెప్పి ధ్రువీకరించుకున్న తర్వాతే టికెట్ జారీ అవుతుంది.. తత్కాల్ సౌకర్యం దుర్వినియోగం కాకుండా నిరోధించేందుకు, నిజమైన ప్రయాణికులకు టికెట్లు లభించేలా చూసే దిశగా ఓటీపీ ఆధారిత టికెటింగ్ వ్యవస్థ కీలకమైన అడుగు అని రైల్వే అధికారులు చెబుతున్నారు. కాగా, ఆన్‌లైన్‌లో తత్కాల్ టికెట్ల జారీకి జూలై నుంచి ఆధార్‌ను తప్పనిసరి చేశారు. అక్టోబరు నుంచి సాధారణ రిజర్వేషన్ టికెట్ల జారీకీ ఓటీపీ ఆధారిత వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఈ విధానాలకు ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన వస్తోందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

శ్వాస తీసుకోలేడు.. అన్నం తినలేడు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించలేని స్థితిలో మంచంమీద నిశ్చేష్టంగా పడి ఉంటున్నాడు. ప్రమాదం జరిగి ఏడాది అవుతున్నా.. ఇంకా ఆ కుటుంబం కోలుకోకపోగా మరింత దుఃఖంలో కూరుకుపోయింది. ఆస్పత్రి నుంచి శ్రీతేజ్ ఆరు నెలల కిందట డిశ్చార్జి అయ్యాడు కానీ, అతని ఇల్లే ఇప్పుడు దవాఖానాగా, మారింది. తండ్రే నర్సు అయి నిరంతరం సపర్యలు చేస్తున్నారు. శ్రీతేజ్ తనంతట తానుగా అన్నం తినలేడు. అందుకే కడుపులోకి నేరుగా ద్రవాహారాన్ని పంపించేందుకు గ్యాస్ట్రోస్టోమీ పైపు అమర్చారు. శ్వాసకూడా తీసుకోలేడు. దాంతో గాలి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడానికి మెడ ముందు భాగంలో రంధ్రం చేసి ట్రాకియోస్టోమీ ట్యూబ్ పెట్టారు. దీంతో శ్రీతేజ్ ఒంటినిండా ట్యూబులతో పొత్తిళ్లలో పసిబిడ్డలా ఉలుకూ పలుకూ లేకుండా పడి ఉంటున్నాడు.

ప్రతిరోజూ థెరపీలు..

శ్రీతేజ్ ఆకలి అని సైగ కూడా చేయలేడు. తొక్కిసలాటలో చిన్నారి మెదడు కణాలు 70 శాతం దెబ్బతినడమే ఇందుకు కారణం. శ్రీతేజ్ తండ్రి మాట్లాడుతూ "రోజూ సికింద్రాబాద్‌లోని ఆసియా ట్రాన్స్‌కేర్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో కొన్ని నెలలుగా బాబుకు స్వాలో(మింగడం), స్పీచ్(మాట్లాడటం) థెరపీ ఇప్పిస్తున్నాం. అక్కడే అడ్మిట్ చేస్తే నెలకు రూ.90 వేలకు పైగా ఫీజు చెల్లించాలి. బాబును చూసుకోడానికి ఒక మనిషి అక్కడే ఉండాలి. ఇంట్లో 6ఏళ్ల నా కూతురు, 75 ఏళ్ల మా అమ్మ బాగోగులు కూడా నేనే చూసుకోవాలి. రోజుకు రూ.2 వేల చొప్పున థెరపీలకే రూ.60 వేలకు పైన కడుతున్నాను. ఇక ఇంటి దగ్గర కూడా కాళ్లు, చేతుల కదలికలకు ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. అదీ రూ.30 వేలవరకు అవుతుంది. ప్రతి నెలా కేవలం థెరపీలకే తక్కువలో తక్కువ రూ.90 వేలు కడుతున్నాను. కనీసంగా 2 నుంచి 3 ఏళ్ల నిరంతరం థెరపీలు ఇప్పిస్తే బాబు కోలుకోవచ్చని డాక్టర్లు చెప్పారు" అని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ వివరించారు. "ఇదివరకు బంగారం దుకాణంలో పనిచేసేవాడిని. అదే నా కుటుంబానికి ఆదరువు. ప్రమాదం తర్వాత మా జీవితం తలకిందులయింది. బాబును చూసుకోడానికి ఇంటిపట్టునే ఉంటున్నాను. " అని చెబుతూ భాస్కర్ కన్నీటిపర్యంతమయ్యారు. ఏప్రిల్‌లో శ్రీతేజ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినప్పటి నుంచి క్రమం తప్పకుండా థెరపీలు ఇప్పించడం వల్ల కొంచెం మార్పు కనిపిస్తోందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. "కాళ్లకు ఆపరేషన్‌తో పాటు ఇప్పటివరకు థెరపీలకు రూ.20లక్షలు చెల్లించాం. శ్రీతేజ్‌కు థెరపీలు, ఇతర మందులు, డైపర్లు, ప్రత్యేకమైన ఆహారం వంటివన్నీ కలిపి నెలకు రూ.1.25 లక్షలు పైన ఖర్చు అవుతుంది. " అని శ్రీతేజ్ బాబాయి మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు.

తమదే బాధ్యత అని చెప్పారు కానీ..

తొక్కిసలాటలో తన భార్య చనిపోవడంతో.. జరగరాని నష్టం జరిగిందంటూ అల్లు అర్జున్ కుటుంబం తన పిల్లల పేరుమీద రూ.2 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారని శ్రీతేజ్ తండ్రి భాస్కర్ చెప్పారు. ఆ మొత్తానికి నెల నెలా బ్యాంకు వడ్డీ తీసుకునే అవకాశం కల్పించారని, కానీ.. ఆ వడ్డీ డబ్బులు.. బాబు వైద్య చికిత్స ఖర్చులకు ఏమాత్రం సరిపోవడంలేదని అన్నారు. శ్రీతేజ్ ఆస్పత్రిలో ఉన్న సమయంలో.. అతడు పూర్తిగా కోలుకునే దాకా తమదే బాధ్యత అని, వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ భర్తిస్తామని అల్లు అర్జున్ కుటుంబం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇదే విషయమై అల్లు అర్జున్‌కు గుర్తు చేసేందుకు ఆయన మేనేజర్ కాంతారావును సంప్రదించగా.. సానుకూల స్పందన రాలేదని తెలిపారు.

జీహెచ్ఎంసీలో విలీనం పూర్తి!

కలిసిపోయిన 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లు

- బుధవారం ఉత్తర్వులు జారీచేసిన పురపాలక శాఖ
- తాత్కాలిక సర్కిళ్లుగా విలీన మునిసిపాలిటీలు
- ప్రొసీడింగ్స్ ఇచ్చిన జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్
- పునర్విభజన అనంతరం మారనున్న స్వరూపం
- 290 నుంచి 300 డివిజన్లు అయ్యే అవకాశం
- ఒక కార్పొరేషనా..? రెండా, మూడా? అనేదానిపై సస్పెన్స్
- ప్రభుత్వానికి అందిన పునర్విభజన ముసాయిదా
- సర్కారు ఆమోదం తర్వాత అభ్యంతరాల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో శివారులోని 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్ల విలీనం బుధవారం పూర్తయ్యింది. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు (జీవో-264) జారీ చేసింది. గ్రేటర్ పరిధిని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) వరకు విస్తరిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ చట్టం-1955లో పలు సవరణలు చేస్తూ.. అవి ఈ నెల 1వ తేదీ నుంచే అమలులోకి వచ్చినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తెలంగాణ మునిసిపల్ చట్టం -2019 నుంచి విలీన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను తొలగించారు. ఇందుకు సంబంధించిన ఆర్డినెన్స్ డిసెంబరు 2వ తేదీ నుంచి అమలవుతుందని తెలిపారు. టీసీయూఆర్ వరకు జీహెచ్ఎంసీ విస్తరణ మంగళవారం నుంచే అమల్లోకి వచ్చిందని వెల్లడించారు. ఈ జీవో వచ్చిన వెంటనే విలీనమైన మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కార్యాలయాల్లోని రికార్డులన్నీ స్వాధీనం చేసుకొని, వాటికి జీహెచ్ఎంసీ బోర్డులు ఏర్పాటు చేయాలని బల్దియా కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. విలీనం నేపథ్యంలో ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను తాత్కాలికంగా సర్కిళ్లుగా పరిగణిస్తున్నారు. పాలనాపరమైన ఇబ్బందులు లేకుండా అక్కడి కమిషనర్లు ఇక నుంచి డిప్యూటీ మునిసిపల్ కమిషనర్లుగా వ్యవహరిస్తారని ఆర్వీ కర్ణన్ ప్రొసీడింగ్స్ జారీచేశారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 30 సర్కిళ్లు, ఆరు జోన్లు ఉన్నాయి. 27 విలీన మునిసిపాలిటీలతో కలిపి సర్కిళ్ల సంఖ్య 57కు పెరుగనుంది.

పునర్విభజన వరకే...

వార్డుల పునర్విభజన జరిగే వరకు ఈ సర్కిళ్లు, మునిసిపల్ కమిషనర్లు కొనసాగుతారు. పునర్విభజన ముసాయిదాను జీహెచ్ఎంసీ ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నివేదించింది. సర్కారు ఆమోదించాక రెండుమూడు రోజుల్లో అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు కమిషనర్ నోటిఫికేషన్ ప్రకటిస్తారు. అనంతరం పునర్విభజన ప్రక్రియను పూర్తిచేయనున్నారు. ఫిబ్రవరి 10వ తేదీ తరువాతే పునర్విభజన అమలులోకి వస్తుందని ఓ అధికారి తెలిపారు. అప్పటి వరకు శివారు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు సర్కిళ్లుగా కొనసాగనున్నాయి. అనంతరం మొత్తం స్వరూపం మారిపోనుంది.

10 జోన్లుగా మెగా జీహెచ్ఎంసీ..?

విలీనం తర్వాత రెండు వేల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తీర్ణంలో ఉన్న టీసీయూఆర్ ను 9-10 జోన్లుగా విభజించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. టీసీయూఆర్ పరిధిలో 1.30 కోట్లకుపైగా జనాభా ఉంటుందని అంచనా. 40 వేల నుంచి 50 వేల జనాభాకు ఒకటి చొప్పున 290 నుంచి 300 వరకు డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశముంది. గ్రేటర్‌తో పోలిస్తే శివారు మునిసిపాలిటీల్లో జనసాంద్రత తక్కువ. ఈ క్రమంలో సహజ సరిహద్దులతోపాటు భవిష్యత్తులో ఏ స్థాయిలో అభివృద్ధి జరిగే, జనాభా పెరిగే అవకాశ ముందన్నది పరిగణనలోకి తీసుకున్నారు. టీసీయూఆర్ వరకు ఒకే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలా..? లేదంటే రెండుమూడు కార్పొరేషన్లుగా విభజించాలా..? అన్నదానిపై సర్కారు నుంచి స్పష్టత రావాల్సి ఉందని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత ఎన్ని కార్పొరేషన్లు ఉంటాయన్నదానిపై స్పష్టత రానుంది. ఒకటి కంటే ఎక్కువ కార్పొరేషన్లుగా విభజించిన పక్షంలో జోన్ల సంఖ్యలో మార్పు ఉంటుంది. దీనిపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో దాదాపు వారంపాటు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు సుదీర్ఘ కసరత్తు చేశారు. జీహెచ్ఎంసీతోపాటు విలీన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లవారీగా ప్రాంతాలను క్లస్టర్లుగా విభజించి మ్యాపింగ్ చేశారు. విలీనమైన కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ప్రస్తుతం 512 మంది రెగ్యులర్, 6,026 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులున్నారు. గెజిట్ విడుదలతో వీరంతా జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తారు.

మూగ బాలుడికి మెరుగైన వైద్యం అందించండి

- వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడి ఘటనపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నర్సాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూగ బాలుడు ప్రేమ్‌చంద్‌పై వీధి కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. బుధవారం ఉదయం ఈ ఘటనకు సంబంధించిన వార్తను పత్రికల్లో చూసి చలించిపోయారు. బాలుడి పరిస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సీఎంఓ అధికారులతో మాట్లాడి.. బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కమిషనర్ స్వయంగా వెళ్లి బాలుడిని పరామర్శించాలని, అతడి కుటుంబ బాగోగులు పరిశీలించి, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆదేశించారు. తక్షణమే వీధి కుక్కల కట్టడిపై చర్యలు చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు

రాష్ట్రంలో వీధి కుక్కల దాడులు ఆగడం లేదు. హయత్‌నగర్ ఘటన మరవకముందే అలాంటి ఘటనే మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. నర్సాపూర్ పట్టణంలో షేక్ అలీ అనే ఆరేళ్ల బాలుడు బుధవారం ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. బాలుడి అరుపులు విన్న తల్లి షబానా వెంటనే బయటకు వచ్చి కుక్కల బారి నుంచి బాలుడిని తప్పించి ఆస్పత్రికి తరలించింది. అప్పటికే బాలుడి చేతికి, నాభికి తీవ్రగాయాలయ్యాయి.

కుక్కలు వెంబడించడంతో.. బైకుపై నుంచి పడి యువకుడి మృతి


శివకుమార్ (ఫైల్)

గీసుగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని వీధికుక్కల రూపంలో మృత్యువు వెంటాడింది. ఉద్యోగం ముగించుకుని రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా కుక్కలు వెంటపడ్డాయి. దీంతో బైకు అదుపుతప్పి డ్రైనేజీలో పడిపోయి ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద ఘటన వరంగల్ జిల్లాలోని గీసుకొండ మండలం మచ్చాపుర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మండలంలోని ఎలుకుర్తి గ్రామానికి చెందిన ఆడెపు శివకుమార్ (24) హన్మకొండలో ఉద్యోగం ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఈ ఘటన జరిగింది.

చిత్రజ్యోతి

SINCE 1965



సనాతన ధర్మం గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది

నందమూరి బాలకృష్ణ

తాను మద్రాస్‌లో జన్మించానని, అందువల్ల అది తన జన్మభూమి అనీ, తెలంగాణ కర్మభూమి, ఆంధ్రప్రదేశ్ ఆత్మభూమి అని నందమూరి బాలకృష్ణ వెల్లడించారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఆయన నటించిన 'అఖండ 2.. తాండవం' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం చెన్నైలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. అందులో బాలకృష్ణ మాట్లాడుతూ.. 'నేను మద్రాస్‌లో జన్మించాను. ఇది నాకు సొంతిల్లులా అనిపిస్తుంది. 'అఖండ:2' సనాతన ధర్మం గొప్పతనాన్ని ఆవిష్కరిస్తుంది. భవిష్యత్ తరాలు ఈ సినిమా ద్వారా సనాతన ధర్మం గురించి తెలుసుకుంటాయి' అన్నారు. చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ, 'భారతదేశ ఆత్మ. దేశం, దైవం, ధర్మం వంటి అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూసి ఆదరిస్తారని నమ్ముతున్నాను' అని పేర్కొన్నారు. సీనియర్ నటి వీజీ చంద్రశేఖర్ మాట్లాడుతూ, 'ఈ మూవీలో బాలకృష్ణ క్రమశిక్షణ, సహనంతో నటించారు. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు దైవత్వం, భావోద్వేగం వంటి అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని పేర్కొన్నారు. సీనియర్ నటుడు వైజీ మహేంద్రన్ మాట్లాడుతూ, 'ఇందులో టిబెటన్ సన్యాసి పాత్రలో నటించాను. క్లైమాక్స్‌లో మైనస్ 7 డిగ్రీల ఉష్ణోగ్రతలో బాలకృష్ణ చొక్కా లేకుండా నటించారు. ఆ పరమశివుడే బాలకృష్ణలో ఆవహించినట్లు అనిపించింది' అని పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

అత్తారింట సమంతకు ఘనస్వాగతం


రాజ్ తల్లితండ్రులు కృష్ణ నిడిమోరు, రమా రత్నాకర... సోదరి శీతల్, మేనల్లుళ్లు విష్ణు, కేశవ్, మాధవ్‌లతో సమంత

ఇటీవలె దర్శకుడు రాజ్ నిడిమోరుతో హీరోయిన్ సమంత వివాహం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమెకు అత్తారింట్లో ఘనస్వాగతం లభించింది. ఈ మేరకు రాజ్ నిడిమోరు సోదరి శీతల్ ఈ జంటకు అభినందనలు చెబుతూ భావోద్వేగానికి లోనయ్యారు. నిడిమోరు కుటుంబంలోకి సామ్‌ను ఆహ్వానిస్తూ కుటుంబమంతా కలసి తీసుకున్న ఫొటోను షేర్ చేశారు. 'కృతజ్ఞతా భావంతో హృదయం ఉప్పొంగిపోతోంది. ఈ ఆనందాన్ని వర్ణించటానికి మాటలు రావడం లేదు. రాజ్-సమంత జీవితంలో మొదలైన ఈ కొత్త అధ్యాయాన్ని సంతోషంతో స్వాగతిస్తున్నాము. ఈ రోజు మా కుటుంబం పరిపూర్ణమైంది. ఈ నూతన జంట ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకు సాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. నిజాయితీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతతో నిండిపోతుంది. మీకెప్పుడూ అండగా ఉంటాము. అందరికీ ఇలాంటి అద్భుతమైన ప్రేమ దక్కాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. శీతల్ పోస్టుకు స్పందించిన సమంత 'లవ్ యూ' అని బదులిచ్చారు.

శంకర వరప్రసాద్‌తో షూటింగ్ పూర్తి



"మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలో నా పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను ఈ రోజుతో పూర్తి చేశాను. ఇదొక అద్భుతమైన ప్రయాణం' అని హీరో వెంకటేశ్ పేర్కొన్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో వెంకటేశ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిరంజీవి, వెంకటేశ్‌పై ఓ మాస్ సాంగ్‌ను తెరకెక్కించారు. ఈ చిత్రంలో తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణ పూర్తి చేసినట్లు వెంకటేశ్ బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'నాకు అత్యంత ఇష్టమైన మెగాస్టార్ చిరంజీవి గారితో కలసి పనిచేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఈ చిత్రం నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలను మిగిల్చింది. చిరంజీవిగారితో కలసి నటించాలన్నది నా చిరకాల కోరిక. దర్శకుడు అనిల్ రావిపూడి గారి వల్ల ఈ ప్రత్యేక చిత్రంతో ఇన్నాళ్లకు ఆ కోరిక తీరింది. 2026 సంక్రాంతికి థియేటర్లలో మీ అందరితో కలసి సంబరాలు చేసుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని వెంకటేశ్ పేర్కొన్నారు. నయనతార కథానాయికగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

ఆరు కాదు ఒక్కటే



ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ (ఎఫ్‌డీసీ), నిర్మాత దిల్ రాజు బాలీవుడ్‌కు వెళ్తున్నారు, అక్కడ ఒకేసారి ఆరు భారీ ప్రాజెక్టులు మొదలు పెడుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై ఆయన బుధవారం స్పందించారు. పాత ఊహాగానాలకూ ఇప్పటి విషయాలకు ముడిపెట్టి కొందరు తప్పుగా ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'కొన్ని రోజులుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ నుంచి రాబోయే ప్రాజెక్ట్ గురించి బయట జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. నేను ప్రస్తుతం నిర్మిస్తున్న సినిమాలకు బాలీవుడ్‌తో సంబంధం ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం అక్షయ్‌కుమార్ హీరోగా అనీస్ బజ్మీ దర్శకత్వంలో ఒక చిత్రాన్ని మాత్రమే బాలీవుడ్‌లో నిర్మిస్తున్నాను. ఆ ప్రాజెక్ట్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. అంతవరకూ ఇలాంటి అసత్య ప్రచారాలు చేయకండి' అని విజ్ఞప్తి చేశారు.

జనరిక్ 'సెమాగ్లుటైడ్' తయారీకి

డాక్టర్ రెడ్డీస్‌కు గ్రీన్ సిగ్నల్

నోవో నార్డిస్క్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ: డెన్మార్క్ కేంద్రంగా పనిచేసే బహుళజాతి ఫార్మా కంపెనీ నోవో నార్డిస్క్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. వెయిట్‌లాస్ ఔషధం 'సెమాగ్లుటైడ్'ను డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ తయారుచేయకుండా అడ్డుకోవాలన్న కంపెనీ కుయుక్తులు బెడిసి కొట్టాయి. తమకు పేటెంట్ ఉన్న ఈ ఔషధాన్ని వచ్చే ఏడాది మార్చి వరకు డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ జనరిక్ ఔషధంగా తయారుచేసేందుకు వీల్లేదన్న కంపెనీ వాదనని ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఈ ఔషధాన్ని జనరిక్ రూపంలో తయారుచేసి దేశ, విదేశాల్లో మార్కెట్ చేసుకోవచ్చని తెలిపింది. అయితే నోవో నార్డిస్క్ కంపెనీకి పేటెంట్ హక్కులు లేని దేశాలకు మాత్రమే ఈ అనుమతి వర్తిస్తుందని స్పష్టం చేసింది.

మరింత తగ్గనున్న ధర

అమెరికా ఔషధ దిగ్గజం ఇలీ లిల్లీ ప్రవేశంతో నోవో నార్డిస్క్ కంపెనీ 'వెగోవి' ధరను ఇప్పటికే 37% తగ్గించింది. దీనికి తోడు ఎమ్‌కో ఫార్మాతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుని అమ్మకాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఢిల్లీ హైకోర్టు తీర్పుతో దేశీయ ఫార్మా దిగ్గజాలు త్వరలోనే అత్యంత చౌకగా సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధాలను మార్కెట్‌కు తేనున్నాయి. దీంతో నోవో నార్డిస్క్ కంపెనీ ఔషధం వెగోవికి మన దేశంతో పాటు, తనకు పేటెంట్ హక్కులు లేని దేశాల్లోనూ గండి పడనుంది.

రూ.850 కోట్ల మార్కెట్ : ఊబకాయాన్ని తగ్గించడంతో పాటు చక్కెర వ్యాధి నియంత్రణ కోసం 'సెమాగ్లుటైడ్' ఔషధాన్ని ఉపయోగిస్తారు. ఈ పేటెంట్ ఔషధాన్ని నోవో నార్డిస్క్ కంపెనీ వెగోవీ పేరుతోను, ఇలీ లిల్లీ కంపెనీ మొంజారో పేరుతోను మన దేశంలో భారీ ధరతో మార్కెట్ చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ రెండు ఔషధాల అమ్మకాలు రూ.850 కోట్ల వరకు ఉన్నాయి. దేశీయ ఫార్మా కంపెనీలు చౌకగా జనరిక్ రూపంలో వెగోవీ ఔషధాన్ని తయారు చేసేందుకు ప్రయత్నించినా, పేటెంట్ హక్కుల పేరుతో నోవో నార్డిస్క్ అడ్డుకుంటోంది. అయితే విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ హైకోర్టు, డాక్టర్ రెడ్డీకు ఈ అనుమతి ఇచ్చినట్టు భావిస్తున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,580 ▲	1,19,700 ▲	2,01,000 ▲
విజయవాడ	1,33,500 ▲	1,23,000 ▲	1,98,000 ▲
విశాఖపట్నం	1,32,680 ▲	1,19,350 ▲	2,01,000 ▲
రాజమండ్రి	1,30,580 ▲	1,19,700 ▲	1,84,000 ▲
ప్రొద్దుటూరు	1,27,900 ▲	1,17,670 ▲	1,78,000 ▲
ముంబై	1,28,210 ▼	1,17,440 ▼	1,78,190 ▼

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	122	విజయవాడ	125
వరంగల్	122	గుంటూరు	132
కరీంనగర్	122	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	122	చిత్తూరు	115
కర్నూలు	122	నెల్లూరు	120
విశాఖపట్నం	120	అనంతపురం	120
గోదావరి	125		

రూపాయి గాయానికి ఆర్‌బీఐ మందేమిటో..?

ద్రవ్యపరపతి సమీక్ష షురూ ● రేపు నిర్ణయాల ప్రకటన ● కరెన్సీని ఆదుకునేందుకూ చర్యలు

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన సమీక్ష బుధవారం ప్రారంభమైంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమావేశంలో దేశ విదేశాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులతో పాటు వృద్ధిరేటు, వడ్డీరేట్ల తీరుతెన్నులపై చర్చించనుంది. శుక్రవారం మల్హోత్రా ఎంపీసీ సమావేశం నిర్ణయాలను నిర్ణయాలను ప్రకటిస్తారు. అయితే, రూపాయి రోజుకో సరికొత్త కనిష్ఠ స్థాయికి క్షీణిస్తున్న తరుణంలో ఎంపీసీ భేటీ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. రూపాయి పతనానికి అడ్డుకట్ట వేసేందుకు ఆర్‌బీఐ ఈసారి సమీక్షలో ఏం చర్యలు తీసుకుంటుందా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కరెన్సీని ఆదుకునేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందా..లేదా..? అనే అంశంపై మార్కెట్ స్పష్టత కోరుకుంటున్నదని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీస్, కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది అన్నారు. ఈ మధ్యకాలంలో రూపాయి వరుసగా క్షీణిస్తూ రావడానికి ఫారెక్స్ కార్యకలాపాల్లో ఆర్‌బీఐ పెద్దగా జోక్యం చేసుకోకపోవడం కూడా ఒక కారణమన్నారు. ఈసారి సమీక్షలో కరెన్సీ పతనంపై ప్రస్తావించినప్పటికీ, డాలర్-రూపాయి మారకం స్థాయిపై ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యానించకపోవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రూపాయి మారకం విలువకు లక్ష్యాన్నేమీ నిర్దేశించుకోలేదని మల్హోత్రా ఈ మధ్యనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూపాయి మారకం విలువ 5.08% క్షీణించింది. ఇండోనేషియా రూపయ్య 3.17%, ఫిలిప్పీన్స్ పెసో 1.54%, హాంకాంగ్ డాలర్ 0.18% తగ్గాయి. వర్ధమాన మార్కెట్లలో అత్యధికంగా పతనమైన కరెన్సీల్లో రూపాయి మూడో స్థానంలో ఉంది. ఈ ఏడాదిలో అర్జెంటీనా పెసో 29.18%, టర్కిష్ లిరా 16.69% నష్టపోయాయి.



రెపో యథాతథమా..?

ఈ అక్టోబరులో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డు కనిష్ఠ స్థాయి 0.25 శాతానికి జారుకున్న నేపథ్యంలో ఆర్‌బీఐ ఈసారి సమీక్షలో రెపోరేటును మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలున్నాయి. అయితే ఈ సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు సైతం ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి పెరిగిన నేపథ్యంలో ఈసారి రెపోను యథాతథంగా కొనసాగించేందుకూ అవకాశాలు ఉన్నాయని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డీరేట్లపై యథాతథ స్థితి, భవిష్యత్ రేట్లపై తటస్థ వైఖరి రెండూ పతనమవుతున్న రూపాయిని ఆదుకునేందుకు సైతం దోహదపడతాయని వారన్నారు. ఈ ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ మూడు విడతల్లో రెపోరేటును ఒక శాతం తగ్గించింది.

లెక్సస్ కొత్త కారు



లెక్సస్ ఇండియా తన ఆర్ఎక్స్ 350 కార్లలో "ఎక్స్‌క్విజిట్" గ్రేడ్‌ను మార్కెట్లోకి తెచ్చింది. మూడు వేరియెంట్లలో ఈ కారు రూ.89,99,000 నుంచి రూ.1,09,46,000 మధ్యలో అందుబాటులో ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

మళ్లీ 26,000 దిగువకు నిఫ్టీ

రూ.2.79 లక్షల కోట్ల సంపద నష్టం

ముంబై: స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజూ నష్టపోయింది. లాభాల స్వీకరణ కారణంగా బుధవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 374.63 పాయింట్లు క్షీణించి 84,763.64 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే, ఐటీ స్టాక్స్‌తో పాటు ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లతో ఆఖరి గంట ట్రేడింగ్‌లో సూచీ మళ్లీ పుంజుకున్నప్పటికీ.. చివరికి 31.46 పాయింట్ల నష్టంతో 85,106.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46.20 పాయింట్లు తగ్గి మళ్లీ 26,000 దిగువన 25,986 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.2.79 లక్షల కోట్లు క్షీణించి రూ.469.67 లక్షల కోట్లకు జారుకుంది. ఎఫ్‌పీఐలు నికరంగా రూ.3,206.92 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు.

- బుధవారం ప్రారంభమైన మూడు ఐపీఓలకు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. ఈ-కామర్స్ కంపెనీ మీషో ఇష్యూకు తొలిరోజున 2.35 రెట్ల బిడ్లు వచ్చాయి. ఏక్వస్ ఇష్యూకు 3.42 రెట్లు, విద్య వైర్స్ ఇష్యూకు 2.89 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.



స్వర్గీయ ఉర్మిళాదేవి రమేశ్ చంద్ర అగర్వాల్ స్మారకార్థం నింటోలా గోశాలకు రూ.21 లక్షల విరాళం అందిస్తున్న ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ డైరెక్టర్లు విశాల్ అగర్వాల్, నీలేశ్ అగర్వాల్

అమెరికాకు పెరిగిన భారత స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ మన దేశం నుంచి అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు భారీగా పెరిగాయి. అక్టోబర్ నెలలో భారత్ నుంచి యూఎస్‌కు స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు మూడు రెట్లకు పైగా పెరిగి 147 కోట్ల డాలర్లకు (సుమారు రూ. 12,936 కోట్లు) చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ విలువ రూ.4,048 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్య కాలంలో రూ.94,864 కోట్ల విలువైన స్మార్ట్ ఫోన్లు అమెరికాకు ఎగుమతైనట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇది గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ. 31,680 కోట్లతో పోలిస్తే మూడింతలు అధికం.

ఈనెల 10 నుంచి నెఫ్రోప్లస్ ఐపీఓ

రూ.353 కోట్ల తాజా ఈక్విటీ జారీ

నెఫ్రోప్లస్ బ్రాండ్‌నేమ్‌తో డయాలిసిస్ సేవలందిస్తున్న హైదరాబాద్ సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈనెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.353.4 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.27 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. మొత్తంగా ఐపీఓ ద్వారా కంపెనీ రూ.2,000 కోట్ల వరకు సమీకరించే అవకాశముంది. తాజా ఈక్విటీ జారీ ద్వారా సమకరించే నిధుల్లో రూ.129 కోట్లతో భారత్‌లో మరిన్ని డయాలిసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు నెఫ్రోప్లస్ తెలిపింది. మరో రూ.136 కోట్లతో రుణ భారం తగ్గించుకోవడంతోపాటు ఇతర వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకోనుంది.

- ఔషధ సంస్థ కరోనా రెమెడీస్ రూ.655 కోట్ల ఐపీఓ ఈనెల 8న మొదలై 10న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.1,008-1,062గా నిర్ణయించింది.

సిల్వర్ సరికొత్త రికార్డు

ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో రూ.1.84 లక్షలకు కిలో ధర

వెండి ధర బంగారం కంటే వేగంగా పరిగెడుతోంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో (ఎంసీఎక్స్) వెండి ఫ్యూచర్స్ 2026 మార్చి కాంట్రాక్టు రేటు రూ.3,126 లేదా 1.72% పెరిగి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,84,727కు చేరింది. గోల్డ్ ఫ్యూచర్స్ 2026 ఫిబ్రవరి కాంట్రాక్టు ధర కూడా రూ.1,007 పెరుగుదలతో రూ.1,30,766 వద్దకు చేరుకుంది.

హైదరాబాద్‌లో చార్లెస్ ష్వాబ్ జీసీసీ




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో తమ గ్లోబల్ కేపబులిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్టు చార్లెస్ ష్వాబ్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. బహుళజాతి కంపెనీల్లో 25 సంవత్సరాలకు పైగా అనుభవం ఉన్న ప్రదీప్ మీనన్‌ను ష్వాబ్ ఇండియా ఎండీగా నియమించినట్టు తెలిపింది. హైదరాబాద్ కార్యాలయంలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ వచ్చే ఏడాది నియామకాల ప్రక్రియ ప్రారంభించనున్నట్టు కంపెనీ వెల్లడించింది.

డాలర్=12 లక్షల రియాల్స్ కుప్పకూలిన ఇరాన్ కరెన్సీ

టెహ్రాన్: ఇరాన్ కరెన్సీ రియాల్ మారకం విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే ఏకంగా 12 లక్షల రియాల్స్‌కు చేరుకుంది. ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో కొనసాగుతున్న ఇరాన్‌పై అమెరికా విధించిన అణు ఆంక్షలు ఆ దేశ కరెన్సీని భారీగా కుంగదీశాయి. దాంతో ధరలు భారీగా పెరుగుతూ పోతుండటంతో ఇరాన్ దేశస్థుల జీవనం దుర్భరంగా మారుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	645
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

స్పోర్ట్స్

నాలుగో ర్యాంక్‌కు విరాట్

దుబాయ్: సఫారీలతో వన్డే సిరీస్‌లో సెంచరీలతో దుమ్మురేపుతున్న విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ముందుకెళ్లాడు. బ్యాటర్ల జాబితాలో ఓ స్థానం మెరుగుపరచుకొన్న విరాట్.. 751 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచాడు. రోహిత్ శర్మ నెంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇక శుభ్‌మన్ గిల్ నాలుగునుంచి ఐదో స్థానానికి పడిపోయాడు. బౌలర్లలో కుల్దీప్ యాదవ్ ఓ స్థానం మెరుగై ఆరో ర్యాంక్‌లో ఉన్నాడు.

ఫిడే రేటెడ్ ప్లేయర్‌గా మూడేళ్ల చిన్నారి రికార్డు



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌కు చెందిన సర్వగ్య సింగ్ కుష్వాహ ప్రపంచంలోనే అత్యంత పిన్న వయసులో ఫిడే రేటెడ్ ప్లేయర్‌గా గుర్తింపు పొంది చరిత్ర సృష్టించాడు. మూడు సంవత్సరాల ఏడు నెలల, 20 రోజుల్లో ఫిడే రేటింగ్ సాధించిన పిన్న క్రీడాకారుడిగా సర్వగ్య రికార్డు నెలకొల్పాడు. అంతకుముందు బెంగాల్‌కు చెందిన అనీష్ సర్కార్ మూడేళ్ల 8 నెలల వయసులో ఈ రికార్డు నెలకొల్పాడు. వాస్తవానికి సర్వగ్య ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఎక్కువగా చూస్తుండడంతో వాటి నుంచి దృష్టి మరల్చేందుకు అతడి తల్లిదండ్రులు చెస్‌ను నేర్పించడం మొదలుపెట్టారు. అలా చెస్ ప్రయాణం ప్రారంభించిన ఈ చిన్నారి ఆరు నెలలు తిరిగేసరికి ప్రొఫెషనల్ క్రీడాకారులను ఓడించడం విశేషం. ప్రస్తుతం ఈ బుడ్డోడి ఖాతాలో 1572 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఫిడే రేటింగ్ సాధించాలంటే ఒక అంతర్జాతీయ ప్లేయర్ ఓడించాల్సి ఉంది. అయితే సర్వగ్య ఏకంగా ముగ్గురు క్రీడాకారులను ఓడించి సంచలనం సృష్టించాడు.

హార్దిక్, గిల్ వచ్చేశారు

మళ్లీ జట్టులోకి బుమ్రా ● సఫారీలతో టీ20 సిరీస్‌కు టీమిండియా



రాయ్‌పూర్: సఫారీలతో టెస్టు సిరీస్ సమయంలో మెడ నొప్పికి గురైన శుభ్‌మన్ గిల్, ఆసియా కప్ ఫైనల్‌కు ముందు గాయపడి చాన్నాళ్లు ఆటకు దూరమైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తిరిగి జట్టులోకి వచ్చారు. ఈనెల 9 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు టీమిండియాను బుధవారం ప్రకటించారు. సూర్యకుమార్ సారథ్యంలోని 15 మంది సభ్యుల ఈ బృందానికి వైస్ కెప్టెన్‌గా గిల్‌ను ఎంపిక చేశారు. అయితే, గిల్ జట్టుకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాడా లేదా అన్నది సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఇచ్చే ఫిట్‌నెస్ నివేదికపై ఆధారపడి ఉంటుందని బీసీసీఐ తెలిపింది. పనిభారం దృష్ట్యా వన్డే సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకున్న బుమ్రాను మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. బ్యాటర్ రింకూ సింగ్‌పై వేటు వేశారు. సఫారీలతో ఈనెల 9, 11, 14, 17, 19 తేదీల్లో కటక్, చండీగఢ్, ధర్మశాల, లఖ్‌నవూ, అహ్మదాబాద్ వేదికలుగా ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

టీ20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ (వికెట్ కీపర్), సంజూ శాంసన్ (వికెట్ కీపర్), బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్, కుల్దీప్, హర్షిత్ రాణా, వాషింగ్టన్.

క్రికెట్‌కు మోహిత్ శర్మ గుడ్‌బై



న్యూఢిల్లీ: టీమిండియా వెటరన్ పేసర్ మోహిత్ శర్మ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. హరియాణాకు చెందిన 35 ఏళ్ల మోహిత్.. 34 అంతర్జాతీయ మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. 26 వన్డేలాడి 31 వికెట్లు తీసిన అతను.. 8 టీ20ల్లో 6 వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. 2015 వన్డే వరల్డ్‌కప్‌లోనూ సభ్యుడిగా ఉన్న మోహిత్.. ఆ టోర్నీలో 8 మ్యాచ్‌ల్లో 13 వికెట్లు తీశాడు. చివరిగా 2015లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మోహిత్.. ఆ తర్వాత ఐపీఎల్‌లో రెగ్యులర్‌గా ఆడుతూ వచ్చాడు. ఈ ఏడాది గుజరాత్ టైటాన్స్‌కు ఆడాడు.

డఫీ 'పాంచ్'.. విండీస్ 167 ఆలౌట్

క్రైస్ట్‌చర్చ్: వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఆతిథ్య న్యూజిలాండ్ ఆధిక్యం అందుకుంది. రెండోరోజైన బుధవారం కరీబియన్లు తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగులకే కుప్పకూలారు. హోప్ (56), చందర్‌పాల్ (52) ఫర్వాలేదనిపించారు. జాకబ్ డఫీ (5/34) ఐదు వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ ఆట ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 32 పరుగులు చేసింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 231 రన్స్‌కు ఆలౌటైంది. ప్రస్తుతానికి కివీస్ 96 పరుగుల ఆధిక్యంలో ఉంది.



టీ20 వరల్డ్‌కప్ జెర్సీ ఆవిష్కరణ

రాయ్‌పూర్: వచ్చే ఏడాది జరిగే టీ20 వరల్డ్‌కప్ కోసం రూపొందించిన భారత జట్టు కొత్త జెర్సీని రోహిత్ శర్మ ఆవిష్కరించాడు. బుధవారం ఇక్కడ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో ఇన్నింగ్స్ విరామం మధ్యలో ఈ కార్యక్రమం జరిగింది. రోహిత్ శర్మ, తిలక్ వర్మకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, అడిడాస్ ఇండియా జీఎం విజయ్ చౌహాన్ కొత్త జెర్సీలను అందించారు. మైదానంలో ఒక భారీ జెర్సీని కూడా ప్రదర్శించారు.

రాణాకు మందలింపు: క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించిన పేసర్ హర్షిత్ రాణాను ఐసీసీ మందలించింది. అంతేకాకుండా అతడి ఖాతాలో ఓ డిమెరిట్ పాయింట్ చేర్చింది. తొలి వన్డేలో బ్రేవిస్ అవుటైనప్పుడు అతడిని రెచ్చగొట్టేలా రాణా వ్యవహరించాడు.


358 చాల్లేదు

కోహ్లీ, గైక్వాడ్ శతకాలు వృథా

రెండో వన్డేలో భారత్‌పై దక్షిణాఫ్రికా గెలుపు

మార్‌క్రమ్ సెంచరీ ● 1-1తో సిరీస్ సమం





రాయ్‌పూర్: విరాట్ కోహ్లీ (93 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102), రుతురాజ్ గైక్వాడ్ (83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 105) శతకాలతో భారత్ భారీ స్కోరు చేసినా.. బౌలర్లు, ఫీల్డింగ్ వైఫల్యంతో కొండంత స్కోరును కాపాడుకోలేకపోయింది. మార్‌క్రమ్ (98 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110)తోపాటు మిగతా బ్యాటర్లు రాణించడంతో.. బుధవారం హోరాహోరీగా జరిగిన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా 4 వికెట్లతో భారత్‌ను ఓడించింది. మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. తొలుత భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 358/5 స్కోరు చేసింది. రాహుల్ (43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66 నాటౌట్) రాణించాడు. యాన్సెన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగులు చేసి గెలిచింది. బ్రిట్స్‌కే (68), బ్రేవిస్ (54) గెలుపులో కీలక పాత్ర పోషించారు. అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ చెరో 2 వికెట్లు తీశారు. మార్‌క్రమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఆఖరిదైన మూడో వన్డే శనివారం విశాఖపట్నంలో జరగనుంది.

రాణించిన బ్యాటర్లు..: భారీ ఛేదనలో ఓపెనర్ డికాక్ (8)ను అర్ష్‌దీప్ స్వల్ప స్కోరుకే వెనక్కిపంపినా.. మార్‌క్రమ్‌తోపాటు మిగతా బ్యాటర్లు కలిసికట్టుగా ఆడి సౌతాఫ్రికాకు అద్భుత విజయాన్ని అందించారు. 53 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మార్‌క్రమ్ ఇచ్చిన క్యాచ్‌ను జైస్వాల్ చేజార్చడంతో.. భారత్ భారీమూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. కెప్టెన్ బవుమా (46)తో కలసి రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్న మార్‌క్రమ్.. బ్రిట్స్‌కేతో కలసి మూడో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపుబాటలో నిలిపాడు. అయితే, సెంచరీ పూర్తి చేసుకొన్న మార్‌క్రమ్‌ను.. 30వ ఓవర్‌లో రాణా స్లో బంతితో బోల్తా కొట్టించడంతో.. భారత్ ఊపిరి పీల్చుకొంది. అప్పటికి సౌతాఫ్రికా విజయానికి 20 ఓవర్లలో ఇంకా 162 రన్స్ కావాలి. ఈ దశలో బ్రిట్స్‌కే, బ్రేవిస్ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. ఈ క్రమంలో బ్రిట్స్‌కే హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. 40వ ఓవర్‌లో రాణా బౌలింగ్‌లో బ్రేవిస్ రెండు వరుస సిక్స్‌లతో గేర్ మార్చాడు. దీంతో లక్ష్యం చివరి 60 బంతుల్లో 77 పరుగులకు దిగివచ్చింది. అయితే, సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న బ్రేవిస్‌ను కుల్దీప్ క్యాచవుట్ చేశాడు. బ్రిట్స్‌కేను ప్రసిద్ధ్.. యాన్సెన్ (2)ను అర్ష్‌దీప్ వెనక్కిపంపడంతో కొంత ఉత్కంఠ రేగినా.. జోర్జి (17 రిటైర్డ్ హర్ట్), బాష్ (29 నాటౌట్), కేశవ్ (10 నాటౌట్) 4 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించారు.

డెత్‌లో డీలా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (22), రోహిత్ (14) దూకుడైన ఆరంభాన్నిచ్చారు. ఐదో ఓవర్‌లో బర్గర్ బౌలింగ్‌లో 3 ఫోర్లు బాదిన రోహిత్.. అదే ఓవర్‌లో అవుటవగా.. జైస్వాల్ మరోసారి యాన్సెన్ బౌన్సర్‌కు బోల్తాపడ్డాడు. అయితే, కోహ్లీ, గైక్వాడ్ మూడో వికెట్‌కు 195 పరుగులు జోడించడంతో భారత్ భారీ స్కోరు చేసింది. కోహ్లీ, గైక్వాడ్ చక్కని సమన్వయంతో వికెట్ల మధ్య పరిగెత్తడంతోపాటు వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో 15 ఓవర్లు ముగిసే సరికి టీమిండియా 96/2తో నిలిచింది. గత మ్యాచ్‌లో స్వల్ప స్కోరుకే వెనుదిరిగిన గైక్వాడ్ ఈసారి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాడు. ఈ క్రమంలో 24వ ఓవర్‌లో మార్‌క్రమ్ బౌలింగ్‌లో రుతురాజ్ సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ తర్వాతి ఓవర్‌లో కోహ్లీ కూడా అతడిని అందుకొన్నాడు. ఆత్మవిశ్వాసం పెరగడంతో రుతురాజ్ ఒక్కసారిగా గేర్‌మార్చాడు. 28వ ఓవర్‌లో కేశవ్ బౌలింగ్‌లో 4,6,4తో 16 పరుగులు పిండుకొన్న గైక్వాడ్.. ఆ తర్వాతి ఓవర్‌లో మరో రెండు ఫోర్లు కొట్టాడు. ఈ క్రమంలో గైక్వాడ్ కెరీర్‌లో తొలి శతకాన్ని పూర్తి చేసుకొన్నాడు. అయితే, యాన్సెన్ బౌలింగ్‌లో రుతురాజ్ మరో భారీ షాట్ ఆడే క్రమంలో జోర్జికి చిక్కాడు. మరోవైపు వరుసగా రెండో సెంచరీ బాదిన కోహ్లీని.. ఎన్‌గిడి అవుట్ చేయడంతో భారత్ స్కోరు వేగం మందగించింది. వాషింగ్టన్ సుందర్ (1) రనౌట్ కాగా.. డెత్ ఓవర్లలో రాహుల్, జడేజా (24 నాటౌట్) ఆశించినంత దూకుడుగా ఆడలేకపోయారు. కానీ, చివరి ఓవర్‌లో చెలరేగిన రాహుల్ 18 పరుగులు రాబట్టడంతో.. టీమ్ స్కోరు 350 మార్క్ దాటింది.

7 — వన్డేల్లో దక్షిణాఫ్రికాపై విరాట్ కొట్టిన సెంచరీలు.

53 — వన్డేల్లో విరాట్ సెంచరీల సంఖ్య. ఓవరాల్‌గా మూడు ఫార్మాట్ల (టెస్టుల్లో 30, టీ20ల్లో 1)లో కలిపి 84 శతకాలు ఉన్నాయి.

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (సి) బాష్ (బి) యాన్సెన్ 22, రోహిత్ (సి) డికాక్ (బి) బర్గర్ 14, కోహ్లీ (సి) మార్‌క్రమ్ (బి) ఎన్‌గిడి 102, రుతురాజ్ (సి) జోర్జి (బి) యాన్సెన్ 105, రాహుల్ (నాటౌట్) 66, వాషింగ్టన్ (రనౌట్) 1, జడేజా (నాటౌట్) 24, **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 50 ఓవర్లలో 358/5; వికెట్ల పతనం:** 1-40, 2-62, 3-257, 4-284, 5-289; **బౌలింగ్:** బర్గర్ 6.1-0-43-1, ఎన్‌గిడి 10-1-51-1, యాన్సెన్ 10-0-63-2, కేశవ్ 10-0-70-0, బాష్ 8-0-79-0, మార్‌క్రమ్ 5.5-0-48-0.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్ (సి) రుతురాజ్ (బి) హర్షిత్ 110, డికాక్ (సి) వాషింగ్టన్ (బి) అర్ష్‌దీప్ 8, బవుమా (సి) హర్షిత్ (బి) ప్రసిద్ధ్ 46, బ్రిట్స్‌కే (ఎల్బీ) ప్రసిద్ధ్ 68, బ్రేవిస్ (సి) జైస్వాల్ (బి) కుల్దీప్ 54, జోర్జి (రిటైర్డ్ హర్ట్) 17, యాన్సెన్ (సి) రుతురాజ్ (బి) అర్ష్‌దీప్ 2, బాష్ (నాటౌట్) 29, కేశవ్ (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 49.2 ఓవర్లలో 362/6; వికెట్ల పతనం:** 1-26, 2-127, 3-197, 4-289, 5-317, 6-322, 6-332 (రిటైర్డ్ హర్ట్); **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10-0-54-2, హర్షిత్ 10-0-70-1, ప్రసిద్ధ్ 8.2-0-85-2, వాషింగ్టన్ 4-0-28-0, జడేజా 7-0-41-0, కుల్దీప్ యాదవ్ 10-0-78-1.

2 — 350కిపైగా పరుగులు చేసినా టీమిండియా మ్యాచ్ కోల్పోవడం ఇది రెండోసారి. 2019లో ఆస్ట్రేలియాతో వన్డేలో భారత్ 358/9 స్కోరు చేసినా.. ఓడింది.

20 — వన్డేల్లో భారత్ వరుసగా టాస్ ఓడడం ఇది 20వసారి.

11 — వన్డే క్రికెట్‌లో వరుస సెంచరీలు చేయడం కోహ్లీకిది పదకొండోసారి. ఈ జాబితాలో డివిల్లీర్స్ (6), రోహిత్ (4), బాబర్ ఆజమ్ (4), వార్నర్ (4), సయీద్ అన్వర్ (4) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలకు రూ.175 కోట్లు

- పంచాయతీరాజ్ శాఖకు విడుదల చేసిన సర్కారు
- బిల్లుల చెల్లింపుల్లోనూ మార్పులు
- 75% అడ్వాన్స్ చెల్లించాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.175 కోట్లు విడుదల చేసింది. నిధులు విడుదల చేయకపోవడంతో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం అధికారులకు భారంగా మారిందని పేర్కొంటూ.. 'ఎన్నికల నిర్వహణకు డబ్బులేవి?' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.175 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న కారణంగా నిధుల చెల్లింపు ప్రక్రియలో పాక్షికంగా సవరణలు చేసి, 75 శాతం నిధులను ముందస్తుగా చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ఏసీ బిల్లులపై 75 శాతం, డీసీ బిల్లులపై 25 శాతం ప్రకారం అంగీకరించాలని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్, అకౌంట్స్ విభాగానికి ఈ ఉత్తర్వుల ద్వారా సూచించారు. అదే విధంగా నిబంధనల ప్రకారం డీసీ బిల్లులను సకాలంలో సమర్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను ఆదేశించారు.

బీజేపీ, బీఆర్ఎస్ నాటకాలను ప్రజలు నమ్మరు

- ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాటకాలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సదుద్దేశంతో చేసిన వ్యాఖ్యలను రాజకీయ స్వార్థంతో వక్రీకరించడం సరికాదన్నారు. బుధవారం ఢిల్లీలో కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 140 ఏళ్ల చరిత్ర, అంతర్గత ప్రజాస్వామ్య విలువల గురించి సీఎం మాట్లాడితే, అందులోకి కులం, మతం, హిందువుల మనోభావాలను చొప్పించి రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పారని, ఇకనైనా వక్ర రాజకీయాలు మాని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీ చామల సూచించారు.

పైరసీతో పలు రంగాలకు పెనుముప్పు

- ఏటా వేలకోట్ల నష్టం.. కేంద్రం చర్యలు తీసుకోవాలి: లక్ష్మణ్

న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సినిమాలు, ఓటీటీ కంటెంట్, క్రీడా ప్రసారాలు, ఇతరత్రా అంశాల ఆన్‌లైన్ పైరసీ వల్ల దేశ సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థ, సృజనాత్మక రంగాలు, మేధో సంపత్తికి పెనుముప్పు ఏర్పడుతోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభలో ఆ పార్టీ ఎంపీ కె.లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యసభలో పైరసీ అంశాన్ని ఆయన బుధవారం ప్రత్యేకంగా ప్రస్తావించారు. పైరసీ వల్ల దేశంలోని చలనచిత్ర పరిశ్రమలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఏటా రూ.వేల కోట్లు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోందని చెప్పారు. 21 వేల సినిమాల పైరసీకి పాల్పడి దాదాపు రూ. 20 కోట్లకు పైగా అక్రమంగా సంపాదించిన వ్యక్తిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. పైరసీని అరికట్టేందుకు కాపీరైట్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ కె.లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న సీఎంపై చర్యలు తీసుకోవాలి: కవిత

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి పంచాయతీ ఎన్నికల ప్రచారం కోసం ప్రభుత్వ ధనంతో పట్టణ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తూ, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదినిని ఎస్ఈసీ కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. సీఎం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, తాము చూపిన రుజువుల ప్రకారం ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సమావేశాలు ప్రజాధనంతో కాకుండా, సొంత నిధులతో నిర్వహించుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా కొనసాగుతున్న సీఎం టూర్లను నిలిపివేయాలని, లేదా కఠినమైన ఆంక్షలు విధించాలని ఎస్ఈసీని కోరామని తెలిపారు.

ఔషధ నియంత్రణ సంస్థ బలోపేతానికి చర్యలు

హైదరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని యు.ఎస్.ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(యుఎస్ఎఫ్‌డీఏ) అధికారులు సందర్శించారు. ఉన్నతాధికారులతో సమావేశమై రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థను మరింత బలోపేతం చేయడం, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారని డీసీఏ డీజీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు యూఎస్ఎఫ్‌డీఏ నిర్వహించిన 13 తనిఖీలలో రాష్ట్ర డీసీఏ అధికారులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో బాలు విగ్రహ ఏర్పాటుపై వివాదం

- అభ్యంతరం వ్యక్తం చేసిన ఉద్యమ నేత పృథ్వీరాజ్

గన్‌పార్క్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు శుభలేఖ సుధాకర్ నేతృత్వంలో రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రముఖ తెలుగు నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం విగ్రహ నిర్మాణాన్ని సుధాకర్ పర్యవేక్షిస్తున్న క్రమంలో ప్రజా ఉద్యమ నేత పృథ్వీరాజ్ విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్నారు. రవీంద్రభారతిలో బాలు విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. ఆయన ఏపీకి చెందిన వారని, తెలంగాణకు చెందిన గొప్ప వాళ్ల విగ్రహాలు మాత్రమే ఇక్కడ ఏర్పాటు చేయాలని అభ్యంతరం వ్యక్తం చేశారు. విగ్రహం ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్ లక్ష్మణ్ కుమార్‌ను మీరెవరంటూ ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. సుధాకర్ జోక్యం చేసుకుని బాలు విగ్రహం ఏర్పాటుపై అభ్యంతరాలు వద్దని పృథ్వీరాజ్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయంపై సైఫాబాద్ పోలీస్ స్టేషన్ సీఐ రాఘవేందర్‌ను సంప్రదించగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఈనెలాఖరు లోపు శుభలేఖ సుధాకర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ చేతుల మీదుగా బాలు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు సమాచారం.

ఆటోలో ఇద్దరి మృతదేహాలు!

- చాంద్రాయణగుట్టలో కలకలం

మదీన, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటోలో ఇద్దరు యువకులు అనుమానాస్పద స్థితిలో విగతజీవులుగా పడి ఉండటం కలకలం రేపింది. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. శస్త్ర చికిత్సల సమయంలో వాడే మత్తు మందును అధికంగా తీసుకోవడం వల్లే వారు మరణించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరితో పాటు అదే మత్తు పదార్థాన్ని తక్కువ మోతాదులో తీసుకున్న మరో ఇద్దరు బాగానే ఉన్నట్లు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. చాంద్రాయణగుట్టలో ప్రధాన రహదారి పక్కన ఓ ఆటోలో ఇద్దరు చలనం లేకుండా పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. వారిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. వారిని పహాడీషరీఫ్‌కు చెందిన ఆటో డ్రైవర్ జహంగీర్‌ఖాన్ (24), రియాసత్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ (25)గా గుర్తించారు. శస్త్ర చికిత్సల సమయంలో వాడే మత్తు మందు ఇంజెక్షన్లను ఆటోలో స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో జహంగీర్, ఇర్ఫాన్‌తోపాటు కల్యాణ్, అక్రమ్ అనే మరో ఇద్దరు కూడా ఇదే మత్తు మందును తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే వారు కొద్ది మొత్తంలోనే తీసుకోవడంతో వారికి ఎలాంటి సమస్య లేనట్లు తెలిసింది. అధిక మోతాదులో మత్తు మందును తీసుకోవడం వల్లే జహంగీర్, ఇర్ఫాన్ మృతి చెందారని గుర్తించిన పోలీసులు.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఇంట్లో 'పంచాయతీ'.. ఆత్మహత్య!

వార్డు మెంబర్‌గా తల్లి, కూతురు నామినేషన్.. తల్లిపై పోటీ చేయనంటూ వెనక్కి తగ్గిన కూతురు

- గొడవ.. ఆవేదనతో తల్లి ఆత్మహత్య
- నల్లగొండ జిల్లా ఏపూరులో ఘటన
- మెంబర్‌గా ఎందుకు పోటీ అని భర్త నిలదీత.. భార్య ఆత్మహాయత్నాయత్నం
- వికారాబాద్ జిల్లాలో ఘటన
- పాలమూరులో 56, వికారాబాద్‌లో 38, ఖమ్మం జిల్లాలో 20 ఏకగ్రీవాలు
- 'కోతుల బెడదే' అజెండాగా మూడు గ్రామాల్లో అభ్యర్థుల ప్రచారం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

నల్లగొండ జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచే విషయమై ఇంట్లో నెలకొన్న అయోమయం.. ఆ క్రమంలో జరిగిన గొడవలు ఒకరి ఆత్మహత్యకు దారి తీశాయి. చిట్యాల మండలం ఏపూరు గ్రామంలో మూడవ వార్డు బీసీ మహిళకు రిజర్వ్ అయింది. ఆ వార్డు నుంచి మందుల లక్ష్మమ్మ(40) నవంబరు 27న నామినేషన్ వేశారు. ఆమెకు బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. అయితే ఆమె కూతురు అశ్వినిని అదే గ్రామానికి చెందిన బండ సురేశ్‌కు ఇచ్చి పదేళ్ల క్రితం పెళ్లి చేశారు. అదే వార్డు నుంచి అశ్విని, ఆమె తోడికోడలు అర్చన నామినేషన్లు వేశారు. అయితే కుమార్తెపై తానెలా పోటీ చేసేదని లక్ష్మమ్మ, తల్లిపై తానెలా పోటీ చేసేదని అశ్విని అయోమయంలో పడ్డారు. ఈ క్రమంలో తల్లిపై తాను పోటీ చేయలేనంటూ అశ్విని నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఇదే విషయాన్ని ఆమె.. తన తల్లికి చెప్పారు. అయితే ఈ విషయమ్మీద లక్ష్మమ్మ ఇంట్లో వివాదం నెలకొంది. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన లక్ష్మమ్మ ఆత్మహత్య చేసుకున్నారు. అయితే తన భార్య కడుపు నొప్పి భరించలేకే ఆత్మహత్య చేసుకున్నారని మృతురాలి భర్త మందుల నర్సింహ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో వార్డు మెంబర్‌గా ఓ మహిళ నామినేషన్ వేయగా.. ఎందుకు వేశావంటూ భర్త ప్రశ్నించడంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేశారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఆర్కతల గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మి వార్డు సభ్యురాలిగా నామినేషన్ వేశారు. ఎందుకు నామినేషన్ వేశావంటూ ఆమెను భర్త నరసింహులు నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త తీరుతో తీవ్ర మనోవేదనకు గురైన లక్ష్మి పురుగుల మందు తాగారు. చికిత్స కోసం ఆమెను కుటుంబ సభ్యులు లక్ష్మిని వికారాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఇక నామినేషన్ ఉపసంహరించుకున్న అభ్యర్థికి మళ్లీ బరిలో నిలిచే అవకాశం ఇచ్చారంటూ నల్లగొండ జిల్లా అనుముల మండలం పేరూరులో ఎన్నికలను గ్రామస్థులు బహిష్కరించారు. ఊర్లో ఎస్టీలకు ఒక్క ఓటు కూడా లేకపోయినా సర్పంచ్ స్థానాన్ని ఎస్టీకి రిజర్వు చేయడంతో నిరసనగా వార్డు మెంబర్లకు కూడా ఒక్కరూ నామినేషన్ వేయలేదు. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పేర్వాల సర్పంచ్ పదవికి వేలం నిర్వహించగా కాంగ్రెస్ మద్దతుదారు వీరమళ్ల రామకృష్ణ రూ.36 లక్షలకు దక్కించుకున్నారు. ఆ డబ్బును ఊర్లో ఆలయ నిర్మాణానికి వినియోగించాలని నిర్ణయించారు. మూడో విడతలో ఎన్నిక జరిగే సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి మల్యాల వేణు తనను గెలిపిస్తే ఊర్లో రూ.కోటి మేర అభివృద్ధి పనులు చేపడతానంటూ ప్రచారం చేస్తున్నారు. గ్రామంలో దుర్గమ్మ దేవాలయం కట్టిస్తానని, గ్రామ అవసరాల నిమిత్తం ఎకరంన్నర భూమి విరాళంగా ఇస్తానని ప్రకటించారు. దీంతో ఆయన్నే ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులు భావిస్తున్నారు.

ఖమ్మంలో 19 చోట్ల కాంగ్రెస్ మద్దతుదార్లే

తొలి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 20 గ్రామాలు ఏకగ్రీవమైతే 19 కాంగ్రెస్ మద్దతుదార్లకే దక్కాయి. వీటిలో డిప్యూటీ సీఎం భట్టి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర పరిధిలో ఆరు, మంత్రి తుమ్మల ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం పరిధిలో ఐదు పంచాయతీలు ఉన్నాయి. భట్టి స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో కాంగ్రెస్ మద్దతుదారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లగొండ జిల్లాలో 20 గ్రామాలు ఏకగ్రీవమైతే 17 మంది కాంగ్రెస్ మద్దతిచ్చిన అభ్యర్థులున్నారు. వికారాబాద్ జిల్లాలో 38 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమైతే సీఎం రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ పరిధిలో 13 పంచాయతీలున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 56 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. సిద్దిపేట జిల్లాలో 18 గ్రామాలు, మెదక్ జిల్లాలో 17 గ్రామాలు, కొత్తగూడెం జిల్లాలో 13 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. సిరిసిల్ల, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో తొమ్మిది గ్రామాల చొప్పున, భూపాలపల్లి, వరంగల్, సంగారెడ్డి, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆరు గ్రామాల చొప్పున, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో నాలుగు గ్రామల చొప్పున మంచిర్యాల జిల్లాలో మూడు గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామాలైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి, నరసన్నపేట గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.



మందుల లక్ష్మమ్మ

అన్నాచెల్లెలు.. తోడికోడళ్లు

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థులుగా అన్నాచెల్లెలు బరిలో నిలిచారు. గుమ్లాపూర్ ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. తెడ్డ శివకుమార్ తొలుత నామినేషన్ దాఖలు చేశారు. నాటకీయ పరిస్థితుల్లో అదే గ్రామానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకున్న ఆయన చెల్లెలు రైట్ల స్రవంతి కూడా నామినేషన్ వేశారు. ఈ ఇద్దరే బరిలో నిలిచారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం అల్లీపూర్‌లో తోడికోడళ్లే ప్రత్యర్థులయ్యారు. సర్పంచ్ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించగా తోడికోడళ్లు కొత్తపల్లి కళ, కొత్తపల్లి చంద్రకళ సర్పంచ్ బరిలో నిలిచారు.

నామినేషన్ పత్రాల చోరీ

మొదటి విడతలో ఎన్నికలు జరగనున్న వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గొట్లపల్లి, హన్మాపూర్, గిర్మాపూర్, జైరాంతండా(ఐ) పంచాయతీలకు సంబంధించి గొట్లపల్లి క్లస్టర్‌లో ఉంచిన నామినేషన్ పత్రాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ఎన్నికల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. మంగళవారం రాత్రి పంచాయతీ కార్యాలయం తాళం పగులగొట్టి గిర్మాపూర్, హన్మాపూర్, జైరాంతండాలకు సంబంధించిన నామినేషన్ పత్రాలను ఎత్తుకెళ్లారు. రిటర్నింగ్ అధికారి కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'తిరస్కరణ'తో రోడ్డెక్కిన ఎస్టీ మహిళ

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామానికి చెందిన ధరావత్ కల్పన సర్పంచ్‌గా పోటీ చేయాలనుకున్నా, తన పేరు ఓటర్ల జాబితాలో లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఆమె పేరును తక్షణమే మాడ్గులపల్లి మండల ఓటరు జాబితాలో చేర్చాలని హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం తీర్పిచ్చింది. ఆ వెంటనే ఆమె నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం పరిశీలించిన అధికారులు కల్పన నామినేషన్ తిరస్కరించారు. నామినేషన్ తిరస్కరణకు గల కారణాలపై మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇందుకోసం రెండు రోజుల గడువు ఉందన్నారు. కాగా తనకు న్యాయం చేయాలంటూ కల్పన, మండల కేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై నిరసన చేపట్టారు.

ముగ్గురు అభ్యర్థులు.. కోతుల బెడద

తమను గెలిపిస్తే ఊర్లో కోతుల బెడదను నివారిస్తాననే హామీని ఆ ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు తమ ప్రచారంలో ప్రస్తావిస్తున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం నేరేళ్లలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. సర్పంచ్ అభ్యర్థి జెట్టి నాగలక్ష్మి బుధవారం తన అనుచరుల్లో ఇద్దరికి ఎలుగుబంటి వేషం వేయించి ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్నంపల్లిలో చిరంజీవి అనే సర్పంచ్ పదవి ఆశావహుడు గ్రామాన్ని కోతుల సమస్య నుంచి విముక్తి చేస్తానని హామీ ఇవ్వడమే కాదు.. కోతులను పట్టేవారిని గ్రామానికి రప్పించి వాటిని తరలిస్తున్నారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి సర్పంచ్ అభ్యర్థి అజ్మీరా రాజేశ్వర్ గ్రామస్థుల మనసెరిగి ప్రచారంలో ముందుకు కదిలారు. కోతుల సమస్య తప్పించినవారికే ఓటేస్తామంటూ ఇటీవల ఓచోట గుమిగూడి ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో అలర్ట్ అయిన రాజేశ్వర్, కోతుల బెడద తప్పించేందుకు ఊర్లోకి ఓ కొండెంగను తీసుకొచ్చి, దానిని బోనులో ఉంచి ప్రచారం నిర్వహిస్తున్నారు.



వెన్నంపల్లిలో కోతులు పట్టిస్తున్న సర్పంచ్ ఆశావహుడు చిరంజీవి

బీఆర్ఎస్ నాయకుల వేధింపుల వల్లే ఆత్మహత్య

- పోలీసులకు మృతుడు ఆవ శేఖర్ తండ్రి ఫిర్యాదు



శేఖర్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంసాన్‌పల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తన కుమారుడు శేఖర్ వార్డు పదవికి వేసిన నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ బీఆర్ఎస్ నాయకులు వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ మృతుడి తండ్రి ఆవ వెంకటయ్య మహబూబ్‌నగర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 4వవార్డు నుంచి బీజేపీ మద్దతుతో శేఖర్ నామినేషన్ వేయగా అదే వార్డు నుంచి బీఆర్ఎస్ మద్దతుతో కంది యాదయ్యగౌడ్ నామినేషన్ వేశారన్నారు. యాదయ్య వార్డు పెద్దలు, తనను కలిసి శేఖర్‌ను నామినేషన్ విత్‌డ్రా చేసుకొమ్మనగా.. శేఖర్ ఒప్పుకోలేదన్నారు. తర్వాత యాదయ్యగౌడ్.. శేఖర్‌ను బెదిరించినట్టు వెంకటయ్య ఆరోపించారు. దీంతో మంగళవారం గ్రామానికి చెందిన ఒకరితో కలిసి శేఖర్ బైక్‌పై షాద్‌నగర్ వెళ్లాడని, అదే రాత్రి షాద్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి శేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. యాదయ్య గౌడ్ తన అనుచరులతో కలిసి బెదిరింపులకు పాల్పడ్డారని, విత్‌డ్రా చేసుకుంటే రూ.లక్ష ఇస్తామన్నారని వెంకటయ్య తెలిపారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన మహబూబ్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు తదుపరి విచారణ కోసం కేసును షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

'సింగూరు'కు అండర్ వాటర్ డ్రోన్ పరీక్షలు

- జలాశయం అడుగున పరిస్థితులపై అంచనా
- మరమ్మతుల కోసం నీటి నిల్వలను తగ్గించాలని సిఫారసు
- ఈఎన్‌సీ నేతృత్వంలోని సాంకేతిక కమిటీ భేటీ
- ఆయకట్టుకు క్రాప్ హాలిడే ఇవ్వనుండడంతో కాల్వలకు సైతం రూ.140 కోట్లతో లైనింగ్

హైదరాబాద్, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): పెను ప్రమాదంలో ఉన్న సింగూరు జలాశయానికి 'అండర్ వాటర్ డ్రోన్ టెక్నాలజీ'తో పరీక్షలు నిర్వహించారు. డ్రోన్‌ను జలాశయం అట్టడుగు వరకు పంపించి నీటి కింద స్థితిగతులపై సెన్సార్లు, కెమెరాల ద్వారా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించనున్నారు. త్వరలో జలాశయానికి మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఇది కీలకం కానుంది. హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు తాగునీటి సరఫరాతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలకు సాగు, తాగునీరు సరఫరా చేసే సింగూరు జలాశయానికి తక్షణమే మరమ్మతులు నిర్వహించకపోతే ఏ క్షణంలోనైనా జలాశయం తెగిపోయి దిగువ ప్రాంతాల్లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆనకట్ట భద్రత సమీక్ష కమిటీ (డీఎస్ఆర్‌పీ) హెచ్చరించిన విషయం తెలిసిందే. మరోవైపు, జలాశయానికి మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుసేన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సాంకేతిక కమిటీ బుధవారం జలసౌధలో సమావేశమై కీలక సిఫారసులు చేసింది. మరమ్మతులు చేపట్టేందుకు నీటిమట్టాన్ని 517.5 మీటర్లకు, నిల్వలను 8.17 టీఎంసీలకు తగ్గించేందుకు అనుమతించాలని సూచించింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 523.6 మీటర్లు, గరిష్ఠ నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు. ప్రస్తుతం 520.58 మీటర్ల నీటిమట్టం, 16.8 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. దీని ప్రకారం 8.63 టీఎంసీలను రోజుకు 0.3 మీటర్ల మేర కిందికి విడుదల చేస్తూ నీటిమట్టాన్ని తగ్గించాలని కమిటీ సూచించింది. ప్రభుత్వం అనుమతించిన వెంటనే ఈ ప్రక్రియ చేపట్టి.. మరమ్మతులు ప్రారంభించనున్నారు. ప్రభుత్వం ఇటీవల మరమ్మతులకు టెండర్లు పిలిచి.. రూ.13 కోట్ల అంచనా వ్యయంతో కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం చేసుకుంది. జలాశయం కింద ఉన్న ఆయకట్టుకు క్రాప్ హాలిడే ఇవ్వనుండడంతో కాల్వల లైనింగ్ పనులు చేపట్టేందుకు వీలు కలగనుంది. ప్రభుత్వం రూ.140 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనుంది. కాగా, ఒరిజినల్ డిజైన్ల ప్రకారం సింగూరు జలాశయం నీటిమట్టం 517.8 మీటర్లకు మించకుండా నిర్వహించాలి. అయితే మిషన్ భగీరథ అవసరాల కోసం 520.5 మీటర్లకు తగ్గించవద్దని 2017 అక్టోబరు 30న రాష్ట్ర ప్రభుత్వం జీవో 885 జారీ చేసింది. కొన్నేళ్లుగా సామర్థ్యానికి మించి నిల్వలు కొనసాగిస్తుండడంతో జలాశయం తీవ్రంగా దెబ్బతింది.

ప్రధానితో భేటీలో బీసీల ప్రస్తావన ఏది?

- బీజేపీ, కాంగ్రెస్‌ల మోసాన్ని బీసీ సమాజం గమనిస్తోంది
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతో జరిగిన భేటీలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ఎందుకు చర్చించలేదని సీఎం రేవంత్‌రెడ్డిని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించాలని కోరలేదంటే ఆయనకు బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో స్పష్టమవుతోందన్నారు. పార్లమెంట్ సమావేశాలు నడుస్తున్నందునా.. బీసీ రిజర్వేషన్ల గురించి కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఆ బాధ్యతను నిర్వర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి ఈ భేటీ నిదర్శనమని విమర్శించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన వినతిపత్రంలో కనీసం బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని ఈ పార్లమెంటు సమావేశాల్లో ఆమోదించాలనే విషయాన్ని ప్రస్తావించకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో కూడా బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం పార్లమెంటులో పోరాటం చేయాలని మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి కుక్కతోక వంకర అన్న చందంగా ఉందని, బీజేపీ, కాంగ్రెస్ చీకటి, లోపాయికారీ ఒప్పందం మూలంగానే బీసీ రిజర్వేషన్లపై బీజేపీని నిలదీయడం లేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీల కపటనాటకాన్ని బీసీ సమాజం గమనిస్తోందన్నారు. బీసీలపై వారి కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

రాహుల్ తెలంగాణ ఇస్తేనే.. నీకు పొలిటికల్ పర్సనాలిటీ వచ్చింది కేటీఆర్!

- విభజన వల్ల కాంగ్రెస్‌కు నష్టం జరుగుతుందని నేను రాహుల్‌కు చెప్పా
- అయినా తెలంగాణ ఇవ్వాలనుకున్నట్లు చెప్పారు.. నేను, కుసుమ్‌కుమారే సాక్ష్యం
- ఇచ్చిన మాటలను నెరవేర్చాలన్నారు
- కేటీఆర్.. రాహుల్‌ను విజన్ లేదని విమర్శిస్తవా?
- కేసీఆర్ వల్లనే నేను చట్టసభలకు వచ్చాను
- నాకు రాజకీయ విలువలున్నాయి కాబట్టే.. ఈ విషయం చెప్పగలుగుతున్నా
- నువ్వు రాహుల్‌పై మాట్లాడటం ఆపకుంటే.. నేను కేసీఆర్ గురించి మాట్లాడాల్సి వస్తది
- కేటీఆర్‌కు తూర్పు జగ్గారెడ్డి హెచ్చరిక



మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ తెలంగాణ ఇస్తేనే.. కేటీఆర్ కంటూ ఒక పొలిటికల్ పర్సనాలిటీ వచ్చిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. రాహుల్‌ను విమర్శించే పర్సనాలిటీ కేటీఆర్‌ది కాదన్నారు. కేటీఆర్‌కు ఏమాత్రం రాజకీయ విలువలు ఉన్నా.. రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసీ తెలంగాణ ఇచ్చిన రాహుల్ గాంధీకి విజన్ లేదంటూ విమర్శిస్తూ తప్పుగా మాట్లాడొద్దని పేర్కొన్నారు. రాహుల్ గాంధీపైన ఆయన మాట్లాడటం ఆపకుంటే.. తాను కేసీఆర్ గురించి అనేక విషయాలు బయట చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ తన వయసుకు మించిన మాటలు మాట్లాడుతున్నాడన్నారు.

రాహుల్ ఎంత గొప్పవాడంటే..!

తెలంగాణ ఏర్పాటుకు ముందు తాను రాహుల్‌ను కలిశానని, రాష్ట్రాన్ని విభజిస్తే కాంగ్రెస్ రాజకీయంగా నష్టపోతుందని చెప్పానని జగ్గారెడ్డి వెల్లడించారు. సీమాంధ్ర ప్రాంతంలో పార్టీ అవుట్ అయిపోతుందనీ చెప్పానన్నారు. తెలంగాణ ఇస్తే ఇక్కడ పూలు కురిపిస్తారే కానీ.. కాంగ్రెస్‌కు అధికారంమాత్రం ఇవ్వరనీ చెప్పానని వివరించారు. దానికి రాహుల్ స్పందిస్తూ.. తాము రాజకీయంగా ఆలోచన చేయట్లేదని, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వారి చిరకాల వాంఛ నెరవేర్చాలన్న నిర్ణయానికి తాను, అమ్మ సోనియాగాంధీ వచ్చినట్లు తెలిపారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీలోని గొప్పతనం, కమిట్‌మెంట్ ఇదన్నారు. రాహుల్ చెప్పిన ఈ మాటలకు తాను, జెట్టి కుసుమ్ కుమార్‌లే సాక్ష్యమని తెలిపారు. బీజేపీలో తనను రాజకీయంగా ఎదగకుండా చేస్తున్న సమయంలో కేసీఆర్ తనను పిలిచారని, ఆయన ఇచ్చిన బీ ఫారమ్ తోనే తాను సంగారెడ్డికి తొలిసారి ఎమ్మెల్యేను అయ్యానన్నారు. తనకు విలువలు ఉన్నాయి కాబట్టే గాంధీభవన్ వేదికగా ఈ విషయాన్ని చెబుతున్నానని పేర్కొన్నారు. కేటీఆర్‌కు కూడా రాజకీయ విలువలు ఉంటే.. పద్ధతిగా ఉండాలని, రాహుల్‌గాంధీ గురించి ఆచితూచి మాట్లాడాలని హితవు పలికారు. రాహుల్‌గాంధీ తెలంగాణ ఇచ్చుండకపోతే ఇవాళ కేసీఆర్ ఇంట్లో అధికారం, పైసల కోసం కొట్లాట జరిగేదే కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దేవుళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ నేతలు వక్రీకరిస్తున్నారని జగ్గారెడ్డి అన్నారు.

దివ్యాంగులకు 5 శాతం ఇందిరమ్మ ఇళ్లు

» మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెల్లడి

కరీంనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దివ్యాంగులకు 5% ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. రేకుర్తిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించిందని, దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని అన్ని బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీ గదికి తాళం

» ప్రభుత్వం సీరియస్.. మొదలైన ప్రక్షాళన

వరంగల్ మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి(వీసీ) గదికి బుధవారం తాళం వేశారు. పలు ఆరోపణలతో ప్రభుత్వం సీరియస్ కావడంతో రాజీనామా సమర్పించిన ఉప కులపతి.. తన చాంబర్‌కు వచ్చి సంతకాలు పెట్టినట్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. విశ్వవిద్యాలయ ఇతర ఉన్నతాధికారులను మందలించినట్లు తెలుస్తోంది. రాజీనామా చేసిన ఉప కులపతిని తిరిగి చాంబర్‌లోకి ఎలా అనుమతిస్తారని ప్రశ్నించినట్లు సమాచారం. వెంటనే చాంబర్‌కు తాళాలు వేయాలని ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా విశ్వవిద్యాలయంలో జరిగిన పలు అక్రమాలపై విచారణ జరిపిన విజిలెన్స్ బృందం.. బుధవారం నివేదికను ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలకు పరిపాలన అనుమతులు ఇచ్చేందుకు రాజీనామా చేసిన ఉప కులపతి రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు తాజాగా తెలిసింది. అయితే గదికి తాళం వేసిన విషయం తెలుసుకున్న ఆయన తన వద్ద ఉన్న రెండు వాహనాలను విశ్వవిద్యాలయానికి బుధవారం సరెండర్ చేశారు.

ఎస్టీ గురుకుల స్కూళ్ల భవన నిర్మాణాల్లో జాప్యం, నాణ్యతపై విజిలెన్స్ విచారణ

» వివరణ ఇవ్వాలని అధికారులకు నోటీసులు

» 'ఆంధ్రజ్యోతి' కథనంలోని అంశాల ఆధారంగా విచారణ

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో అక్రమాల డొంక కదులుతోంది. ఎస్టీ గురుకుల పాఠశాలల భవన నిర్మాణాల్లో జాప్యం, నాణ్యత, అక్రమాలపై గత నెలలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'అసంపూర్తిగా గిరిజన గురుకులాలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. 18 నెలల్లో పూర్తి చేయాల్సిన పనులను ఎనిమిదేళ్లుగా సాగదీయడం, పైగా పనుల్లో నాణ్యత లేకపోవడాన్ని పరిగణనలోకి తీసుకుని.. ఏకంగా విజిలెన్స్ అధికారులతో విచారణకు ఆదేశించింది. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేశారు. నిర్దిష్ట సమయంలో పనులు ఎందుకు పూర్తిచేయలేకపోయారో స్పష్టం చేయాలని ఆ నోటీసుల్లో ప్రశ్నించారు. దీంతో గిరిజన సంక్షేమ శాఖ అధికారుల్లో గుబులు మొదలైంది. రాష్ట్రంలో 188 ఎస్టీ గురుకుల విద్యాసంస్థలు ఉండగా.. వాటిల్లో 98 కొత్త భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.463 కోట్లు మంజూరు చేసింది. ఏడాదిన్నరలో భవన నిర్మాణాలు పూర్తిచేయాలని గడువు నిర్ణయించినా.. 2016-17, 2022-23లలో మంజూరు చేసిన భవన నిర్మాణాలు ఇంతవరకు పూర్తిచేయలేదు. దీంతో ప్రతి ఏటా 7% చొప్పున మొత్తం 56% మేరకు ప్రభుత్వంపై అదనపు భారం పడింది. వాస్తవానికి ఒక్కో భవన నిర్మాణానికి రూ.4.20 కోట్ల చొప్పున నిర్ణయించగా.. పనుల జాప్యం వల్ల ప్రతి భవనంపై రూ.2.50 కోట్లు అదనంగా చెల్లించాల్సి వచ్చింది. ఈ అంశాలపై సమగ్ర వివరాలతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన అంశాల ఆధారంగా విజిలెన్స్ అధికారులు ప్రశ్నావళి తయారు చేసి.. వాటికి సమాధానాలివ్వాలని సంబంధిత అధికారులకు నోటీసులిచ్చారు.

ఫార్ములా ఈ-కార్ రేసింగ్

» అర్వింద్‌కుమార్‌పై చర్యలకు కేంద్రానికి సీఎస్ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు ఆర్థిక అవకతవకల కేసుకు సంబంధించి ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను విచారించేందుకు అనుమతివ్వాలని కోరుతూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కేంద్రానికి లేఖ రాశారు. ఈ కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు ఇప్పటికే గవర్నర్ అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో ఏ2 నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అర్వింద్ కుమార్‌పై చార్జిషీట్ నమోదు చేయడానికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ అనుమతి తప్పనిసరి.

ఎలివేటర్ల భద్రతా ప్రమాణాలపై కొత్త చట్టం

» హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలివేటర్ల (లిఫ్టులు) వల్ల పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వాటి భద్రతా ప్రమాణాలపై కొత్త చట్టం తెచ్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని ప్రభుత్వ న్యాయవాదులు హైకోర్టుకు తెలియజేశారు. ఎలివేటర్ల వినియోగం పెరిగినా వాటి భద్రతకు సంబంధించి ఎలాంటి నిబంధనలు లేవంటూ రాజేంద్రనగర్‌కు చెందిన బర్కత్ అలీఖాన్ హైకోర్టుకు లేఖ రాశారు. హైకోర్టు ఆ లేఖను సుమోటోగా స్వీకరించి.. గతంలోనే ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తాజాగా బుధవారం చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చే వరకు లిఫ్టుల నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేస్తామని పేర్కొంది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఐపీఎస్ రొనాల్డ్ రోస్‌కు ఎదురుదెబ్బ

» ఆయనను తెలంగాణకు కేటాయించాలన్న క్యాట్ ఆదేశాలను సస్పెండ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఐఏఎస్ అధికారి రొనాల్డ్ రోస్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను తెలంగాణకు కేటాయించాలంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు డివిజన్ బెంచ్ సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ తాజాగా డీవోపీటీ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. దీనిపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. క్యాట్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివరణ ఇవ్వాలని రొనాల్డ్ రోస్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

బీసీ రిజర్వేషన్లపై విచారణ వాయిదా

హైదరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను సవాల్ చేస్తూ రెడ్డి జాగృతి నాయకుడు బుట్టెంగారి మాధవరెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ ఆరు వారాలకు వాయిదా పడింది. బీసీ రిజర్వేషన్ల జీవో 9పై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ లాభం లేకపోయింది. సుప్రీంకోర్టు సైతం 42% రిజర్వేషన్లను తిరస్కరిస్తూ.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి దాటరాదని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతానికి లోబడి రిజర్వేషన్లను ఖరారు చేయగా పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా బుధవారం బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం ముందుకు మరోసారి విచారణకు వచ్చాయి. కౌంటర్లు దాఖలు చేయడానికి ప్రభుత్వం సమయం కోరడంతో విచారణ ఆరు వారాల పాటు వాయిదా పడింది.



హుస్నాబాద్‌లో జరిగిన బహిరంగ సభ వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వివేక్, శ్రీధర్‌బాబు, తుమ్మల, అడ్లూరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వీహెచ్ తదితరులు

రెండోసారీ నేనే సీఎం

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రెండేళ్ల సమయంలోనే ప్రజాప్రభుత్వంగా తీర్చిదిద్దుకున్నాం. తన ప్రాణత్యాగంతో తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన శ్రీకాంతాచారి ఇదే రోజున (డిసెంబరు 3) అమరుడయ్యాడు. ఆయన ఆశయ సాధనలో భాగంగానే మా ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. వచ్చే ఆర్నెల్లలో మరో 40వేల ఉద్యోగాలను కల్పిస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూంల తరహాలో కాకుండా.. 4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, వచ్చే పదేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్లలోనే తెలంగాణను రోల్‌మోడల్‌గా చేసుకున్నామన్నారు. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నిర్మించిన ఎస్సారెస్పీ, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు చెక్కుచెదరకుండా ఇప్పటికీ తాగు, సాగునీటిని అందిస్తున్నాయని గుర్తుచేసిన రేవంత్ రెడ్డి.. "రూ.లక్ష కోట్లతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరంగా ఎందుకు మారింది?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిన శ్రీరాంసాగర్, బీఆర్ఎస్ నిర్మించిన కాళేశ్వరం ఎలా ఉన్నాయో చూడాలని సూచించారు.

హుస్నాబాద్ అందుకేనా?

తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్, హుస్నాబాద్ పాత్ర అత్యంత కీలకమని.. సోనియాగాంధీ ఇక్కడి నుంచే తెలంగాణ ప్రకటన చేసి 2014లో సాకారం చేశారని రేవంత్ గుర్తుచేశారు. బహుజన రాజ్యం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సైతం ఇదే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకున్నారని.. ఆయన స్ఫూర్తితోనే గడీల పాలనకు చరమగీతం పాడి ప్రజా పాలనను తెచ్చుకున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడానికి మాత్రమే హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఉపయోగించుకుందని విమర్శించారు. "సెంటిమెంట్‌కు తప్ప అభివృద్ధి చేయడానికి హుస్నాబాద్ పనికిరాలేదా?" అని ప్రశ్నించారు. గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేటలో నిధులు పారించి ఇక్కడ మాత్రం నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ రిజర్వాయర్లను వేగంగా పూర్తి చేసి.. గండిపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులను ఎందుకు గమ్యం చేర్చలేదని సీఎం ప్రశ్నించారు. "ఆ నియోజకవర్గాల్లో దేవుళ్లేమైనా పాలించారా?" అని మండిపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో హుస్నాబాద్ దశ, దిశ మారుస్తామని, గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు పూర్తి చేయిస్తామని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో కిరికిరిగాళ్లను కాకుండా మంచివాళ్లను, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసేవాళ్లను ఎన్నుకోవాలని సీఎం సూచించారు. వీలైతే ఏకగ్రీవం చేసుకోవాలని.. లేదంటే గ్రామాభివృద్ధి కోసం పనిచేసేవారికి పట్టం కట్టాలని సూచించారు. అలాగే.. రాష్ట్రంలో ఐటీఐల స్థానంలో ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నామని.. అంబాసిడర్ కార్ల స్థానంలో బెంజ్, ఆడీ, బీఎండబ్ల్యూ వంటి కార్లు వచ్చాయని.. అదే స్థాయిలో ఈ సెంటర్లలో సాంకేతిక మెలకువలు నేర్పిస్తామని పేర్కొన్నారు. ఇక అంబాసిడర్ కార్లు ఫాంహౌస్‌లోని షెడ్డుకే పరిమితమవుతాయని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. కాగా.. మంత్రులు పొన్నం, తుమ్మల, దుద్దిళ్ల, వివేక్, అడ్లూరి, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, విజయరమణ రావు, రాజ్‌ఠాకూర్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, సీనియర్ నేత వీహెచ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


హుస్నాబాద్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు



గాయకురాలు కనకవ్వతో సీఎం; విద్యార్థినిని ఆశీర్వదిస్తున్న రేవంత్

సామెతలతో ఆకట్టుకున్న రేవంత్

హుస్నాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి హుస్నాబాద్ బహిరంగ సభలో సర్పంచ్‌లను ఎన్నుకునే విషయంపై పలు సామెతలు చెప్పి ప్రజలను ఆకట్టుకున్నారు. "మనకు సుట్టం ఉంటే ఉండవచ్చు. కానీ.. ఏడ బావా అన్న సరేగానీ వంకాయ తోట కాడ బావా అనొద్దని ఎనుకటి పెద్దోళ్లు చెప్పిండ్రు. ఇంకా ఒగడొగడు ఉంటడు. మూడెడ్లకు 33 దొడ్లు ఉన్నాయని కొంకణాలు చెప్పెటోడు వస్తడు.. ఇట్లంటోళ్లను సర్పంచ్‌లు, వార్డు మెంబర్లుగా చేసినట్లయితే బుద్ధిమంతుడని సద్ది కడితే సక్కగా బొడ్రాయి కాడ బోజనం చేసి ఇంకేమి పెడుతరు అని అంటరు" అని నవ్వులు పూయించారు. గ్రామాలకు వెలుగులు నింపే వారిని ఎన్నుకోవాలని, మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడి గ్రామానికి నిధులు తెచ్చేవారిని ఎన్నుకోవాలని సూచించారు.

ఇంటి దొంగలెవరు?

» హిల్ట్ పత్రాల బహిర్గతంపై ఇంటెలిజెన్స్ విచారణ

» రంగంలో దిగిన నిఘా బృందాలు

హైదరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని ప్రాంతంలోని పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడికి సంబంధించిన హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్) పాలసీ రూపకల్పనకు కసరత్తు జరుగుతున్నప్పుడే అందుకు సంబంధించిన పత్రాలు లీకైన అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం ఇంటెలిజెన్స్ విచారణకు ఆదేశించింది. హిల్ట్ భూముల అంశానికి సంబంధించిన ముఖ్యమైన పత్రాలు విపక్షాలకు ముందే ఏవిధంగా చేరాయి? జీవో రాక ముందే ఆ విషయం ఎలా బయటకు పొక్కింది? ఏయే శాఖల సిబ్బందికి ఇందులో సంబంధం ఉంది? సిబ్బంది స్థాయిలోనే పత్రాలు బయటకు వెళ్లాయా? లేక ఉన్నతాధికారుల పాత్ర ఉందా ? అనే విషయాలపై నివేదిక ఇవ్వాలని ఇంటెలిజెన్స్ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించింది. నవంబరు 21న విలేకరుల సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. హిల్ట్ పాలసీపై విమర్శలు చేశారు. ఈ సమావేశానికి ముందే అనగా నవంబరు 20న హిల్ట్ పత్రాలకు సంబంధించిన ఫొటోషాప్ స్లైడ్స్ బయటకు వెళ్లినట్లు ప్రభుత్వం అనుమానిస్తుంది. పరిశ్రమల శాఖలో పాలసీ తయారీ సమయంలో వాటిని లీక్ చేసింది ఏవరు? అనే విషయాలను తెలుసుకోవడానికి నిఘా విభాగం రంగంలో దిగింది. సచివాలయం లోగుట్టు బయటకు వెళ్తున్న క్రమంలో ఇంటిదొంగలను పట్టుకోవడమే లక్ష్యంగా ప్రయత్నాలు ప్రారంభించింది. పరిశ్రమల శాఖలో ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు గత ప్రభుత్వంలో ఏయే చోట్ల పని చేశారు? వారిలో ఎవరైనా ప్రతిపక్ష నాయకునితో సంబంధాలు కొనసాగిస్తున్నారా? అనే విషయాలపై నిఘా వర్గాలు దృష్టి పెట్టాయి. హిల్ట్ పాలసీకి సంబంధించి డాక్యుమెంట్ తయారైన తర్వాత ఏయే స్థాయి వ్యక్తుల వద్దకు వెళ్లింది? వారికి గత ప్రభుత్వంలోని వారితో సంబంధాలున్నాయా? అనే విషయాన్ని నిర్ధారించుకోవడానికి సచివాలయంలోని పలువురి అధికారులు, సిబ్బందిని నిఘా విభాగం అధికారులు ప్రశ్నించే అవకాశముందని తెలిసింది.

అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు నెలకు రెండు సార్లే!

అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల సరఫరాలో నిబంధనలకు అధికారులే నీళ్లొదిలారు. నాణ్యమైన గుడ్లు, 10 రోజులకోసారి చొప్పున నెలకు మూడు సార్లు సరఫరా చేయాలని ప్రభుత్వం జారీ చేసిన టెండర్ మార్గదర్శకాలను అధికారులే తుంగలో తొక్కారు. ఆ నిబంధనలకు విరుద్ధంగా నెలకు రెండు సార్లు సరఫరా చేస్తామన్న కాంట్రాక్టర్లకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. ఏకీకృత టెండర్ విధానానికి విరుద్ధంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం.. మిగిలిన గురుకులాలు, హాస్టళ్లలో గుడ్ల సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

మైనార్టీ నిధుల్లో తెలంగాణకు మొండిచేయి

» మూడేళ్లుగా 'పీఎంజేవీకే' కింద ఒక్కరూపాయి అందలేదు

న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమానికి సంబంధించి నిధుల విడుదలలో తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపుతోంది. 'ప్రధాన్ మంత్రి జన్ వికాస్ కార్యక్రమం' కింద గత మూడేళ్లుగా తెలంగాణకు ఒక్క పైసా నిధులివ్వలేదు. ఈ అంశంపై లోక్‌సభలో ఎంపీ రఘువీర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. పీఎంజేవీకే పథకం కింద గత మూడేళ్లలో తెలంగాణకు నిధులేమీ విడుదల చేయలేదని తెలిపారు. మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాలు 2021-22 విద్యా సంవత్సరం తర్వాత కొనసాగింపునకు ఆమోదం పొందలేదని తెలిపారు. 2019-22 మధ్యకాలంలో రాష్ట్రంలో ప్రి మెట్రిక్ కింద రూ.178 కోట్లు, పోస్ట్ మెట్రిక్ కింద రూ.45 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. గతంలో ఉన్న 'నయా మంజి', 'నయా రోష్ని', 'సీఖో ఔర్ కమావో' వంటి నైపుణ్యాభివృద్ధి పథకాలను నిలిపివేసి, వాటిని కొత్తగా తెచ్చిన 'పీఎం వికాస్' పథకంలో విలీనం చేసినట్లు పేర్కొన్నారు. ఈ విలీనం కారణంగా పాత పథకాల కింద గత మూడేళ్లుగా(2022-25) రాష్ట్రానికి కొత్తగా ఎలాంటి ప్రాజెక్టులు కేటాయించలేదని తెలిపారు.

3,133 మంది చిన్నారుల అదృశ్యం

తెలంగాణలో 2023లో 3,133 మంది చిన్నారులు అదృశ్యమైనట్లు కేంద్రం వెల్లడించింది. వీరిలో 2,627 మంది ఆచూకీని గుర్తించి వారి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిసింది. రాజ్యసభలో బుధవారం కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ ఈమేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కాగా, తెలంగాణలో బడి బయట ఉన్న పిల్లల సంఖ్య 2024-25 విద్యా సంవత్సరంలో భారీగా పెరిగింది. 2023-24లో 5,440 మంది బడికి దూరంగా ఉండగా 2024-25 నాటికి ఆ సంఖ్య ఏకంగా 11,449కి చేరినట్లు కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో ఎంపీ రేణుకా చౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 'ప్రబంధ్ పోర్టల్ గణాంకాల ప్రకారం.. తెలంగాణలో 2021-22లో మొత్తం 9,113 మంది పిల్లలు బడి బయట ఉండగా అందులో 4,313 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. ఈ సంఖ్య 2022-23లో తగ్గి 5,255కి(బాలికలు 2,437) చేరిందన్నారు. అయితే 2023-24 నాటికి ఆ సంఖ్య మొత్తం 5,440 మంది(బాలికలు 2,426) చేరగా, 2024-25కి 11,449కి పెరిగిందని కేంద్రమంత్రి వివరించారు. ఈ విద్యాసంవత్సరంలో ప్రాథమిక సమాచారం ప్రకారం.. 4,753 మంది(బాలికలు 2,006) బడి బయట ఉన్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణకు అండగా నిలవండి

మీరు సహకరిస్తే గుజరాత్ నమూనాలా తెలంగాణ నమూనా సృష్టిస్తా

» మన్మోహన్‌సింగ్ మీకు సహకరించినట్లే.. మీరూ నాకు సహకరించండి

» తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కండి

» ప్రధాని మోదీని కోరిన సీఎం రేవంత్

న్యూఢిల్లీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ అభివృద్ధికి కీలక సహకారం అందించినట్లే.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కూడా పూర్తి అండదండలు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ప్రధాని సంకల్పించిన వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దాలని సంకల్పించామని చెప్పారు. ఈ లక్ష్యాలు సాధించాలంటే కేంద్రం మద్దతు అవసరమన్నారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్రధానమంత్రిని కలుసుకున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధానిని ఆహ్వానించారు. ఈ మేరకు ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను ప్రధానికి అందజేశారు. వికసిత్ భారత్‌కు అనుగుణంగా అన్నిరంగాల్లో వృద్ధి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించామని, వీటిని 2047 విజన్ డాక్యుమెంట్‌లో చేర్చామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా చేపట్టే అభివృద్ధి పనులు సాకారం కావాలంటే కేంద్రం తగిన సహాయ సహకారాలు అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పలు ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. "మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు గుజరాత్ మోడల్‌కు మీకు సహకరించారు కదా! అలాగే మీరు కూడా నాకు సహకరించాలి" అని మోదీని కోరినట్లు మీడియాతో రేవంత్ అన్నారు. ఇందుకు మోదీ కూడా అంగీకరించారని చెప్పారు.


ప్రియాంకకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో రాహుల్‌గాంధీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

'మీరు ఆశీస్సులందిస్తే తప్పకుండా గుజరాత్ నమూనా ప్రాతిపదికగా తెలంగాణ నమూనాను సృష్టిస్తా అని చెప్పినప్పుడు మోదీ నవ్వుతూ అంగీకరించారు' అని రేవంత్ వెల్లడించారు.

పనులకు అనుమతులు ఇవ్వండి..

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు తగిన అనుమతులు ఇవ్వాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ కోరారు. 1,625 కిలోమీటర్ల పొడవున విస్తరించే ప్రతిపాదనలను ఇప్పటికే సమర్పించామని చెప్పారు. రూ.49,848 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు ఆమోదం తెలపాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర భాగానికి క్యాబినెట్ ఆమోదంతోపాటు ఆర్థిక మంజూరీ చేయాలని, దక్షిణ భాగం నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని కూడా కోరారు. ఆర్ఆర్ఆర్‌కు సమాంతరంగా రీజినల్ రైల్వే ప్రాజెక్టును త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు హైస్పీడ్ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణాలు చేపట్టేందుకు కేంద్రం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిరంతరం రవాణా సదుపాయాలు కల్పించేందుకు టైగర్ రిజర్వ్ మీదుగా మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు ఫోర్ లేన్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనల్ని ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర మంత్రులకూ ఆహ్వానం..

భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలువురు కేంద్రమంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఐటీ, రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌లను రేవంత్ కలుసుకున్నారు. ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. కాగా కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌ను భట్టి విక్రమార్క వేరుగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

సోనియా, రాహుల్, ప్రియాంకకు ఆహ్వానం

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలంటూ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. పార్లమెంట్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మరోసారి కలుసుకుని పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలపై చర్చించారు.

5.60 లక్షల ఎకరాలకు యాసంగి సాగు

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యాసంగి పంటల సాగు విస్తీర్ణం 5.60 లక్షల ఎకరాలకు చేరుకుంది. వరినాట్లు ఇప్పుడిప్పుడే మొదలవుతుండగా.. మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటల విస్తీర్ణం సాధారణ సాగు విస్తీర్ణంలో సుమారు 40 శాతానికి చేరుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయశాఖ బుధవారం సాగు నివేదికను సమర్పించింది. ఆ నివేదిక ప్రకారం.. యాసంగి సీజన్‌లో మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 68,67,407 ఎకరాలు కాగా... ఇప్పటివరకు 5,60,456 ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. నిరుటితో పోలిస్తే వరినాట్లు కాస్త ముందస్తుగానే మొదలయ్యాయి.



ఉమ్మడి జిల్లాల వారీగా ఇప్పటివరకు సాగైన విస్తీర్ణం

ఆదిలాబాద్	1,06,161
నిజామాబాద్	1,13,045
కరీంనగర్	20,245
మెదక్	27,118
వరంగల్	84,084
ఖమ్మం	51,704
రంగారెడ్డి	8,749
మహబూబ్‌నగర్	1,26,300
నల్లగొండ	5,850

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


MARUTI SUZUKI
NEXA
INTRODUCTING
GRAND VITARA LIMITED EDITION
EFFECTIVE PRICE OF
₹ 9.99 LAKH*
GRAND VITARA
LIMITED EDITION
GET ACCESSORY PACKAGE OF MORE THAN
₹ 75 000#
GRAND VITARA
AMBIENT LIGHT DOOR SILL GUARD (BLACK)
ALL WEATHER 3D MAT
DOOR VISOR PREMIUM (STAINLESS STEEL)
INTERIOR DOOR LIGHTING SOLUTION 4 DOOR
5 YEAR WARRANTY~
3 YEARS + 2 YEARS COMPLIMENTARY
NEXA SAFETY SHIELD
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at
1800-200-[6392]
1800-102-[6392]
For detailed T&C kindly visit your nearest dealership. Creative visualization. For details on functioning of safety features, including airbags, kindly refer to the owner's manual. *Cost of Accessories is applicable on Zeta & Alpha variants. All offers are brought to you by NEXA dealers only. *Ex. showroom price of ₹ 10.77 lakh, Exchange Offer (-) ₹ 80 000 = ₹ 9.96 lakh. The actual effective price mentioned may vary based on the customer's eligibility, profile, and applicable offers at the time of purchase. Offers may vary subject to the model and variant purchased. All offers are applicable till stocks last. Maruti Suzuki reserves the right to withdraw offers at any point in time without any advance notice. Features and accessories shown may not be a part of the standard fitment. Black glass shade on the vehicle is due to the lighting effect. Limited edition is applicable for Sigma and Delta variants of Grand Vitara. ~This extended warranty is applicable for Delta+, Zeta, Zeta+, Alpha & Alpha+ variants except CNG variants of Grand Vitara. Please visit NEXA showroom for details of the items contained in the limited edition kit.